13-7Pg1exHMNWJQE.qxd:13-7Pg1exHMNWJQE.qxd 13/07/25 12:23 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
13-7-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 162 పేజీలు: 12 వెల: 8.00

ఉత్పత్తి రంగమే ఉపాధికల్పనకు మూలం: ప్రధాని

దక్షిణాదిరాష్ట్రాల అభివృద్ధితోనే 'వికసిత్ భారత్' : అమిత్‌షా

9లో

# అత్యద్భుతంగా క్వాంటం వ్యాలీ


## ప్రపంచ దృష్టిని ఆకర్షించే దిశలో నిర్మాణం

### స్టార్టప్‌లు, పరిశోధన సంస్థలు, హార్డ్‌వేర్, వర్సిటీలకు నిలయం

### రూ.30,000 కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా

### త్వరలోనే నూతన డిఫెన్స్ పాలసీ

### వ్యాలీ జనవరి 1న ప్రారంభించేందుకు ఏర్పాట్లు: సీఎం చంద్రబాబు



**విజయవాడ,జూలై12,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో క్వాంటం వ్యాలీ భవనాన్ని ఐకానిక్‌గా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భవన నిర్మాణం జరుగుతుందన్నారు.ఇందుకు అనుగుణంగా వివిధ నమూనాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.క్వాంటం వ్యాలీని వచ్చే నిర్దేశిత గడువుకల్లా ప్రారంభించాలనే లక్ష్యంలో భాగంగా ఆయా అంశాలకు సంబంధించి సీఎం చంద్రబాబు చర్చలు నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో క్వాంటం వ్యాలీ భవనంపై అధికారులతో ఆయన సమీక్షించారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు. 40,000 చదరపు అడుగుల్లో చేపట్టే ఈ భవన నిర్మాణానికి సంబందించిన నమూనాలు పరిశీలిస్తున్నామన్నారు. ప్రపంచ దృష్టిని ఆకర్షించే దిశలో ఈ భవనం ఉంటుందన్నారు. అమరావతి క్వాంటం వ్యాలీ ఆకృతి గురించి విశ్వవ్యాప్తంగా చర్చ జరిగే దిశలో భవనాలు ఉండాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. నమూనా ఎంపికపై 2 సార్లు అధికారులతో చర్చించారు. మరో వారంలో నమూనా ఎంపిక కొలిక్కి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. 2026 జనవరి ఒకటో తేదీన అమరావతిలో క్వాంటం వ్యాలీ ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. 156 క్యూబిట్‌ల క్వాంటం టూ కంప్యూటర్‌ను ఏర్పాటు చేసేందుకు ఐబీఎం సంస్థ డీపీఆర్‌ను ప్రభుత్వానికి అందించింది. అమరావతి క్వాంటం వ్యాలీలో కంప్యూటర్ పరిశోధన అభివృద్ధి కేంద్రాన్ని ఐబీఎం సంస్థ ఏర్పాటు చేయనుంది. దీనికోసం ప్రస్తుతం అమ రావతిలో 40,000 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న భవనాన్ని నిర్మిస్తుంది.

**లైటింగ్ శబ్ధాలు వినిపించకుండా:** క్వాంటం కంప్యూటర్ గాల్లోని కాంతి కణం ఫోటాన్ ఆధారంగా పనిచేస్తుంది. ఈ దృష్ట్యా ప్రత్యేకమైన భద్రతతో కూడిన వాతావరణం ఉండాలి. క్వాంటం కంప్యూటర్ ఉన్న గదిలోకి వెంట్రుక మందం ఖాళీ నుంచి గాలి వెళ్లినా వేవ్స్ తగిలినా ప్రాసెసర్‌పై ప్రభావం పడి వచ్చే ఫలితం మారిపోతుంది. కంప్యూటర్ ఏర్పాటుచేసే గది చుట్టూ గోడలు నిర్మిస్తూ ఐసోలేట్ చేసుకుంటూ వస్తారు. బయటి నుంచి లైటింగ్ శబ్ధాలు వినిపించకుండా ఇన్సులేషన్‌తో గది నిర్మాణం ఉంటుంది. కొన్ని లేయర్ల నిర్మాణాల తర్వాత క్వాంటం కంప్యూటర్ ఉండే ప్రాంతం ఉంటుంది. అందులో 273 డిగ్రీల ఉష్ణోగ్రత నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తారు. కంప్యూటర్‌లో వినియోగించే ప్రతి చిన్న విడిభాగానికి ఒక శాస్త్రవేత్త ఉంటారు. క్వాంటం ఫిజిక్స్, క్వాంటం సెన్సింగ్ వంటి వివిధ సాంకేతికతల మేళవింపుతో క్వాంటం కంప్యూటర్ తయారవుతుంది. ఇక్కడి నుంచే క్లౌడ్ ద్వారా ప్రపంచం మొత్తానికి క్వాంటం సేవలను సంస్థ అందిస్తుంది. ఐబీఎం సంస్థ తయారు చేసే క్వాంటం కంప్యూటర్‌లో వినియోగించే సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ డిజైన్ల తయారీ అనుబంధ యూనిట్లు కూడా ప్రస్తుతం ఏర్పాటు చేసేందుకు వీలుగా స్పేస్‌ను కేటాయించనున్నారు.దశలవారీగా 90లక్షల చదరపు అడుగుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నదే లక్ష్యమని సీఎం అధికారులకు నిర్దేశించారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటి మాదిరే ప్రభుత్వ, ప్రైవేటు బాగస్వామ్యంతో డెవలపర్ల భవనాలను నిర్మించి వివిధ కంపెనీలకు స్పేస్ లీజుకు ఇవ్వనున్నారు. భవనాల నిర్మాణానికి ముందుకు వచ్చే సంస్థలకు క్వాంటంవ్యాలీలో ప్రభుత్వం భూములను ఇస్తుంది. >>2

# 15, 16న సీఎం ఢిల్లీకి

## అమిత్‌షా సహా పలువురు కేంద్ర మంత్రులతో భేటీ

### సిఐఐ బిజినెస్ మీట్‌లో పాల్గొననున్న సిఎం

**విజయవాడ,జూలై 12,ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల పాటు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ నెల 15,16వ తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులతో భేటీ సహా వేర్వేరు కార్యక్రమాలకు ముఖ్యమంత్రి హాజరుకానున్నారు. రాష్ట్రంలో చేపడుతోన్న వివిధ ప్రాజెక్టులు, కేంద్ర గ్రాంట్లపై సీఎం వారితో చర్చించనున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, మంత్రులు అశ్వినీ వైష్ణవ్, సీఆర్ పాటిల్, మన్సుఖ్ మాండవీయ, నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ తదితరులతో సీఎం తన ఢిల్లీ పర్యటనలో భేటీ కానున్నారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులు, వాటికి అవసరమైన నిధులు, పోలవరం బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సహా వేర్వేరు అంశాలపై సీఎం కేంద్ర మంత్రులతో చర్చించనున్నారు. అలాగే గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన పనుల గురించి కూడా ఆయా మంత్రిత్వశాఖతో సీఎం చర్చలు జరుపనున్నారు. 15వ తేదీ ఉదయం అమరావతి నుంచి ఢిల్లీ వెళ్లనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మధ్యాహ్నం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ కానున్నారు. అదే రోజు కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, ఢిల్లీ మెట్రో రైల్ ఎండీలతోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం కానున్నారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం లైబ్రరీలో జరుగనున్న మాజీప్రధాని పీవీ నరసింహారావు సంస్మరణ కార్యక్రమంలో >>2

# 5 సిటీలకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు

### విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి. గుంటూరు ఎంపిక

### ప్రకటించిన కేంద్రం

**విజయవాడ జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం వివిధ కేటగిరీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, రాజమహేంద్రవరం,విజయవాడ , తిరుపతి, గుంటూరుకు అవార్డులు దక్కాయి. జాతీయ స్థాయిలో స్పెషల్ కేటగిరీ మినిస్టీరియల్ అవార్డును విశాఖ నగరం దక్కించుకుంది. రాష్ట్ర స్థాయిలో మినిస్టీరియల్ అవార్డుకు రాజమహేంద్రవరం ఎంపికైంది. స్వచ్ఛ సూపర్‌లీగ్ సిటీస్ విభాగంలో విజయవాడ, గుంటూరు, తిరుపతి నగరాలు >>2

## పోలీసు విచారణకు హాజరైన వల్లభనేని

**విజయవాడ,జూలై12,ప్రభాతవార్తప్రతినిధి:** గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ తీవ్ర జ్వరంలోనూ శనివారం విచారణకు హాజరయ్యారు. మైనింగ్ కేసులో ప్రతి నెలలో రెండవ శనివారం ఆయన పోలీస్ స్టేషన్‌కు హాజరు కావాల్సి ఉంది. ఆయన ముక్కు రంధ్రం పూడిపోవడంతో శ్వాస తీసుకోవడానికి సమస్య ఏర్పడగా ప్రయివేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకున్నారు. ఆపరేషన్ తర్వాత గుండె సమస్య వచ్చినట్లు అనుమానించిన డాక్టర్లు శనివారం ఉదయం ఆయనకు ఎన్జీయోగ్రామ్ చేశారు. ఈ క్రమంలో తీవ్ర జ్వరానికి లోనయ్యారు. అయినా కోర్టు ఆదేశాల >>2


నది వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

## తుంగభద్రలో భక్తుల గల్లంతు

### గాలిస్తున్న పోలీసులు

**మంత్రాలయం, జూలై12, ప్రభాతవార్త;** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయంలోని తుంగభద్ర నదిలో ముగ్గురు యువ భక్తులు గల్లంతైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం హాసన్‌కు చెందిన రంగనాథ్, హేమంత్, దర్శన్, నారాయణ, సచిన్, అజిత్, ప్రమోద్ స్నేహితులు. వారు మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనానికి శనివారం వచ్చారు. స్నేహితులతో కలిసి తుంగభద్ర నదిలో స్నానం చేసేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు సచిన్, ప్రమోద్, అజిత్ అనే యువ భక్తులు గల్లంతయ్యారు. సమాచారం తెలుసుకున్న మంత్రాలయం ఎస్ఐ శివాంజల్, >>2


శనివారం టిటిడి అధికారులతో సమావేశమైన దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

## విజయవాడ దుర్గమ్మ గుడికి మరో రోడ్డు మార్గం

### నిరుద్యోగ అర్చకులకు రూ.3వేలు భృతి

### శ్రీవాణిట్రస్ట్ నిధులు ఆలయాలకు విడుదల చేయాలి

### టిటిడి, దేవాదాయశాఖ సమావేశంలో మంత్రి ఆనం

**తిరుమల.జూలై 12ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని దేవాలయాల అభివృద్ధిలో భాగంగా విజయవాడకనకదుర్గమ్మ ఆలయానికి భక్తులు సులభంగా చేరుకునేందుకు మరోఘాట్‌రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు రాష్ట్రదేవదాయశాఖమంత్రి ఆనంరామనారాయణరెడ్డి తెలిపారు. ఇందుకు టిటిడి సహకారం కావాలని కోరామన్నారు. దేవాదాయచట్టం ప్రకారం గతంలో 5శాతం ఉన్న కామన్ గుడ్‌ఫండ్(సిజిఎఫ్)ను 9శాతానికి పెంచడం జరిగిందన్నారు. 9శాతం సిజిఎఫ్ నిధులను టిటిడి నుండి తీసుకోవాల్సిన నిబంధనలు ఉన్నాయని కీలక వ్యాఖ్యలు >>2

# 15న శుక్లా భూమిపైకి

**ఫ్లోరిడా(నాసా),జూలై 12:** యాక్సియం 4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా సహా మరో ముగ్గురు 18 రోజుల యాత్ర అనంతరం జులై 15న భూమ్మీదకు తిరిగి రానున్నారు. జూలై 15న ఐఎస్ఎస్‌ను వీడి కాలిఫోర్నియా తీరంలో వ్యోమగాములు ల్యాండ్ అవ్వనున్నారు. వెంటనే నలుగురు వ్యోమగాములను వారం రోజుల పాటు క్వారంటైన్‌కు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. క్రూ డ్రాగన్ అంతరిక్ష నౌకను తొలగించిన జూలై 15న మధ్యాహ్నం 3 గంటలకు కాలిఫోర్నియా తీరం సమీపంలో ముగ్గురు వ్యోమగాములు ల్యాండ్ అవుతారని ఇస్రో తెలిపింది. ల్యాండింగ్ తర్వాత భూవాతావరణానికి వారి శరీరాలు అలవాటుపడేందుకు వీలుగా వైద్యాధికారుల పర్యవేక్షణలో సుమారు 7 రోజులు పునరావాసంలో ఉంటారని పేర్కొంది. వారం రోజుల పాటు ఇస్రోకు చెందిన వైద్యాధికారులు వ్యోమగాముల ఆరోగ్యం, ఫిట్‌నెస్ నిరంతరం పర్యవేక్షిస్తారని వెల్లడించింది. అంతరిక్షం నుంచి భూమికి బయల్దేరే ముందు కూడా వారికి పలు ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తారని స్పష్టం చేసింది. శుభాంశు శుక్లా మంచి ఆరోగ్యంగా, ఉత్సాహంతో ఉన్నారని వెల్లడించింది. కాగా, శుభాంశు శుక్లా రోదసీ యాత్ర కోసం ఇస్రో సుమారు రూ. 550 కోట్లు ఖర్చు చేసింది. అతడి యాత్ర అనుభవం 2027లో



## కాలిఫోర్నియా తీరంలో వ్యోమగాముల లాండింగ్

### వారం రోజులు క్వారంటైన్‌లోనే

మానవ అంతరిక్ష ప్రయాణ కార్యక్రమం గగన్‌యాన్‌ను ప్లాన్ చేయడంలో, అమలుకు పనికొస్తుందని భావిస్తోంది. మరోవైపు, డ్రాగన్ వ్యోమ నౌక 580 పౌండ్ల కంటే ఎక్కువ కార్గోతో భూమ్మీదకు తిరిగి వస్తుందని నాసా తెలిపింది. ఇందులో నాసా హార్డ్ వేర్, మిషన్ అంతటా నిర్వహించిన 60 కి పైగా ప్రయోగాల డేటా ఉందని పేర్కొంది. రీహైడ్రేటెడ్ రొయ్యల కాక్‌టెయిల్స్, మంచి సహచరులతో స్పేస్ స్టేషన్‌లో మా చివరి కొన్ని రోజులను ఆస్వాదిస్తున్నాము అని యాక్సియం 4 మిషన్ కమాండర్ పెగ్గీ విట్సన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కాగా, శుభాంశు శుక్లా తోటి వ్యోమగాములకు పార్టీ ఇచ్చారు. తన వెంట తెచ్చిన క్యారెట్ హల్వా, మామిడి తాండ్రను వ్యోమగాములకు వడ్డించారు. అలాగే మైక్రో ఆల్గే అనే సూక్ష్మజీవులపై ప్రయోగం చేశారు. వీటికి జీరో గ్రావిటీలో ఆహారం, ఆక్సిజన్, జీవ ఇంధనాలను ఉత్పత్తి చేసే >>2

# నిందితుల ఆస్తుల జప్తునకు ఎసిబికోర్టు అనుమతి

### మద్యం కుంభకోణం కేసు

### ప్రతివాదులకు ఆగస్టు 1 లోగా నోటీసు ఇవ్వాలని ఆదేశాలు

**విజయవాడ,జూలై12,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేపుతున్న మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసులో నిందితులుగా ఉన్నవారి ఆస్థుల జప్తునకు ఏసీబీ కోర్టు అనుమతినిచ్చింది. రూ.32 కోట్ల విలువైన ఆస్థులను సీజ్ చేసేందుకు అనుమతి ఇస్తూ ఈ రోజు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతివాదులకు ఆగస్ట్ ఒకటో తేదీ లోపు నోటీసులు ఇవ్వాలని దర్యాప్తు అధికారిని ఏసీబీ కోర్టు ఆదేశించింది. గతంలో ఎన్నికల సమయంలో చిల్లకల్లు వద్ద పట్టుబడిన రూ.8 కోట్ల నగదు సహా డిస్టిలరీలు,నిందితుల అనుమానాస్పద లావాదేవీలకు సంబంధించిన ఆస్థులు ఉన్నాయి. వైసిపీ ప్రభుత్వ హయాంలో మద్యం సేకరణ,పంపిణీ మరియు ధరల నిర్ణయంలో భారీ అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సిట్ దర్యాప్తు చేస్తోంది. మద్యం స్కాంలో ఇప్పటికే చాలా మందిని అరెస్ట్ చేసి విచారించింది. విశ్రాంత ఐఎస్ అధికారి రజత్ భార్గవకి సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. కుంభకోణానికి సంబంధించిన మరిన్న డీటెయిల్స్ వెలికితేసే దిశగా సిట్ ప్రయత్నిస్తోంది. మరోవైపు మద్యం కుంభకోణం కేసులో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి హైకోర్టులో ఊరట దక్కింది. మద్యం కేసులో తనపై సిట్ నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ మోహిత్‌రెడ్డి హైకోర్టులో దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణ జరిపింది. బుధవారం వరకు ఆయనపై ఎలాంటి కఠిన చర్యలేవీ తీసుకోవద్దని సిట్‌ను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసింది.

### సిట్ విచారణకు హాజరుకాని విజయసాయి

మద్యం కుంభకోణం కేసులో సిట్ విచారణకు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి హాజరు కాలేదు, మరో రోజు వస్తానని సిట్‌కు విజయసాయిరెడ్డి తెలిపారు.వాస్తవానికి లిక్కరు స్కామ్‌లో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి శనివారం విచారణకు హాజరుకావాల్సి ఉంది. అయితే త >>2

# రాష్ట్రంలో ప్రజాస్వామ్య హననం

### కృష్ణా జిల్లా జెడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించిన జగన్

**విజయవాడ,జూలై12,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జిల్లా జెడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ.జనసేన కార్యకర్తలు దాడి చేసినట్లు వైకాంగ్రెస్ పార్టీ నేతలు,కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.ఆమె గుడివాడలో జరిగే పార్టీ కార్యక్రమానికి వెళ్తుండగా టీడీపీ, జనసేనకార్యకర్తలు ఆమె కారును చుట్టిముట్టి అడ్డుకున్నారు.ఆమెను వెనక్కి తిరిగి వెళ్ళాలని ఆందోళన చేసారు. ఈ క్రమంలో పోలీసు వారిని చెదరగొట్టి ఆమె వాహనాన్ని పంపించినట్లు సమాచారం.ఈఘటనను వైకాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నాయి.ఈ క్రమంలో కృష్ణా జిల్లా జెడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికతో ఫోన్‌లో జగన్ మాట్లాడారు. ఆమెను పరామర్శించారు. ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్న జగన్ దాడిని తీవ్రంగా ఖండించారు. ఉద్దేశపూర్వకంగా చంద్రబాబు ప్రోత్సాహంతో గుడివాడలో టీడీపీ, జనసేన >>2

# న్యాయాధికారుల ఇంటి పనులు దిగువ సిబ్బంది విధుల్లో భాగమే

**విజయవాడ,జులై 12,ప్రభాతవార్త ప్రతినిధి:** న్యాయాధికారుల ఇంటి పనులు ఆఫీసు సబార్డినేట్ల(దిగువ సిబ్బంది)విధుల్లో భాగం కావంటూ పిటీషనర చేస్తున్న వాదనను అంగీకరించలేమని హైకోర్టు స్పష్టం చేసింది. న్యాయాధికారుల ఇళ్ళల్లో పనిచేసేందుకు కొంత మంది ఆఫీసు సబార్డినేట్లు ఉండే విధానం జిల్లా న్యాయవ్యవస్థలో ఉందని హైకోర్టు పేర్కొంది. ఈ విషయంలో న్యాయాధికారుల నుంచి వేధింపులు ఎదురైతే ఫిర్యాదులు చేయవచ్చని, వాటిపై తగిన చర్యలు తీసుకుంటారని వెల్లడించింది. కొందరు న్యాయాధికారుల అనుచిత ప్రవర్తన కారణంగా ఆఫీసు సబార్డినేట్ల విధులు మార్చలేమని స్పష్టం చేస్తూ వ్యాజ్యాన్ని కొట్టివేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు,జస్టిస్ జె.సుమతితో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చింది. దిగువ కోర్టులలో పనిచేసే నాలుగో తరగతి ఉద్యోగులకు న్యాయాధికారుల ఇళ్ళల్లో పనులు అప్పగించకుండా >>2

## వెలుగులోకి మరో భయానక కొవిడ్ వైరస్

### 30% కేసులకు కొత్త 'స్ట్రాటస్' వేరియంట్ మూలం

**న్యూఢిల్లీ, జూలై 12:** ప్రమాదకరమైన కరోనా వైరస్ మళ్లీ విజృంభిస్తోంది. కొత్తగా స్ట్రాటస్ అనే కొవిడ్-19 ఉపవైరస్ వెలుగులోకి వచ్చింది. వ్యాక్సిన్లద్వారా వచ్చిన రోగనిరోధకశక్తిని కూడా తట్టుకుని వ్యాప్తిచెందుతుందని, అన్ని వయసుల వారిని ఆవహించే ప్రమాదం ఉందని వైద్యరంగ నిపుణులు చెపుతున్నారు. కరోనవైరస్ నిరంతరం పరివర్తనంచెందుతోంది. ప్రపంచ ఆరోగ్యరంగాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. ఎక్స్ఎఫ్‌జి జాతికి స్ట్రాటస్ అనే మారుపేరుపెట్టారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఉప వేరియంట్‌ను పర్యవేక్షణలో ఉంచిన వేరియంట్‌గా వెల్లడించింది. ఆగ్నేయాసి యా దేశాల్లో ఈకేసులు విస్తరణకు ఈ స్ట్రాస్ కారణమని తెలిపింది. ఇన్ఫెక్షన్లు వేగంగాపెరుగుతున్నప్పటికీ అనారోగ్యం, మరణాలు తక్కువగా ఉంటాయని చెపుతున్నారు. యుకెలోని ఈకేసుల తీవ్రత ఎక్కువ ఉంది. ఇక్కడ స్ట్రాటస్ కరోనాజాతి అధికారికంగా ఎక్స్ఎఫ్‌జితోపాటు ఎక్స్ఎఫ్‌జి.3 >>2



శనివారం లడాఖ్‌లోని 'లే'లో ప్రసంగిస్తున్న టిబెట్ ఆధ్యాత్మికనేత దలైలామా

## సిద్ధార్థ కౌశల్ రాజీనామాను ఆమోదించిన కేంద్రం



**విజయవాడ,జూలై12,ప్రభాతవార్తప్రతినిధి:** సీనియర్ ఐపీఎస్ అధికారి సిద్ధార్థ కౌశల్ రాజీనామాను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. 2012 బ్యాచ్‌కు చెందిన కౌశల్ రెండు రోజుల క్రితం వ్యక్తిగత కారణాలతో స్వచ్ఛంద పదవీ విరమణకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. ఇప్పుడు కేంద్రం ఆయన రాజీనామాను అధికారికంగా ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన తీసుకున్న ఈ నిర్ణయం పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## పీఏసీఎస్‌ల పునర్వ్యవస్థీకరణపై కమిటీ

**విజయవాడ, జూలై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్‌ల) పునర్వ్యవస్థీకరణ సాధ్యాసాధ్యాలను అంచనా వేయడానికి సహకార శాఖ కమిషనర్ అధ్యక్షతన ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. ఆప్కాబ్ ఎండీ కన్వీనర్‌గా వ్యవహరించే ఈ కమిటీలో నాబార్డు సీజీఎంతో పాటు చిత్తూరు, కృష్ణా జిల్లాల డీసీసీబీ సీఈఓలు సభ్యులుగా ఉంటారు. దేశవ్యాప్తంగా రెండు లక్షల కొత్త బహుళ ప్రయోజన పీఏసీఎస్‌లు డెయిరీ, మత్స్య సహకార సొసైటీలు ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ దిశగా రాష్ట్రంలో ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయనున్నారు. నాబార్డు జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా కనీస జనాభా , సాగు విస్తీర్ణం, అనుకూల ప్రాంతం, మౌలిక సౌకర్యాల లభ్యత తదితర అంశాలను కమిటీ పరిశీలిస్తుంది. రాష్ట్రంలో ప్రస్తుతం 2042 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలుండగా, వాటిలో 14 లిక్విడేషన్ దశలో ఉన్నాయి. రాష్ట్రంలోని 2012 పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ పూర్తయింది. వీటన్నిటిని ఈ-పీఏసీఎస్ లుగా మార్చారు. ఇకపై వీటిలో రోజువారీ లావాదేవీలన్నీ ఆన్‌లైన్ విధానంలోనే జరుగనున్నాయి.

## ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల నిలుపుదల గడువు పొడిగింపు

**విజయవాడ,జూలై 12,ప్రభాతవార్త ప్రతినిధి:** ఫ్రీ హోల్డ్ భూముల డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ల నిలుపుదల గడువును మరో రెండు నెలల పొడిగిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. వైకాపా హయాంలో నిషిద్ధ జాబితా నుండి ఎస్సైన్డ్ భూములను తప్పించడంలో భారీగా అక్రమాలు జరిగాయి. వాస్తవంగా ప్రభుత్వం నుంచి భూములు పొంది,20 ఏళ్లు దాటినవి మాత్రమే నిషిద్ధ జాబితా నుంచి తప్పించాలి. ఆ నిబంధనలకు విరుద్ధంగా సుమారు 5 లక్షల ఎకరాలు తప్పించారు. ఇందులో దాదాపు 25 వేల ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. ప్రభుత్వం వీటిపై లోతుగా విచారణ జరుపుతోంది. మరోవైపు భూ సమస్యల పరిష్కారానికి ఏర్పడిన మంత్రివర్గ ఉపసంఘం ఫ్రీ హోల్డ్ భూముల వ్యవహారంపై ప్రభుత్వానికి ఆక్టోబరులో తుది నివేదిక అందజేస్తామని తెలిపింది. ఈ క్రమంలో ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల నిలుపుదలకు ఇంతకుముందు ఇచ్చిన గడువు ముగిసినందున దాని పొడిగింపుపై తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి.

## ఐఐఎం విద్యార్థిని అత్యాచారంకేసులో కొత్త ట్విస్ట్

**కోల్‌కత్తా, జూలై 12:** కోల్ కతాలోని ప్రఖ్యాత ఐఐఎం బాయ్స్ హాస్టల్ లో ఓ విద్యార్థి తనపై అత్యాచారం చేశాడంటూ ఓ విద్యార్థిని సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. తాను మానసిక సమస్యలతో బాధపడుతున్నానని, దాంతో ఆ విద్యార్థి కౌన్సెలింగ్ ఇస్తానని హాస్టల్ కు పిలిచి తనకు మత్తుమందు కలిపిన కూల్ డ్రింక్ ఇచ్చాని ఆ అమ్మాయి తెలిపింది. తాను స్పృహ కోల్పోగా, తనపై అత్యాచారం జరిపిందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే ఈ వ్యవహారం ఆసక్తికర మలుపు తిరిగింది. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) కలకత్తా విద్యార్థినిపై అత్యాచారం జరిగిందన్న వార్తలను ఆమె తండ్రి ఖండించారు. తన కుమార్తె ఆటోరిక్షాలో నుంచి పడిపోయిందని, అపస్మారక స్థితిలోకి వెళ్లిందని ఆయన తెలిపారు. శుక్రవారం రాత్రి 9:34 గంటలకు తనకు ఫోన్ వచ్చిందని, తన కుమార్తెను పోలీసులు రక్షించి ఎస్ఎస్‌కేఎం ఆసుపత్రిలోని న్యూరాలజీ విభాగానికి తరలించారని ఆయన పేర్కొన్నారు. తన కుమార్తెపై ఎవరూ ఎలాంటి లైంగిక దాడి జరగలేదని, ఆమెను హింసించలేదని లేదా దురుసుగా ప్రవర్తించలేదని తండ్రి పేర్కొన్నారు.

## యాంటీరేబిస్ వ్యాక్సిన్ కోసం 20 కిలోమీటర్లు నడిచివెళ్లిన 90 యేళ్ల బామ్మ

**నువాపడ(ఒడిశా),జూలై 12:** తొంభై ఏళ్ల బామ్మ నడవడమే కష్టం అలాంటిది ఏకంగా 20 కిలోమీటర్లు నడవక తప్పని పరిస్థితి ఏర్పడింది. కుక్క కరవడంతో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ కోసం ఆసుపత్రికి నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళితే ఒడిశాలోని నువాపడ జిల్లాకు చెందిన వృద్ధురాలు మంగల్ బారి మోహరాకు 92 ఏళ్ల ఉన్నాయి. ఆమె అడుగువేయడమే కష్టంగా మారింది. ఈ క్రమంలో మోహరాను జులైవ ఓ కుక్క కరిచింది. దీంతో అందుబాటులో ఉన్న వైద్యుడి వద్ద చికిత్స చేయించుకుంది. ప్రాథమిక చికిత్స చేసిన సదరు వైద్యుడు రేబిస్ రాకుండా వ్యాక్సిన్ వేయించుకోవాలని, ఆ టీకా ప్రస్తుతం తన వద్ద లేదని చెప్పాడు. దీంతో వ్యాక్సిన్ కోసం మోహరా తమ గ్రామానికి సమీపంలోని సినపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు బయలుదేరింది. దాదాపు పది కిలోమీటర్లకు పైగా దూరం ఉన్న సినపల్లి వెళ్లేందుకు ఎవరూ తోడుగా వస్తానని చెప్పకపోవడంతో మోహరా కాలినడకనే బయలుదేరింది. ఓవైపు వయోభారం, మరోవైపు కుక్క కరిచిన గాయంతో నడవలేక నడుస్తూ హెల్త్ సెంటర్ కు చేరుకుంది. అక్కడ వ్యాక్సిన్ తీసుకున్నాక తిరిగి నడుచు కుంటూనే గ్రామానికి చేరుకుంది. రాష్ట్రంలో ప్రైవేటు వాహనాల డ్రైవర్ల సమ్మెకు దిగడంతో రెండు రోజులుగా రవాణా సౌకర్యం నిలిచిపోయిందని గ్రామస్తులు తెలిపారు.

## కాలువలోకి దూసుకుపోయిన కారు ముగ్గురు మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు

**పాట్నా,జూలై 12:** బీహార్‌లోని పాట్నా జిల్లాలోని పాలిగంజ్ సబ్ డివిజన్‌లోని రాణితలాబ్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున ఒక ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాణితలాబ్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని సరయ్య గ్రామం సమీపంలో ఒక కారు అదుపు తప్పి కాలువలో పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన గురించి సమాచారం అందుకున్న స్థానిక పరిపాలన బృందం, ముట్టుపక్కల ప్రజలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జెసిబి సహాయంతో కారును బయటకు తీశారు, కానీ అప్పటికి కారులో ఉన్న ఐదుగురిలో ముగ్గురు చనిపోయారు. ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా, వారిని చికిత్స కోసం పాట్నా ఎయిమ్స్‌కు తరలించారు. మృతులను 52 ఏళ్ల నిర్మలా దేవి, 36 ఏళ్ల నీతు సింగ్, 10 ఏళ్ల అస్మిత కుమారిగా గుర్తించారు. వారంతా వైశాలి జిల్లాలోని మహువా ప్రాంతానికి చెందినవారు. గాయపడిన వారిలో నందన్ సింగ్, రిద్ధి సింగ్ ఉన్నారు, వారు చికిత్స పొందుతున్నారు.వారంతా ఒక వివాహ వార్షికోత్సవంలో పాల్గొనడానికి ఛత్తీస్‌గఢ్ నుండి వైశాలిలోని హాజీపూర్‌కు వెళుతున్నారు. అప్పుడు ఈ ప్రమాదం జరిగింది. సంఘటన గురించి సమాచారం అందగానే, కుటుంబంలో అరుపులు, ఏడుపులు మిన్నంటాయి. కుటుంబం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ సంఘటన గురించి ఎస్‌హెచ్‌ఓ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ ఉదయం పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని సరయ్య గ్రామం సమీపంలో కాలువలో కారు బోల్తా పడిందని పోలీసులకు సమాచారం అందిందని, ఆ తర్వాత స్థానికుల, జెసిబి సహాయంతో పోలీసు బృందం కాలువ నుండి కారును బయటకు తీశారని చెప్పారు. కానీ అప్పటికే కారులో ఉన్న ఐదుగురిలో ముగ్గురు చనిపోయారు. ఇద్దరు గాయపడ్డారు. గాయపడిన వారినిఆసుపత్రికి తరలించారు. వారంతా ఛత్తీస్‌గఢ్ నుండి వైశాలికి వెళ్తున్నారని తెలిపారు.

## బంగ్లాదేశ్‌లో తుక్కు వ్యాపారి దారుణ హత్య!

**ఢాకా, జూలై 12:** బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో జరిగిన 43 ఏళ్ల స్క్రాప్ వ్యాపారి లాల్ చంద్ సోహాగ్ దారుణ హత్య షాక్‌కు గురిచేసింది. ఈ ఘటన మహ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం దేశంలో శాంతిభద్రతలను కాపాడడంలో విఫలమైందనే విమర్శలకు దారితీసింది. ఈ హత్య జూలై 9న సర్ సలీముల్లా మెడికల్ కాలేజ్ మిట్‌ఫోర్డ్ ఆసుపత్రి ఎదుట జరిగింది. సోహాగ్ 'సోహానా మెటల్' అనే తుక్కు సామాను వ్యాపార సంస్థను నిర్వహిస్తున్నాడు. స్థానిక మార్కెట్‌లో ఆయన సంస్థ బలమైన పట్టు కలిగి ఉంది.

# అత్యద్భుతంగా క్వాంటం వ్యాలీ

>> ఒక నమూనాలో క్వాంటం వ్యాలీని తీర్చిదిద్దాలని యోచిస్తున్న ప్రభుత్వం అందులో నిర్మించే భవనాల ఆకృతులను తాము ఎంపిక చేసిన రీతిలోనే నిర్మించాలన్న నిబంధన విధించనుంది.

ప్రపంచంలోని ప్రముఖ సంస్థలను అమరావతి క్వాంటం వ్యాలీకి తీసుకువచ్చేందుకు అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. కంపెనీలు, స్టార్టప్‌లు, పరిశోధన సంస్థలు, క్వాంటం హార్డ్‌వేర్ యూనిట్లు, విశ్వవిద్యాలయాలకు అమరావతి క్వాంటం వ్యాలీలో ప్రభుత్వం భూములు కేటాయిస్తుందన్నారు.ఇక రాష్ట్ర ప్రభుత్వం రక్షణ రంగంలో(డిఫెన్స్) పెట్టుబడులకు కోసం ప్రణాళికలు సిద్ధం చేసింది. రూ.30,000 కోట్ల పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా త్వరలోనే నూతన డిఫెన్స్ పాలసీని ప్రకటించనున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు వెల్లడించారు.ఇందుకు సంబంధించి ఏపీ సీఎంవో నుంచి కీలక సమాచారం ప్రకటించింది. డిఫెన్స్ ప్రణాళికలో నాలుగు రక్షణ రంగ పారిశ్రామిక నోడ్‌లు ఏర్పాటు చేసేందుకు మార్గదర్శకాలు దానిలో పొందుపరిచింది. ఈ పాలసీ ద్వారా రాబోయే ఐదేళ్లలో సుమారు 30 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాలని నిర్దేశించింది. ఇందుకు వీలుగా పెట్టుబడులతో వచ్చే పరిశ్రమల కోసం సుమారు 15,000 ఎకరాలను సేకరించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. దేశంలో రెండు రక్షణ రంగ పరిశ్రమల కారిడార్‌లను కేంద్రం అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే వాటిని ఇతర రాష్ట్రాలకు కేటాయించింది. ఈ రంగంలో మరో కారిడార్‌ను కేంద్రం అనుమతించే అవకాశం లేదు. దీంతో కారిడార్‌లకు ప్రత్యామ్నాయంగా డిఫెన్స్ నోడ్‌లను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ పాలసీ ద్వారా ఎలక్ట్రానిక్స్, డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాలకు సంబంధించిన పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలనుకుంటుంది. అనంతపురం జిల్లా లేపాక్షి నుంచి కర్నూలు జిల్లా ఓర్వకల్ మధ్య భారీ నోడ్‌ను అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. దీన్ని జాతీయ రహదారికి అనుసంధానంగా ఏర్పాటు చేయనున్నారు. నెల్లూరు దొనకొండ మధ్య మరో నోడ్ అభివృద్ధికి అధికారులు ప్రతిపాదించారు. దొనకొండ దగ్గర భారీ విస్తీర్ణంలో ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయి. రామాయపట్నం పోర్టుకు దగ్గరగా నోడ్‌ను అభివృద్ధి చేయడం వల్ల ఎగుమతులకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. విశాఖపట్నం దగ్గర మరో నోడ్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తుంది. దీని కోసం కనీసం 2 వేల ఎకరాలను సేకరించాలని భావిస్తున్నారు. జగ్గయ్యపేట దగ్గర మరో డిఫెన్స్ నోడ్‌ను అధికారులు ప్రతిపాదించారు. దీనికోసం సుమారు 2 వేల ఎకరాలను ఇప్పటికే గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. నవరత్నాల్లో ఒకటిగా ఉన్న భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం దగ్గర డిఫెన్స్ సిస్టం ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌ను 14 వందల కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయనుంది. దీనికి అవసరమైన భూములను ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ సంస్థకు అప్పగించింది. రాడార్, వెపన్ ఇంటిగ్రేషన్, టెస్టింగ్ కేంద్రాన్ని సంస్థ ఏర్పాటు చేయనుంది. భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది.ఆ సంస్థ రెండు దశల్లో 2,400 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనుంది. క్షిపణులు, వార్‌హెడ్స్ తయారీ యూనిట్ ఏర్పాటు కోసం వెయ్యి ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. మడకశిరలో రక్షణ రంగానికి సంబంధించి ఆర్టిలరీ మందుగుండు సామగ్రి షెల్, టీఎన్‌టీ ఫిల్లింగ్, మల్టీమోడ్ హ్యాండ్ గ్రనేడ్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుకు మీడియా మ్యాట్రిక్స్ వరల్డ్‌వైడ్ లిమిటెడ్ సంస్థ 11 వందల 97 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు అన్ని ప్రాధాన్యతా రంగాల్లోను పెట్టుబడులను ఏపీ ప్రభుత్వం ఆహ్వానిస్తోంది.ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం రక్షణ రంగంలో పెట్టుబడులకు కోసం ప్రణాళికలు సిద్ధం చేసింది.

## విజయవాడ దుర్గమ్మగుడికి మరో రోడ్డు మార్గం

>> చేశారు.రాష్ట్రంలోని అర్చకనిరుద్యోగులకు నెలకు 3వేల రూపాయలు భృతి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. శనివారం తిరుమలలోని అన్నమయ్యభవనంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, దేవాదాయశాఖ కార్యదర్శి వాడరేవు వినయ్‌చంద్, దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, ఉపకార్యదర్శి సుధాకర్‌రావుతో కలసి సుదీర్ఘంగా ఫెండింగ్‌లో ఉన్న సంయుక్త అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనంరామనారాయణరెడ్డి మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో జరిగిన సమావేశంలో ఆలయాలకు సంబంధించిన కొన్ని సమస్యలు ముందుకు వచ్చాయన్నారు. వాటిని చర్చించుకుని సానుకూలధోరణితో ముందుకు వెళ్ళేందుకు శనివారం తిరుమలలో దేవాదాయశాఖ, టిటిడితో సమావేశమవడం జరిగిందన్నారు. సిజిఎఫ్‌ను 9శాతం పెంచడం. టిటిడి నుండి దీన్ని రాబట్టడంపై చర్చించామన్నారు. శ్రీవాణిట్రస్ట్ ద్వారా రాష్ట్రంలో పున:నిర్మాణంలో ఉన్న ఆలయాలకు 147కోట్ల రూపాయలు విడుదల కాకుండా నిలిచిపోయాయన్నారు. ఈ నిధుల విడుదల పై చర్చించి నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ ట్రస్ట్ ద్వారా మరో 11కోట్ల రూపాయలు నిధులు మిగిలిన ఆలయాలకు రావాల్సి ఉందన్నారు. విజయ వాడ దుర్గమ్మగుడికి మరో ఘాట్‌రోడ్డునిర్మాణంపై కూడా చర్చించి,టిటిడి సహకారం ఇవ్వాలని కోరడం జరిగిందన్నారు. టిటిడిలో అన్యమత ఉద్యోగులు ఉన్నారని, అయితే ఎంతమంది ఉన్నారనే అంశంపై విచారణ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. టిటిడి విద్యాసంస్థల్లో 192 పోస్టులను ఒప్పంద అధ్యాపకులతో భర్తీచేసేందుకు చర్చించామన్నారు. ఈ సమావేశంలో టిటిడి సిఇ సత్యనా రాయణ, దేవాదాయశాఖ సిఇ జివిఆర్ శేఖర్, టిటిడి,దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

## పోలీసు విచారణకు హాజరైన వల్లభనేని

>> మేరకు గన్నవరం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఆయనను సిఐ శివ ప్రసాద్ విచారించారు. హనుమాన్ జంక్షన్, ఆత్కూర్ పోలీస్ స్టేషన్లకు వెళ్లి సంతకాలు చేశారు. అనంతరం వంశీ వైద్యం కోసం విజయవాడలోని ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లారు.



## తుంగభద్రలో భక్తుల గల్లంతు

>> మఠం మేనేజర్ ఎస్.కె.శ్రీనివాసరావు, సర్పంచ్ భీమయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం నదిలో స్నానానికి ఎవరూ వెళ్లకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## పాతికేళ్లు పైగా విడిగా ఉన్న జంటకు విడాకులిచ్చిన హైకోర్టు

**విజయవాడ,జూలై12,ప్రభాతవార్తప్రతినిధి:** పాతికేళ్ళకు పైగా విడిగా ఉంటున్న ఒక జంటకు విడాకులు ఇస్తూ సంచలన హైకోర్టు తీర్పు ఇచ్చింది. పెళ్లి జరిగిన రెండేళ్లకు (1998 నుంచి) ఆ జంట వేర్వే రుగా ఉంటున్నందున ఇక కలిసే అవకాశం లేనందున విడాకులు ఇస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది. చట్ట ప్రకారం ఆరు నెలలపాటు వేచి ఉండాలనే నిబంధన వారికి విధించినా ఉపయోగం లేదంది. వివాహ బంధం పునరుద్ధరణకు ఆస్కారం లేదని తేల్చింది. పరస్పర అంగీకారంతో విడాకులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు జస్టిస్ రవినాథ్ తిల్హారీ, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ప్రకాశం జిల్లాకు చెందిన మహిళతో 1996లో పెళ్లి జరిగాక పాప పుట్టింది. వారి మధ్య విభేదాలు రావడంతో తల్లి తన చిన్నారిని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. 2000లో విడాకుల కోసం ఆమె భర్త విజయవాడ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించాడు. తన భర్త మానసికంగా వేధిస్తూ, క్రూరంగా వ్యవహరిస్తున్నాడని, ఆఫీసులోని సహోద్యోగినితో వివాహిత వివాహేతర సంబంధం పెట్టుకు న్నాడని, విడాకులు ఇవ్వొద్దని కౌంటర్ వేశారు. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను కింది కోర్టు కొట్టేసింది. కింది కోర్టు ఆదేశాలను సవాల్ చేస్తు వివాహిత భర్త 2007లో హైకోర్టులో అప్పీల్ చేశాడు. తుది విచారణ దశలో భార్యాభర్తలు ఇద్దరూ వివాహ బంధాన్ని కొనసాగించబోమని తేల్చి చెప్పారు. దీనిపై డివిజన్ బెంచ్ హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 13(1) (1ఏ) కింద క్రూరత్వం కారణంతో విడాకులివ్వాలనే పిటిషన్‌ను సెక్షన్ 13బి కింద పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకునే వ్యాజ్యంగా మార్పు చేస్తూ పైవిధంగా తీర్పు వెలువరించింది.చివరికి 27 ఏళ్ల క్రితం పెళ్లయిన జంటకు హైకోర్టు విడాకులు మంజూరు చేసింది.

## విధుల్లో భాగమే

>> ఉండేలా సబార్డినేట్ జ్యుడీషియల్ అధికారులను ఆదేశించాలని ఏపీ జ్యుడీషియల్ ఆఫీస్ సబార్డినేట్స్ అసోసియేషణ్ సంయుక్త కార్యదర్శి టి. విజయలక్ష్మి హైకోర్టులో వ్యాజ్యం వేశారు. 1992 ఫిబ్రవరి 24న హైకోర్టు రిజిస్ట్రార్(పరిపాలన) జారీ చేసిన సర్క్యులర్,ఏపీ జ్యుడీషియల్, మినిస్టీరియల్,సబార్డినేట్ సర్వీసు రూల్స్-2019నిఅమలు చేయాలని కోరారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం. ఓ న్యాయాధికారి తనకు ఇంటిపనులు చెబుతున్నారంటూ ఓ ఆఫీసు సబార్డినేట్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని ఉమ్మడి హైకోర్టు గతంలో కొట్టివేసిందని గుర్తు చేసింది. హైకోర్టుగతంలో ఇచ్చిన తీర్పుల నేపథ్యంలో 1992లో జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొన్నవిధులనే తుదిజాబితాగా పరిగణించలేమని, అవసరమైనప్పుడు ఆఫీసుసబార్డినేట్లకు ఇతర పనులూఅప్పగించవచ్చని స్పష్టం చేసింది.



శనివారం అసోంలోని నాగావ్ జిల్లాలో నిరసన ప్రదర్శనలు జరిపిన విద్యార్థులు

## ఎయిడెడ్ విద్యాసంస్థల్లో సిబ్బంది నియామకానికి మార్గదర్శకాలు

**విజయవాడ,జూలై12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎయిడెడ్ విద్యాసంస్థల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు జిఓ 30ను పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ విడుదల చేశారు. నియామకానికి సంబంధించిన అంశాన్ని ముందుగా పత్రికల ద్వారా తెలపాలని ప్రభుత్వం తెలిపింది. సిబ్బందికి 100 మార్కులకు పరీక్ష నిర్వహించాలంది. 80 మార్కులకు కంప్యూటర్ ఆధారిత పరీక్షను, మిగిలిన 20 మార్కులను టెట్ వెయిట్‌ను తీసుకోవాలని పేర్కొంది. ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వారికి ఏడాదికి 0.5 మార్కుల చొప్పున పదేళ్లకు మించి ఇవ్వకూడదని తెలిపింది. డీఎస్సీలో అమలు చేస్తున్న మెరిట్ కమ్ రోస్టర్ విధానాన్ని అనుసరించాలని వెల్లడించింది. అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించాలని పేర్కొంది. మైనార్టీ విద్యా సంస్థలకు మాత్రం దీని నుంచి మినహాయింపు ఇచ్చింది.

# 15న శుక్లా భూమిపైకి

>> సామర్థ్యాన్ని పరిశీలించినట్లు యాక్సియం స్పేస్ తెలిపింది. అలాగే వ్యోమగాముల బృందం వాయోజర్ డిస్ప్లేస్ అధ్యయనాన్ని చేసింది. ఇది అంతరిక్ష ప్రయాణం కంటి కదలికలు, సమన్వయాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో తెలియజేస్తుంది. అలాగే ఐఎస్ఎస్‌లో మానవ రక్త ప్రవాహంపై పరీక్షలు జరిపారు. మైక్రోగ్రావిటీ, పెరిగిన కార్బన్ డయాక్సైడ్ స్థాయిలు హృదయనాళ పనితీరును ఎలా ప్రభావితం చేస్తాయో పరిశీలించారు. యాక్సియం4 మిషన్ ద్వారా శుభాంశుతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీవిస్నియెస్కీ, టిబర్ కపు ఫ్లోరిడాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి గతనెల 25న అంతరిక్షంలోకి వెళ్లారు. ఐఎస్ఎస్‌లో దాదాపు 60కి ప్రయోగాలు నిర్వహించారు. ఈ క్రమంలో 18 రోజుల రోదసి యాత్ర అనంతరం జూన్ 15న తిరిగి భూమ్మీదకు వస్తున్నారు. దాదాపు గత 2 వారాలుగా ఐఎస్ఎస్‌లో ఉన్న శుభాంశు శుక్లా ఏకంగా 96.5 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించినట్లు యాక్సియం స్పేస్ ఇటీవలే వెల్లడించింది. వ్యోమగాములు ఇప్పటివరకు దాదాపు 230 సార్లు భూమిని చుట్టి వచ్చారని స్పష్టం చేసింది.

# ఎసిబి కోర్టు అనుమతి

>> తాను విచారణకు రాలేనని సిట్ అధికారులకు సమాచారం ఇచ్చారు మాజీ ఎంపీ. తనకు ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలు ఉండటం వలన రాలేకపోతున్నట్లు విజయసాయి సమాచారం పంపారు. తాను రేపో మాపో విచారణకు వచ్చే తేదీని తెలియజేస్తానని చెప్పారు. కాగా.. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఒకసారి సిట్ ముందు మాజీ ఎంపీ విచారణకు హాజరయ్యారు. ఈరోజు సిట్ ముందుకు విజయసాయి రావాల్సి ఉంది .రాలేదు. ఈ సందర్భంలో సామాజిక మాధ్యమం ఎక్స్‌లో విజయసాయిరెడ్డి ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. ఎవరైతే కర్మను చేస్తారో వారు అనుభవించక తప్పదు అనే విధంగా భగవద్గీతకు సంబంధించి ఓ శ్లోకాన్ని ఆయన పోస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఏప్రిల్ 18న విజయసాయిని తొలిసారి సిట్ అధికారులు ప్రశ్నించారు. గత విచారణలో కీలక సూత్రధారులు, పాత్రధారుల పేర్లను మాజీ ఎంపీ వెల్లడించారు. ఈ క్రమంలో ఈ కేసులో మొత్తం 11 మందిని సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. వీరంతా ప్రస్తుతం జైలులో ఉన్నారు.

## వెలుగులోకి మరో భయానక కొవిడ్ వైరస్

>> కింద వర్గీకరించారు. ఈ రెండు వేరియంట్లు ఇపుడు ఇంగ్లండ్‌లో 30శాతం కొవిడ్‌కేసులకు కారణం అవుతున్నట్లు వైద్యనిపుణులు చెప్పారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదికలప్రకారం ప్రపంచ వ్యాప్తంగా గతనెలనాటికి ప్రపంచంలో 23శాతం కొవిడ్19 కేసులకు ఈస్ట్రాటస్ ఉప వేరియంట్‌కారణమైనట్లు నిర్ధారించారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు

>> ఎంపికయ్యాయి.రాష్ట్రంలోని ప్రధాన నగరా లు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులకు ఎంపిక కావడంపై ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ స్పందించారు సీఎం చంద్రబాబు చేపట్టిన స్వచ్ఛాంధ్రకార్యక్రమాల వల్లే ఈ అవా ర్డులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఈసం దర్భంగా కృషి చేసిన అధికారులు, పారిశుధ్య సిబ్బంది,ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు.

## 15, 16న సింఎం ఢిల్లీకి

>> పాల్గొని సీఎం ప్రసంగించనున్నారు.16వ తేదీన కేంద్ర కార్మిక ఉపాధి కల్పనా మంత్రి మన్సుఖ్ మాండవీయతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. అనంతరం నార్త్ బ్లాక్ లో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ తో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ కానున్నారు. సాయంత్రం భారత పరిశ్రమల సమాఖ్య నిర్వహించే బిజినెస్ కాన్ఫరెన్సుకు ముఖ్యమంత్రి హాజరవుతారు. 17వ తేదీ ఉదయం 9.30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ నుంచి అమరావతి బయలుదేరుతారు.

## ప్రజాస్వామ్య హననం

>> గూండాల ఈ దాడి పాల్పడ్డారని వ్యాఖ్యానించారు.ఇక ఎక్స్‌వేదికగా ఈ ఘటన పోలీసుల సహకారంతో ప్రభుత్వం తమ పార్టీనేతలు,కార్యకర్తలపై దాడి చేస్తుందని జగన్ వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లా జెడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన మూకలు దాడి చేసిన విషయం పార్టీ నాయకులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. దాడిని తీవ్రంగా ఖండించారు. ఒక బీసీ మహిళ, జిల్లా ప్రథమ పౌరురాలు భయంతో వణికిపోయే పరిస్థితులు రాష్ట్రంలో ఉన్నాయంటే ఇంతకంటే దారుణం ఉంటుందా అని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో ఆటవిక పాలన సాగుతోందని వైయస్ జగన్ మండిపడ్డారు. హారిక ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా నిచ్చారు.

## వారం - వర్జ్యం

13-07-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
తదియ రా.1.03
శ్రవణం ఉ.6.53
వర్జ్యం : ఉ.8.11-9.40
దు.సా.4.18-5.05
శుభసమయం:ఉ.6.30-7.15, సా.6.30-7.30
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** విద్యార్థి విద్యార్థులకు నూతన విద్యావకాశాలు పొందుతారు. ముఖ్యమైన వ్యవహారాలలో నిదానం చాలా అవసరం.

**వృషభం :** స్థిరాస్తి వివాదాలు పరిష్కార దశకు చేరుకొంటాయి. కీలక నిర్ణయా లలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**మిథునం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. మిత్రులతో ఏర్పడిన విభేదాలు పరిష్కరించుకొంటారు.

**కర్కాటకం:** స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటుపోట్లు కొంతవరకు తీరుతాయి.

**సింహం:** ప్రముఖ వ్యక్తులతో పరిచయాలు ఏర్పడి కొన్ని ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

**కన్య :** జీవిత భాగస్వామి సలహాతో కీలక నిర్ణయాలు తీసుకొంటారు. వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు.

**తుల :** సంఘంలో ఆదరణ పొందుతారు. ఉద్యోగాలలో స్వల్ప స్థానచలనం పొందుతారు.

**వృశ్చికం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్నా అవసరాలు డబ్బు అందుతుంది. సోదరుల నుండి శుభవార్తలు.

**ధనుస్సు:** పట్టుదలతో ముందుకు సాగుతారు. తొందరపాటు నిర్ణయాలు తగదు.

**మకరం:** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. తలచినదొకటి జరిగేది మరొకటిగా ఉంటుంది.

**కుంభం:** కొత్త కార్యక్రమాలు చేపట్టినా ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. సన్నిహితుల సాయంతో పూర్తిచేస్తారు.

**మీనం :** కీలక నిర్ణయాలలో ఆచితూచి మసలుకోండి. సంఘసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

13-07Pg3exHMNWJQEP.qxd:13-07Pg3exHMNWJQEP.qxd 13/07/25 10:45 PM Page 1



# ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించాలనే ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించుకోవాలి

## - ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కమిటీ డిమాండ్

**విజయవాడ,జూలై12,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రైవేటు వైద్య కళాశాలల్లో బయట పడిన అవినీతిని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించాలనే ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి రమణయ్య, టి కామేశ్వర రావు లేఖ రాశారు. విశాఖపట్నంలోని గాయత్రి విద్యా పరిషత్ మెడికల్ కాలేజీతో సహా ప్రైవేటు వైద్య కళాశాలల్లో అవినీతి జరిగినట్లు సిబిఐ దర్యాప్తులో బయటపడిందన్నారు. ఈ కళాశాలలు ఎన్ఎంసి తనిఖీల సమయంలో లంచాలు ఇచ్చాయని తేలిందని చెప్పారు. వరంగల్ లోని పాదర్ కొలంబో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వంటి 40కు పైగా ప్రైవేటు కళాశాలల్లో ఫేక్ రికార్డులు, గెస్ట్ ఫ్యాకల్టీ, నకిలీ రోగులు, హవాలా లావాదేవీలు వంటి అక్రమాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. ఈ సంఘటన వల్ల ప్రైవేటు సంస్థల లాభాపేక్షతో నడుస్తూ, వైద్య విద్య నాణ్యత, ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని స్పష్టమవుతుందని తెలిపారు. ప్రజారోగ్య వేదిక (పిఎవి) ఈ విషయంపై ఎన్నోసార్లు లేఖ సమర్పించినట్లు చెప్పారు. వైద్య విద్యను ప్రైవేటీకరించడం వల్ల వచ్చే ప్రమాదాలపై హెచ్చరించినట్లు తెలిపారు. అనేక ప్రాంతాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు, సెమినార్లు నిర్వహించి, విద్యావేత్తలు, వైద్యరంగ నిపుణులతో, ప్రజలతో చర్చించిన అనంతరం అందరూ ఏకగ్రీవంగా ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకించారని లేఖలో పేర్కొన్నారు. పిఎవి నిర్వహించిన ప్రజా ఉద్యమాల్లో రాష్ట్రానికి చెందిన వేలాది మంది ప్రజలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేశారని తెలిపారు. ప్రైవేటీకరణ వల్ల అవినీతి, లాభాపేక్ష వంటి అంశాలు మరింత తీవ్రం అవుతాయని చెప్పారు. ఇవి నాణ్యమైన వైద్య సేవలను, వైద్యుల శిక్షణను దెబ్బ తీస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రజలకు ముఖ్యమైన సంపదగా వెల్లడించారు. ఇవి వివిధ నేపథ్యాల నుంచి వచ్చే విద్యార్థులకు తక్కువ ఖర్చుకే విద్యను, అట్టడుగు వర్గాలకు మంచి వైద్య సేవలను అందిస్తాయన్నారు. వీటిని ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే, ఫీజులు భారీగా పెరిగి, జవాబుదారీతనం తగ్గి రోగుల సేవ కంటే లాభార్జనే ప్రాధాన్యతగా నడుస్తాయని చెప్పారు. ఈ విషయం సిబిఐ దర్యాప్తుల్లో కూడా స్పష్టమైందన్నారు. వైద్య సేవలు ప్రాథమిక హక్కుగా ఉండాలనే రాష్ట్ర బాధ్యతను వమ్ము చేస్తోందన్నారు. విద్యావేత్తలు, వైద్యరంగ నిపుణులు, ప్రజల వ్యతిరేకతను గౌరవిస్తూ.. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ప్రతిపాదన విరమించుకోవాలని కోరారు. ప్రైవేటు వైద్య కళాశాలలపై నిఘా, నియంత్రణను బలోపేతం చేసి, అవినీతిని అరికట్టాలని, ఎన్ఎంసి ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, ఫ్యాకల్టీ, వైద్య సేవలను మెరుగు పరచడానికి పెట్టుబడులను పెట్టి అందరికీ నాణ్యమైన విద్య, సేవలను అదించాలని కోరారు. అవినీతి ప్రక్రియలపై సిబిఐ దర్యాప్తుకు సహకరించి, దోషులైన సం స్థలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకో వడంతోవిశ్వాసాన్ని పునరుద్ధరించాలన్నారు.




రైల్వే లాబీలో జరిగిన కార్యక్రమంలో రైల్వే బోర్డు సభ్యుడు వి.పి సింగ్

# ఏకాగ్రతతో పనిచేయండి

## - రైల్వే బోర్డు ట్రాక్షన్ విభాగం సభ్యుడు వి.పి సింగ్

**గుంతకల్లు రైల్వే, జూలై 12,ప్రభాతవార్త** ప్రస్తుత స్పీడ్ యుగంలో అనునిత్యం అప్రమత్తంగా ఉంటూ నిబద్ధత ఏకాగ్రతలతో పనిచేయాలని రైల్వే బోర్డు విద్యుత్ ట్రాక్షన్ విభాగం అదనపు సభ్యుడు విజయ ప్రతాప్ సింగ్ పేర్కొనా న్నరు. ఆధునిక గుంతకల్లు రైల్వే స్టేషన్ రూపశిల్పిగా ఖ్యాతి గాంచిన పి.వి సింగ్ అధికారిక పర్యటనలో భాగంగా శనివారం గుంతకల్లు డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన తన మానస పుత్రిక అయిన గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో అధిక సమయం తిరుగాడుతూ తన కాలం నాటి పరిస్థితులను, మధురస్మృతులను నెమరు వేసుకున్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లోని క్ర్యూ లాబీలో డివిజనల్ కంట్రోల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కాలంతో పాటు పరిగెత్తాల్సిన అవసరం ఉందని, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా చిత్తశుద్ధితో ఏకాగ్రతలతో పనిచేస్తూ ప్రయాణికుల విశ్వసనీయతలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. నిర్ణీత కార్యక్రమం ప్రకారం ఆయన డీజిల్ షెడ్, విద్యుత్ లోకో షెడ్, కోచ్ రెస్టారెంట్, రైల్వే ఉన్నత పాఠశాల తదితర ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో రైల్వే ఉన్నతాధికారులు శౌర్యా, సుధాకర్, వీరయ్య, సుదర్శన్ రెడ్డి, మంగాచార్యులు, ఆర్ నాగేశ్వర్‌రావు, సీనియర్ సబార్డినేట్లు దాదాహయాత్, మనీష్, జాన్ మౌనిష్, నారాయణస్వామి, ఎంఎల్ మీనా, జాఫర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా కృషి

### - సామాన్యభక్తులకు సౌకర్యాల కల్పనలో పెద్దపీట - శ్రీవారి సేవలో మంత్రి ఆనం



**తిరుమల.జూలై 12ప్రభాత వార్తప్రతి నిధి:** ఆంధ్ర ప్రదేశ్‌ను ఆధ్యాత్మిక వాతావరణం వైపు నడిపించేందుకు, రాష్ట్రవ్యాప్తంగా ఆధ్యా త్మికశోభ వెల్లివిరిసేలా ఆలయాలను అభివృద్ధి చేయడం జరుగుతోందిన రాష్ట్రదేవాదాయ శాఖమంత్రి ఆనం రామ నారాయణరెడ్డి తెలిపారు. ఆ దిశగా ప్రక్షాళన మొదలైందన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో భక్తులకు దర్శనాలు సులభతరం చేయడం, ప్రసాదాలు నాణ్యతగా ఉండేలా చూడటం, ఆలయాల పరిశుభ్రత విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. దేవదాయశాఖద్వారా 300 ఆలయాలకు సిజిఎఫ్ నిధులు, ధూపదీపనైవేద్యాల స్కీమ్‌లకు సంబంధించి నిధులను కేటాయించడం జరిగిందన్నారు. టిటిడి ఆలయాల అభివృద్ధి, భక్తులకు అందుతున్న సదుపాయాలు, భద్రత పరిపాలన అంశాలపై దేవాదాయశాఖ, టిటిడి సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. భక్తులకు మెరుగైన సేవలందించేందుకు కార్యాచరణ సిద్ధంచేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 160 ఆలయాల్లో భక్తులకు దర్శనాలను సులభతరం చేశామన్నారు. టిటిడిలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. 200కుపైగా ఆలయాల పున:నిర్మాణం కోసం కామన్ వెల్ఫేర్ ఫండ్ నుండి నిధులు మంజూరుచేశామని తెలిపారు. శనివారం ఉదయం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కుటుంబంతో కలసి ఆలయం వద్దకు చేరుకున్న మంత్రికి టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ ఏవిఎస్ఒ రాజశేఖర్ స్వాగతం పలికి దర్శనం చేయించారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేయించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అంతర్జాతీయ క్రీడల్లో టిటిడి ప్రతిష్టను ఇనుమడింపజేశారు

### - విజిలెన్స్‌అధికారులకు టిటిడి ఛైర్మన్ నాయుడు అభినందనలు



**తిరుమల, జూలై 12ప్రభాతవార్తప్రతినిధి:** అమెరికా బర్మింగ్‌హామ్ నగరంలో జరిగిన ప్రపంచ పోలీస్, ఫైర్ గేమ్స్-2025 పోటీల్లో ప్రతిభ కనబరిచి కాంస్య, స్వర్ణపతకాలు అందుకోవడం టిటిడి ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసిందని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు హర్షం వ్యక్తం చేశారు. పోలీసు క్రీడల్లో టిటిడి విజిలెన్స్ సెక్యూరిటీ విభాగం విఎస్ఒ (వింగ్)నెట్టెం తులసీవెంకట రామ్‌కుమార్, విఎస్ఒ అల్లంసురేంద్ర 55,45ఏళ్ళ సింగిల్ టెన్నీస్ పోటీల్లో అద్భుతంగా ఆడి సత్తా చాటారని అభినందించారు. శనివారం తిరుమలలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఇద్దరు అధికారులు ఛైర్మన్ నాయుడును కలసి తమ పతకాలను చూపారు. ప్రపంచవ్యాప్తంగా 80దేశాల నుండి పోలీస్, ఫైర్ విభాగాల నుండి 9వేలమంది అథ్లెట్లు పాల్గొన్న పోటీల్లో విఎస్ఒలు పతకాలు అందుకుని భద్రత పరంగా టిటిడి ప్రతిష్టను ప్రపంచవ్యాప్తంగా చాటేలా క్రీడల్లో ఆడారని అన్నారు.

# రాజధానికి ఆర్థిక సలహాదారుగా ఎన్ఎబిఎఫ్ఐడి

## - సిఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం చేసుకున్న సిఆర్డీఎ

**విజయవాడ,జూలై12,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి అభివృద్ధికి...ఆర్థిక వ్యవహారాల సలహాదారుగా వ్యవహరించేందుకు జాతీయ ఆర్థిక, మౌలిక వసతుల అభివృద్ధి బ్యాంకు (ఎన్ఏబీఎఫ్ఐడీ)తో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ)ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ ఒప్పందంపై బ్యాంక్ ఎండి రాజ్ కిరణ్‌రాయ్, సీఆర్డీఏ కమీషనర్ కె.కన్న బాబు సంతకాలు చేశారు. ఈ బ్యాంకు సీఆర్డీఏ 'ట్రాన్సాక్షన్ అడ్వైజరీ సర్వీసులు (టీఏఎస్)' అందచేస్తుంది. సీఆర్డీఏకి బ్యాంకు వ్యూహాత్మక సలహాదారుగా వ్యవహరిస్తూ... రాజధానిలో చేపట్టే కీలకమైన మౌలిక వసతుల ప్రాజెక్టులకు సంబంధించి ప్రభావవంతమైన ఆర్థిక నమూనా (బ్లూప్రింట్)రూపొందించడంలో తోడ్పడుతుంది. ఈ ప్రాంతంలో చేపట్టే బహుళ మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఎలాంటి ఆర్థిక వ్యూహాలు అనుసరించాలి... పీపీపీ సహా ఎలాంటి విధానాలు అనుకూలం వంటి అంశాలపై సూచనలు, సలహాలు అందచేస్తుందని సీఆర్డీఏ అధికారులు తెలిపారు.

# దక్షిణ మధ్య రైల్వే జిఎంగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌కె శ్రీవాత్సవ



**గుంతకల్లు రైల్వే, జూలై 12,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా సంజయ్ కుమార్ శ్రీవాత్సవ బాధ్యతలు చేపట్టారు. తెలుగు రాష్ట్రాల రైల్వే జీఎంగా పనిచేసిన ఎకె జైన్ జూన్‌లో పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో దక్షిణ కోస్తా రైల్వే జీఎంగా పనిచేస్తున్న సందీప్ మాథూర్‌కు తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు అదనపు బాధ్యతలు చేపట్టాలని రైల్వే బోర్డు ఆదేశించింది. కాగా అలహాబాద్‌లోని సెంట్రల్ రైల్వే విద్యుదీకరణ సంస్థ(కోర్) జీఎంగా పనిచేస్తున్న సంజయ్ కుమార్ శ్రీవాత్సవను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా నియమించేందుకు కేంద్ర నియామకాల కమిటీ ఆమోదించడంతో ఈమేరకు రైల్వే బోర్డు శుక్రవారం శ్రీవాత్సవను దక్షిణ మధ్య రైల్వే జీఎంగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో ఆయన ఈ మేరకు బాధ్యతలు చేపట్టారు. రూర్కీ ఐఐటీలో సివిల్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన ఆయన ఢిల్లీ ఐఐటిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1988లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా రైల్వే సర్వీస్‌లో 1990లో చేరారు. ప్రారంభంలో పశ్చిమ రైల్వేలోని వల్సాద్‌లో ఎఇఎన్‌తో తన సర్వీసు ప్రారంభించిన ఆయన ముంబై డివిజన్ ట్రాక్, రేఖా చిత్రాల రూపకర్త ఇంజనీర్‌గా, ముంబై నిర్మాణాల విభాగం, బరోడా బ్రిడ్జిల డిప్యూటీ ఇంజనీర్‌గా, రైట్స్ జీఎంగా, బీకనీర్ డిఆర్ఎంగా, రైల్వే బోర్డు మొబిలిటీ ఈడిగా, 2024 డిసెంబరు 11నుంచి అలహాబాద్‌లోని సెంట్రల్ రైల్వే విద్యుదీకరణ సంస్థ(కోర్) జీఎంగా పనిచేస్తూ, ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా నియమితులై పదవి బాధ్యతలు స్వీకరించారు.

# ఎంబిబిఎస్ ప్రవేశాలకు వచ్చేవారం నోటిఫికేషన్

**విజయవాడ,జూలై12,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రస్తుత2025 -26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న కన్వీనర్ కోటా ఎంబీబీఎస్/బీడీఎస్ సీట్ల భర్తీకి వచ్చేవారం నోటిఫికేషన్ విడుదల కానుంది. ఇప్పటికే నీట్ యూజీ తాత్కాలిక ర్యాంకులను వర్సిటీ ప్రకటించగా, ధరఖాస్తు చేసుకున్న వారి జాబితాలో తుది ప్రాధాన్య క్రమాన్ని ఈ నెలాఖరులోగా వెల్లడించనుంది. ఏటా ప్రత్యేక కేటగిరిలో క్రీడాకారులు, ఈ డబ్ల్యూఎస్ అర్హత కలిగిన అభ్యర్థుల ధృవీకరణ పత్రాల జారీ ప్రక్రియ కారణంగా కౌన్సిలింగ్ ప్రక్రియ ఆలస్యమవు తోందిని, ఈ జాప్యాన్ని నివారిం చడానికి ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం తాజాగా నోటీసులు జారీ చేసింది. ఇందులో అంతర్జాతీయ,

జాతీయ, రాష్ట్ర, అంతర విశ్వవిద్యాలయాలు/ కళా శాలల్లో విద్యార్థులు సాధిం చిన క్రీడా ధృవపత్రాలను ఆయా ఫెడరేషన్ల నుంచి ముందస్తుగానే తెచ్చుకోవాలని పేర్కొంది.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో శుభాలు కలగాలి :ప్రముఖులు



**తిరుమల,జూలై 12ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతోఉండాలని దేవుని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. శనివారం ఉదయం హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్ కృష్ణమోహన్, నటుడు అశోక్‌కుమార్, నటుడుసంతోష్‌శోభన్, బిసిసిఐ కోచ్ అంకిత్‌కలియార్ వారివారి కటుంబాలతో కలసి తిరుమలకు చేరుకున్నారు. వీరంతా వేర్వేరుగా ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



రోజ్ గార్ మేళాలో కేంద్ర ప్రభుత్వంలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందచేస్తున్న కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

# యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

## - రోజ్‌గార్ మేళాలో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

**గుంతకల్లు రైల్వే, జూలై 12,ప్రభాతవార్త** సువిశాల భారతావనిలో నిరుద్యోగాన్ని పారద్రోలి, ప్రతిఒక్కరికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయం అని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. కేంద్రప్రభుత్వం చేపట్టిన రోజ్‌గార్ మేళా కార్యక్రమాన్ని రైల్వే డివిజనల్ సిబ్బంది వ్యవహారాల విభాగపు అధికార యంత్రాంగం శనివారం స్థానిక రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ శనివారం వీడియో కాన్ఫరెన్సిర్ ద్వారా వివిధ ప్రభుత్వ విభాగాలు, సంస్థలలో కొత్తగా నియమితులైన 51వేల మందికిపైగా అభ్యర్థులకు నియామక పత్రాలను అందచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. యువత సాధికారత, దేశ నిర్మాణంలో పాల్గొనడానికి అర్థవంతమైన అవకాశాలను అందించడంలో రోజ్‌గార్ మేళా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. రోజ్‌గార్ మేళాలు నిర్వహించడం ద్వారా ఇప్పటివరకు 10లక్షలకు పైగా నియామక పత్రాలు జారీ చేశామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న 16వ రోజ్‌గార్ మేళా దేశవ్యాప్తంగా 47ప్రదేశాలలో నిర్వహిస్తున్నామని రాష్ట్రంలో గుంతకల్లు, గుంటూరు, విశాఖలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుంతకల్లులో నిర్వహించిన కార్యక్రమంలో రైల్వే శాఖలో-61మందికి, కేంద్ర గణాంకాలలో ఇద్దరికి, తపాలా శాఖలో మరో పాతిక మందికి కలిపి మొత్తంగా 88మందికి ఉద్యోగ నియామక పత్రాలను కేంద్రమంత్రి అందచేశరు. సమావేశంలో డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, అదనపు డిఆర్ఎం ఎం సుధాకర్, సిఎంఎస్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డిపిఓ కో-ఆర్డినేషన్ హెచ్‌ఎల్ఎన్ ప్రసాద్, పర్సనల్ విభాగం అధికారులు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు, కార్మిక సంక్షేమం, వాణిజ్య తదితర విభాగాల ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ సబార్డినేట్లు, ఉద్యోగార్థులు తదితరులు పాల్గొనా న్నరు.

# నైతిక విలువలు పెంచేదే భగవద్గీత

## - శ్రీవారికి కానుకగా గజల్‌శ్రీనివాస్ ధ్వనిముద్రణం సమర్పణ

**తిరుమల,జూలై 12ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీమద్భగవద్గీత చదవడం, వినడం వల్ల మానవుని జీవితంలోని వివిధ సమస్యలకు పరిష్కారాలను అందిస్తుందని పలువురు వక్తలు తెలిపారు. జ్ఞానాన్ని పొందడం ద్వారా మోక్షం లభిస్తుందని, ధర్మం అంటే ఏమిటో దానిని ఎలా పాటించాలో భగవద్గీత గ్రంథం తెలియజేస్తుందన్నారు. గాయకుడు డాక్టర్ గజల్‌శ్రీనివాస్ తన గాత్రంతో ధ్వనిముద్రణం చేసిన "శ్రీమద్భవద్గీత"విడుదల కార్యక్రమం శనివారం సాయంత్రం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో జరిగింది. అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్, టిటిడి బోర్డు సభ్యు డు భాను ప్రకాశ్‌రెడ్డి, స్వి మ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వి కుమార్, మాజీ టిటిడి ఛైర్మన్ చదల వాడ కృష్ణ మూర్తి, మాజీ బోర్డు సభ్యుడు డాక్టర్ హరిప్ర సాద్, సంస్కృత విశ్వ విద్యాలయం కులసచివులు ఆచార్య కె.సాంబశివ మూర్తి, సభానిర్వహణ డాక్టర్ ఆకెళ్ళ విభీషణశర్మ, అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అధినేత, కార్యక్రమం సభాధ్యక్షుడు పాండ్ర సురేంద్రనాయుడు హాజరై శ్రీమద్‌భగవద్గీతపై తమతమ అనుభవాలను అనుగ్రహంచేశారు. కర్మ, యోగం, జ్ఞానయోగం ,భక్తియోగం వంటి వివిధ మార్గాల ద్వారా మోక్షాన్ని ఎలా పొందాలో ఇందులో వివరించబడిందన్నారు.



శనివారం తిరుపతిలో గజల్‌శ్రీనివాస్ శ్రీమద్భగవద్గీత ధ్వని ముద్రనను విడుదల చేసిన దృశ్యం

నైతిక విలువలను బోధిస్తుందన్నారు. సులభంగా వినేందుకు ప్రస్తుతం గజల్ శ్రీనివాస్ తెలుగు, సంస్కృతంలో భగవద్గీత స్వరపరిచాడన్నారు. అనంతరం గజల్‌ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. తిరుపతిలో ఈ బగవద్గీత విడుదల చేయడం తనకెంతో ఆనందాన్నిచ్చిందని శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు.

### సంపూర్ణ భగవద్గీతను వందభాషల్లో విడుదల చేస్తా : గజల్ శ్రీనివాస్

### తెలుగు సంస్కృతం భాషలవి టిటిడికి కానుక

సమాజాన్ని ఆధ్యాత్మికవైపు నడిపించేలా, యువతలో సనాతనధర్మంపై విశ్వాసం, ఆధ్యాత్మిక భావన కలిగించేలా శ్రీమద్ భగవద్గీ తను వందభాషల్లో విడుదల చేయనున్నట్లు గాయకుడు గజల్ శ్రీనివాస్ తెలిపారు. గత ఏడాది కాలంగా అందుకు కృషి చేస్తున్నా నన్నారు. ప్రస్తుతానికి తెలుగు, సంస్కృత భాషల్లో మాత్రమే సంపూర్ణ భగవద్గీతను రూపొందించడం జరిగిందన్నారు. వీటిని టిటిడికి, జాతీయ సంస్కృత విశ్వ విద్యా లయాలకు అందించడం జరుగుతుం దన్నారు. శనివారం సాయంత్రం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో తెలుగు, సంస్కృత భాషల్లో స్వర కల్పనచేసిన భగవద్గీత ఆడియోలను విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం 25 భాషల్లో భగవద్గీత విడుదల చేయనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది వందభాషల్లో విడుదల చేయాలని నిర్ణయిం చుకున్నట్లు గజల్ శ్రీనివాస్ తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా త్వరలోనే 23 భాషల్లో భగవద్గీతను విడుదల చేయనున్నట్లు ఆయన చెప్పారు.

## పి4తో రాష్ట్రంలో పేదరికం నిర్మూలన : మంత్రి కొల్లురవీంద్ర



**తిరుమల,జూలై 12ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రజలు ఆర్థికంగా అభివృద్ధిచెందడానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంచి ఆలోచనతో పి4 విధానం అమలు చేయడం పేదరికం నిర్మూలన జరుగుతుందని రాష్ట్రమంత్రి కొల్లురవీంద్ర తెలిపారు. ఇప్పటికే ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. ఆర్థికపరిస్థితిని ముఖ్యమంత్రి గట్టెక్కించి ప్రజల జీవితాల్లో ఆనందం చూడాలనే ఆశయంతో ప్రణాళికలు అమలుచేస్తున్నారన్నారు. ఏడాదిపాలనలో ప్రజలకు సంక్షేమం అందుతోందన్నారు. కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధిచెందాలని కోరుకున్నానన్నారు. శనివారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకుని దేవదేవుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## భక్తజనసంద్రంగా తిరుమల - కిలోమీటర్లు బారులుతీరిన భక్తులు



**తిరుమల,జూలై 12 ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం..వరుసగా మూడురోజులు సెలవులు రావడంతో శనివారం కూడా కలియుగవైకుంఠం తిరుమల భక్తజనసంద్రంగా మారింది. రెండవశని ,ఆదివారాలు ,తెలంగాణాలో సోమవారం కూడా సెలవుతో ఏడుకొండల స్వామి దర్శనానికి భక్తులు మూడురోజులుగా భారీగా కొండపైకి చేరారు. శనివారం ఉదయానికే వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లలోని 61 కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల శిలాతోరణం వరకు క్యూలైన్లలో బారులుతీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి ఉదయానికి 24గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఎనిమిది గంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. టైమ్‌స్లాట్ భక్తులు 12గంటల సమయం పడుతుంది. సాయంత్రం 5గంటల వరకు 47వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 20వేలమంది భక్తులు పైగానే అర్థరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుంది. వెలుపల క్యూలైన్లలో భక్తులకు శ్రీవారి సేవకులు అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ నిరంతరాయంగా పంపిణీ చేస్తున్నారు. శుక్రవారం రాత్రివరకు 70వేలమంది భక్తులకు మహాలఘులో దర్శనం చేయించారు. మొక్కుబడుల రూపంలో హుండీ కానుకల ద్వారా 3.84కోట్ల రూపాయలు ఆదాయం చేకూరింది. మరో మూడురోజులు రద్దీ ఇలాగే కొనసాగే అవకాశం ఉంది.

# జర్నలిస్టుల కుటుంబాల కోసం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

**విజయవాడ, జూలై 12, ప్రభాతవార్తప్రతినిధి:** సమయపాలన లేని వృత్తి జర్నలిజం అని, నిద్రాహారాలు మానేసి ప్రజాసేవలో నిమగ్నమైన పాత్రికేయులు ఆరోగ్యాన్నీ కాపాడుకోవడంలో జాగ్రత్తలు తీసుకోవడం లేదని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఆరోగ్యసమస్యలను నిర్లక్ష్యం చేయకండి, హెల్దీగా ఉంటే మరింతగా సేవలు అందించవచ్చునన్నారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, విజయవాడ ప్రెస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని బొండా ఉమా ప్రారంభించారు ఈ సందర్భం గా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ హైదరాబాదులో ఎన్నో హాస్పిటల్స్ ఉన్నప్పటికీ బసవతారకం ఇండో అమెరికన్ హాస్పిటల్ కి ఒక ప్రత్యేకత ఉందన్నారు. కోట్లాది రూపాయల విలువైన పరికరాలు ఉన్న ఈ హాస్పటల్లో ఆదాయ ఆర్జనలో కాకుండా సామాజిక సేవలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని ప్రశంసించారు. గతంలో క్యాన్సర్ మహమ్మారి కారణంగా ఎన్నో మరణాలు సంభవించేవన్నారు ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం క్యాన్సర్ కి ఎన్నో రకాల టెస్టులు, ఔషధాలు వచ్చాయని తెలిపారు. సీఆర్డీఏ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించగా ఇప్పుడు ప్రెస్ క్లబ్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు జరగడం సంతోషకరమన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద 140 రకాల వ్యాధులకు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు సెంట్రల్ నియోజకవర్గంలో ప్రెస్ క్లబ్ ఉన్న దృష్ట్యా దాని అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్ కన్సల్టెంట్ డాక్టర్ శ్రవణ కుమారి మాట్లాడుతూ లైఫ్ స్టైల్ కు అనుగుణముగా రోజు రోజుకి క్యాన్సర్ వ్యాధి పెరిగిపోతుందన్నారు. ప్రతి ఒక్కరిలోనూ క్యాన్సర్ నిర్ధారణ అవగాహన కలిగి ఉండాలని కోరారు. ప్రాథమికంగానే రోగ నిర్ధారణ జరిగితే క్యాన్సర్‌ను నియంత్రించవచ్చని ఆమె తెలిపారు. మమోగ్రాఫ్, గర్భాశయ స్కానింగ్ , పాప్స్మియర్, అల్ట్రా సౌండ్ స్కానింగ్, ఊపిరితిత్తుల ఎక్స్ రే పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కంచల జయరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐజేయు జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, యూనియన్ సీనియర్ నాయకులు, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్.కె బాబు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపకులు చందు జనార్దన్ , ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ అధ్యక్షుడు చావా ర వి, కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




ఉచిత క్యాన్సర్ క్యాన్సర్ నిర్ధారణ శిబిరం ప్రారంభ సందర్భంగా సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

# సిఓఎ అనుమతి లేకుండా ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయం ఎలా ఏర్పాటు చేస్తారు :పిసిసి అధ్యక్షురాలు షర్మిల

**విజయవాడ,జూలై12,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కడపలోని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలో కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీఓఏ) అధికారులతో భేటీ అయిన షర్మిల, విద్యార్థుల భవిష్యత్తు కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఆమె ఎక్స్ లో స్పందించారు 'కడప వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విద్యార్థుల పక్షాన సీఓఏ అధికారులను విజయవాడలో కలవడం జరిగింది. గత ప్రభుత్వ హయంలో సీఓఏ అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేశారు. ఇప్పుడు విద్యార్థులకు సర్టిఫికెట్లు రావడం లేదు. వందలాది మంది విద్యార్థుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. సీఓఏ అనుమతులు లేకుండా లైసెన్సులు రావడం లేదు. విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఈ విద్యార్థుల కష్టాలు నేను ప్రత్యక్షంగా చూశా. ఆనాడు అనుమతులు లేకుండా యూనివర్సిటీ ప్రారంభించడం పెద్ద తప్పు. ఈ తప్పు సరిదిద్దాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. రెండేళ్లుగా విద్యార్థులు పోరాటం చేస్తున్నా ఫలితం లేదు. వెంటనే సీఓఏ అనుమతులు తీసుకొని విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరాం. ఢిల్లీ స్థాయిలో సీఓఏను కలుస్తాం అని హెచ్చరించాం.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాశాఖ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. గాడి తప్పిన విద్యా వ్యవస్థను సరిదిద్దేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రయత్నాలు ప్రారంభించారు. గతంలో విద్యాశాఖలో ఎన్నో ఒడిదుడుకులు ఉండటంతో సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా బదలీల్లోభాగంగా చేపట్టిన కౌన్సిలింగ్‌లో లోపాలు ఉండటం వారికి శాపంగా మారింది. అంతేకాక గతప్రభుత్వంలో మునుపెన్నడూ లేని విధంగా ఉపాధ్యాయుల చేత బోధనేతర పనులు చేయించారు. దీంతోఅప్పటి ప్రభుత్వం విధానాలతో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు గత ఎన్నికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పుఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మంత్రి నారా లోకేష్ విద్యా శాఖను తన వద్ద ఉంచుకొని మార్పులు చేర్పులకు సన్నాహాలుచేస్తున్నారు. ముఖ్యంగా విద్యాశాఖలో ప్రిన్సిపల్ సెక్రటరీగా సీనియర్ ఐఏఎస్ అధికారి కోన శశిధర్‌ను నియమించారు. కోన శశిధర్‌కు ఏ శాఖ అప్పగించిన తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి ఆ శాఖకి న్యాయం చేస్తారన్న అభిప్రాయం సర్వత్రా ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ముఖ్యంగా మెగా డీఎస్సి నిర్వహించారు. అలాగే ఉపాధ్యాయుల బదిలీల కౌన్సిలింగ్ పారదర్శంగా నిర్వహించారు. లోకేష్ మార్క్ పాలనకు అద్దంపట్టారు. విద్యను అత్యంత ప్రాధాన్యత రంగాలలో ఒకటిగా గుర్తించింది. ఈ క్రమంలో పాఠశాల విద్యలో సంస్కరణలకు తెరతీసింది.మొదటిసారి మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాలునిర్వహించారు. కార్యక్రమంలో 44,956పాఠశాలల్లో 25.46 లక్షలమంది తల్లిదండ్రులు, 27,395మంది పూర్వవిద్యార్థులు, 22,200 మందిదాతలు, 36,918 మంది ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈసమావేశంలో తమ పిల్లల అవకాశాల గురించి చర్చించారని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.

# విద్యాశాఖలో సంస్కరణల శకం

విద్య

**ఎం రఘునాథ**

విద్యారంగంలో సంస్కరణలకు కూటమి ప్రభుత్వం జోరుగా ప్రయత్నాలు సాగిస్తోంది. ప్రస్తుతం ఈ వ్యవస్థలో ఉన్న లోపాలు గుర్తించడంతోపాటు వాటి పరిష్కారానికి మార్గాలను అన్వేషిస్తోంది. విద్యారంగానికి గొడ్డలి పెట్టుగా మారిన జీవో 117కు కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. విద్యారంగంలో సంస్కరణల పేరుతో గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ జీవోతో ప్రాథమిక విద్యా నిట్టనిలువునా చీలిపోయింది. 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో తల్లిదండ్రులు ప్రైవేటుబడుల బాట పట్టారు. నాటి సీఎం జగన్ తీసుకున్న ఈ నిర్ణయం ఊరిబడికి ఉరిగా మారింది. ఈ జీవోతో ప్రాథమిక విద్యావ్యవస్థకు నష్టం వాటిల్లుతుందని ఉపాధ్యాయులు, మేధావులు ఆందోళన చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ వివాదాస్పద జీవోను రద్దు చేస్తామని ఇప్పటికే ప్రకటించగా, దాన్ని ఉపసంహరించిన తర్వాత ప్రత్యామ్నాయం తీసుకొచ్చేందుకు అవసరమైన ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ ప్రారంభించింది. దీనిలో భాగంగా ఆ శాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు మార్గదర్శకాలపై ఉత్తర్వులు విడుదల చేశారు. గతంలో ఉన్న ఆరు రకాల పాఠశాలలకు బదులు 10రకాల పాఠశాలల విధానాన్ని కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చింది. గతంలో ప్రవేశపెట్టిన శాటిలైట్ ఫౌండేషనల్( పిపి1, పిపి2) స్కూళ్ల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అప్పగించింది. ఫౌండేషనల్ (పిపి1, పిపి2, 1,2, తరగతులు) స్కూళ్లను అలానే కొనసాగించింది. ఒకటి నుండి ఐదు తరగతులలో 60 లోపు విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలను బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా, 60పైన విద్యార్థులున్న పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా ఏర్పాటు చేసింది. ఈ పాఠశాలలకు ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంతో పాటు తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఐదుమంది ఉపాధ్యాయులను కేటాయించడం జరిగింది. 60మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉన్న ప్రాథమికోన్నత (యూపీ) పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడం జరిగింది. ఉన్నత పాఠశాలల కాంపౌండ్ లోని ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలలో విలీనం చేసి 1నుండి 10 తరగతుల వరకు గల ఉన్నత పాఠశాలలుగా మార్పు చేసింది. కొన్నిచోట్ల 6 నుండి 10 తరగతుల వరకు ఉండే ఉన్నత పాఠశాలలను కూడా ఏర్పాటు చేసింది. 1 నుండి 12 వరకు, 6 నుండి 12 వరకు తరగతులు ఉండే హైస్కూల్ ప్లస్‌లోరెండు రకాలుగా పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగింది.పాఠశాలల వారీగా వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఒక పాఠశాలకు ఒక



యాప్ పేరుతో సమగ్ర డాష్‌బోర్డును సిద్ధం చేశారు.ప్రభుత్వం లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ పేరుతో సమగ్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉపాధ్యాయులు నిత్యం ముఖ ఆధారిత హాజరు వేసే గుర్తింపు సంఖ్య (ఐడీ), పాస్‌వర్డ్‌తో యాప్‌లో లాగిన్ కావొచ్చు. ఈ యాప్‌లో స్కూల్, టీచర్, స్టూడెంట్, గవర్నెన్స్, కమ్యూనికేషన్, డ్యాష్‌బోర్డు అనే ఆరు విభాగాలున్నాయి. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు అందజేత. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ఈ కిట్‌లో ఒక్కో విద్యార్థికి అవసరమైన పాఠ్యాంశాలు (టెక్స్ట్ బుక్స్) అలాగే వర్క్ బుక్స్, నోట్ బుక్స్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ కూడా ఇస్తారు. విద్యార్థికి మూడు జతల యూనిఫాం, ఒక బ్యాగ్, బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్ట్ కూడా ఇస్తారు. ఒకటో తరగతి పిల్లల కోసం బొమ్మలతో కూడిన డిక్షనరీని ప్రత్యేకంగా తయారు చేశారు.ఈ కిట్‌ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం రూ.953.71 కోట్లు ఖర్చు చేస్తోంది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించే ఒక్కో కిట్కు ప్రభుత్వం రూ.2,279 ఖర్చుచేస్తోంది. 2025-26 విద్యా సంవత్సరానికి 35,94,774 మంది విద్యార్థులకు కిట్లు కొనుగోలు చేసారు.ఇందులో కేంద్రం రూ.175.03 కోట్లు, రాష్ట్రం రూ.778.68 కోట్లు భరించనున్నాయి. 1 నుంచి 8 తరగతి విద్యార్థులకు ఏకరూప దుస్తులకుకుట్టుకూలి కింద రూ.120, 9, 10 తరగతుల వారికి రూ.240 చెల్లించనున్నారు. తల్లికి వందనంతో రికార్డు సృష్టించారు. తల్లికి వందనం పథకం కోసం మొత్తం రూ.10,091 కోట్లు ఖర్చు విడుదల చేసినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఇందులో రూ.1,346 కోట్లు పాఠశాలల అభివృద్ధికి వెళతాయని వెల్లడించారు. అప్పట్లో ఒకరికి మాత్రమే ఇస్తే.. ఇప్పుడు ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ తల్లికి వందనం ఇస్తున్నామని ఆయన తెలిపారు. అంతేకాక విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించడానికి ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా విలువలపై పుస్తకాలను తీసుకొచ్చారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు పాఠ్యాంశాల్లో సమూల మార్పులు తీసుకొస్తున్నారు. ఇంటర్మీడియట్ సిలబస్‌ను మార్పు చేయ డంతోపాటు ప్రశ్నాపత్రాల విధానాన్ని మార్చనున్నారు. వెను కబడిన విద్యార్థులతోపాటు పిల్లలకు అదనపు బోధన అం దించేందుకు ఐఐటీ మద్రాస్‌తో కలిసి విద్యాశక్తి కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనున్నారు. అకడమిక్ క్యాలెండర్ ను సమర్థవంతంగా అమలు చేయడంతోపాటు డిజిటల్ మౌలిక సదుపాయాల్ని మెరుగుపర్చడం, ఫిజికల్, వర్చువల్ విద్యను ఏకీకృతం చేయడం ద్వారా మెరుగైన బోధన విధానాలను అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇంటర్మీడియట్‌లో వృత్తి విద్య విద్యార్థులకు డ్యుయల్ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. జాతీయ నైపుణ్య విద్య అర్హత ఫ్రేమ్ వర్క్, జాతీయ వృత్తి విద్య, శిక్షణ మండలితో కలిసి వీటిని ఇవ్వనున్నారు. పాఠశాల విద్యా శాఖలో కీలకమైన స్కూల్ కాంప్లెక్స్ విధానాన్ని ప్రభుత్వం రద్దుచేసింది. వాటి స్థానంలో క్లస్టర్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల రాష్ట్రవిద్యాశాఖ ముఖ్యకార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు.వాటిని అనుసరించిన ప్రస్తుతస్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలు వాటి దూరం, ఆయా స్కూళ్లలో విద్యార్థులు, టీచర్ల సంఖ్యను క్షేత్ర స్థాయిలో పరిశీలించి 4,034 క్లస్టర్ కాంప్లెక్స్ లను ఏర్పాటు చేసింది. పాఠశాల విద్య డైరెక్టర్ వి. విజయరామరాజు పర్యవేక్షణలో అత్యంత సమర్థవంతంగా ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలను పూర్తి చేయడం జరిగింది. మొత్తం 67,732 బదలీలు, 4,477పదోన్నతులు అమలు చేయబడ్డాయి. వారిలో, 1,494 మంది గ్రేడ్॥ ప్రధానో పాధ్యాయులు బదలీకాగా, 1,375 మంది స్కూల్ అసిస్టెంట్‌లు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు పొందారు. అదే విధంగా, 5,717 మంది మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బదిలీ పొందారు. అందుకోసం స్కూల్ అసిస్టెంట్లను బదిలీ చేయడమే కాకుండా 1,592 మంది ఎస్జీటీలు మోడల్ స్కూల్స్ హెచ్ ఎమ్స్‌గాపదో న్నతులు పొందారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 27,804 మంది ఉపాధ్యాయులు బదిలీలు పొందగా, అదే విధంగా 1,510 మంది స్కూల్ అసిస్టెంటలుగా ఎస్‌జిటిల నుండి పదోన్నతి పొందారు. అదనంగా, 31,174 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, 1,199 మంది లాంగ్వేజ్ స్కాలర్లు 344 మంది ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లను బదిలీ చేశారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతుంది. ఇందులో భాగంగా విద్యా బోధనలో నాణ్యతను పెంపొందించేందుకు నిర్వహిస్తున్న వినూత్న కార్యక్రమం పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్. ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుండి 9 తరగతుల విద్యార్థులు గణితం, ఇంగ్లీష్, తెలుగు పాఠ్యాంశాల్లో వెనకబడి ఉంటే, సాంకేతికత సాయంతో విద్యార్థుల సవాళ్లను పరిష్కరించి, తరగతి గదిలో అభ్యసన ఫలితాలు మెరుగుపరచడమేలక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా శ్రీకారం చుట్టింది.ప్రభుత్వ పాఠశాలలకు స్టార్ రేటింగ్ ఇవ్వాలనివిద్యాశాఖ నిర్ణయించింది.విద్యార్థుల్లో క్రీడానైపుణ్యాలు పెంచేందుకు ఆటలకుసంబంధించిన సామగ్రి అందించనున్నారు. ప్రభుత్వ బడుల్లో కంప్యూటర్స్ ల్యాబ్‌లను ఏర్పాటుచేయనున్నారు. ●

---

# ఒకే ఒరలో రెండు..

మహారాష్ట్ర

**ఎ.వి.వి ప్రసాద్**

నేనీదరిని.. నువ్వాదరిని అంటూ రెండు దశాబ్దాలుగాఎడమొగం, పెడమొగంగా ఉన్న 'అపూర్వ సహోదరులు' మరాఠీ కలిపింది మన ఇద్దరినీ అంటూ గతవారం చేతులు కలపడం మహారాష్ట్ర రాజకీయాలను కొత్త మలుపు తిప్పిందనే చెప్పాలి. బాలా సాహెబ్ ఠాకరే స్థాపించి పెంచి పోషించిన శివసేనలోనే తన రాజకీయ జీవితం ప్రారంభమైనా, 20సంవత్సరాల క్రితం 2005లో సొంత బాట వేసుకొని 'మహారాష్ట్ర నవ నిర్మాణ సేన' (ఎంఎన్ఎస్) అనే కొత్త పార్టీని స్థాపించి తనకు తానుగా ఎదుగుతున్న రాజ్ ఠాకరే తన పెదనాన్న కుమారుడైన ఉద్ధవ్‌ఠాకరేతో కలిసి ఒకే వేదికను ఎక్కడం,కలిసి ఉండేందుకే కలిసి వచ్చామని చెప్పడం రాష్ట్రంలోని అధికార బిజెపి కూటమికి వెన్నులో వణుకు పుట్టించిందని కూడా చెప్పాలి. ఎవరి కారణాలు వారికి ఉన్నా, శివసేన నుంచి రాజ్ విడిపోవడానికి, ఇప్పుడు కలవడానికి కూడా మరాఠీయే కారణం. అప్పట్లో శివసేన విద్యార్థి విభాగమైన'భారతీయ విద్యార్థి సేన' ను ప్రారంభించినవాడు రాజ్. మొదట్లో ఉద్ధవ్ కంటె పార్టీలో రాజ్‌కే ఎక్కువ ప్రాధాన్యం కనిపించడంతో బాలాసాహెబ్ కుమారునిగా ఉద్ధవ్‌ముందుకు వెళ్లడానికి చాలా ప్రయత్నాలే చేశారు. కానీ పదవుల పంపకంలో అలిగిన రాజ్ 2005లో శివసేన నుంచి నిష్క్రమించి 2006మార్చిలో ఎంఎన్ఎస్‌ను స్థాపించారు. ఆతర్వాత ఆయన మనసు మార్చి శివసేనలోకి తిరిగి రప్పించడానికి బాలా సాహెబ్ ఉన్నప్పుడే చాలా ప్రయత్నాలు జరిగాయి. కానీ ఏవీ ఫలించకపోగా, ఉద్ధవ్‌కు గట్టి ప్రత్యర్థిగా రాజ్‌బలాన్ని పెంచుకోవడంతో వారిద్దరిమధ్య రగిలిన సెగలు తర్వాత కాంగ్రెస్‌కు, బిజెపికి ఎంతో ఉపయోగించాయి. శివసేన కొన్నిసార్లు కాంగ్రెస్‌తోను, మరోసారి బిజెపితోను జతకట్టింది కానీ ఆ పొత్తును నిలుపుకొనలేక పోయింది. చివరికి అధికారానికి దూరమై బిజెపి కూటమికి రాష్ట్రాన్ని అప్పగించింది.. శివసేన గ్రాఫ్ పడిపోవడం, ఎంఎన్ఎస్ రేటింగ్ పెరగడంతో అన్నదమ్ములిద్దరిని తిరిగి కలపడానికి గతంలో కూడా కొన్ని ప్రయత్నాలు జరిగాయి.హిందీవ్యతి రేక ఉద్యమం జరిగినప్పుడల్లా ఇద్దరు వేర్వేరుగా ఆందోళనలు జరపడంతో వాటివల్ల తగినంత ప్రయోజనం లభించకుండా జారిపోయింది.ఇద్దరిలో రాజ్‌కు హిందీ వ్యతిరేకత చాలా అధికం. బిజెపి, కాంగ్రెస్‌తో చేతులు కలపడంతో ఉద్ధవ్‌ది సర్దుకుపోయే మనస్తత్వం. వారిద్దరూ ఇంతకాలం కలవకపోవడానికి అది కూడా ఒక కారణం. కానీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ హిందీని తప్పనిసరిచేసే త్రిభాషా విధానం అమలుచేయడానికి ప్రయత్నించడం, దానికి వ్యతిరేకంగా సోదరు లిద్దరూ వేర్వేరుగానే తొలుత ఆందోళనలు ప్రారంభించినా, చివరికి చేతులు కలపడంతో ప్రభుత్వ నిర్ణయం కూడా రాత్రికిరాత్రి మారిపోయి జూన్ 29న హిందీ అధ్యయనం తప్పనిసరి కాదంటూ ఫడ్నవిస్ కొత్త ఉత్తర్వులుజారీ చేయవలసి వచ్చింది.ఫడ్నవిస్ హిందీ విధానానికి నిరసనగా జులై 6,7 తేదీల్లో భారీఆందోళనలు జరపాలని సోద రులిద్దరు ప్లాన్ చేయడం తెలిసిన ముఖ్యమంత్రి వెంటనే కొత్త ఉత్తర్వులు జారీ చేయడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగినా వారిద్దరూ కలిసి విక్టరీ ర్యాలీ జరపాలనుకోవడంతో ఫడ్న విస్‌కు పచ్చివెలక్కాయ గొంతులో పడినట్లయింది. తాను అమలు చేద్దామనుకున్న త్రిభాషా విధానం ఠాకరే సోదరులిద్దరినీ తిరిగి కలపడంతో ఇప్పుడు బిజెపి కూటమికి కొత్త సమస్య మొదలయింది. శివసేన షిండే వర్గం, ఎన్సీపి అజిత్ వర్గం బిజెపి కూటమిలోని ప్రధాన మిత్రపక్షాలు.అవి అవసరం కొద్దీఏర్పడిన పొత్తులే కావడంతో సమీకరణాలు మారితే ప్రభుత్వం మనుగడకు ముప్పు ఏర్పడే అవకాశాలే అధికం. డిప్యూటీ సిఎంగా ఉన్న అజిత్‌పవార్, ఒక కాలు కూటమిలోను, మరో కాలుశరద్‌పవార్ నాయకత్వంలోని ఎన్సీపీలోను పెట్టి ఉంచారన్నది అందరూ ఎరిగినదే.షిండేకు బిజెపితో కలిసి సాగవలసిన అవసరం ఎక్కువఉంది. అధికారకూటమి లో లేకపోతే ఆగ్రూపులో ఎవరూ మిగలకపోవచ్చు. వారు మళ్లీ శివసేనలోకి వెళ్లే అవకాశాలే ఎక్కువ. అందువల్ల మిత్ర పక్షాలు జారిపోకుండా కాపాడుకోవడం ఫడ్నవిస్ మొదటి బాధ్యత. ఒక దశలో అజిత్‌వర్గం కూడా హిందీ వ్యతిరేకఆందోళనలకు మద్దతు ఇస్తుందని తెలియడం వల్లనే ఫడ్నవిస్ తనవిధానంలో మార్పు చేశారని అంటున్నారు. కానీ అది ఠాకరే సోదరులిద్దరు తిరిగి కలవడానికి ఉపయోగపడడంతో ఫడ్నవిస్‌కు కొత్త తలనొప్పి మొదలయినట్లయింది. అసెంబ్లీ ఎన్ని కలకు ఇంకా చాలా వ్యవధి ఉన్నా, డిసెంబర్ లేదా జనవరిలో బృహన్ముంబయి ఎన్నికలుజరు గబోతున్నాయి. ఆ ఎన్నికల్లో గెలిచిన వారికి మరాఠా రాజకీయంమీద ఎక్కువ పట్టు ఉంటుంది. ఠాకరే సోదరులిద్దరు చేతులు కలపడం వల్ల ముంబయి వారి ఖాతాలోకి వెళ్తే ఏంచేయాలన్న ది ఫడ్నవిస్‌కు మరో సమస్య. గత ఎన్నికల్లో ఉద్ధవ్ శివసేన గ్రూప్‌కు 84 సీట్లు వస్తే, బిజెపి కి రెండు తక్కువగా 82సీట్లు వచ్చాయి. ఎంఎన్ ఎస్‌కు ఏడు మాత్రమే లభించాయి.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి (బిజెపి,షిండే శివసేన, అజిత్ ఎన్సీపీ) విజయం సాధించడంతో ఎన్నికలు జరిగితే ముంబయి కూడా తమ అధీనంలోకి వస్తుందనే ధీమాతో వారు ఉన్నారు. కానీ ఇప్పుడు రాజ్, ఉద్ధవ్ చేతులు కలపడంతో సమీకరణాలు పూర్తిగామారిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. అసెంబ్లీఎన్ని కల్లో ఉద్ధవ్ కూటమికి 10 శాతం ఓట్లు వస్తే, రాజ్ ఎంఎన్ఎస్ కు 1.56 శాతం ఓట్లు వచ్చాయి. వారిద్దరితో పాటు షిండే గ్రూపు నుంచి కూడా కొంత ఓట్ల శాతం బదలీ అయితే వారి విజయాన్ని ఎవరూ నిరోధించలేకపోవచ్చు. ఇప్పుడు హిందీ కంటె ఫడ్నవిస్ ముందున్న ప్రధాన సమస్య ఇదే. రాజ్, ఉద్ధవ్ నిజంగా ఒకే ఒరలో ఇమడగలిగితే నిజంగానే అద్భుతాలు సృష్టించగలుగుతారు. హిందీ విధానంలో వెనక్కి తగ్గితే తనకు మద్దతు పెరుగుతుందనుకొన్న ఫడ్నవిస్ కు చుక్కెదురైనట్లే కనిపిస్తోంది. ●



ఉద్ధవ్, రాజ్ ఠాక్రే

---

# పాక్ కంట్లో నలుసుగా 'బెలూచ్'!

పాకిస్థాన్

**గన్ని మోహన్**

భారత్‌పైకి నిత్యం కాలుదువ్వుతూ చొరబాట్లు, ఉగ్రవాదం ఇలా తనకు అందివచ్చిన ప్రతి అస్త్రాన్ని ప్రయోగించిన దాయాది పాకిస్థాన్‌కు ఇప్పుడు బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ అదే బిఎల్ఏ పక్కలో బల్లెంగా మారింది. మానీళ్లు, మావనరులు, మా సంపద మాకే దక్కాలంటూ ప్రత్యేక దేశంగా ఆవిర్భవించాలని దశాబ్దాలుగా జరుపుతున్న పోరాటం మరింత ఉద్రిక్తంగా మారింది. ప్రత్యేకించి పాక్‌లో సంకీర్ణకూటమి వచ్చిన తర్వాత ఈ డిమాండ్ మరింత పెరిగింది.తరచూ బెలూచ్ విముక్తి సైన్యం చేస్తున్న ఈ పోరాటంలో అనేక దాడులు చేసి తన లక్ష్యాలను సాధించింది. ఈ బిఎల్ఏను కట్టడిచేసేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నా బెలూచ్ సైన్యం మాత్రం తన దాడులు నిరంతరం కొనసాగిస్తూనే ఉంది.షెహబాజ్‌షరీఫ్ పదవిలోకి రావడం, ఆపై సైనిక చీఫ్‌గా మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ఆసిమ్‌మునీర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత బెలూచ్ సైన్యం దాడులు మరింత ఉధృతం చేసింది. ప్రత్యేక దేశంగా తాము ఏర్పడి తీరుతామంటూ బెలూచిస్తాన్ ప్రజలు ఎప్పటి నుంచో చేస్తున్న డిమాండ్ ఈసారి ఖచ్చితంగా సాధించుకుంటామన్న ధీమాతో ఉన్నారు. అందుకు సాయుధ పోరాటం ఒక్కటే మార్గం అన్నట్లు వారుచేస్తున్న దాడులు స్పష్టం చేస్తున్నాయి.బెలూచ్ జాతీయ విముక్తి పోరాటం పేరిట చేస్తున్న ఈ సాయుధ పోరును ముందుండి నడిపిస్తున్నది బెలూచిస్తాన్ లిబరేషన్ ఫ్రంట్ మరికొన్ని స్వతంత్ర పోరాట శక్తులు మాత్రమే. అయినా కూడా సైన్యానికి సైతం అంతుబట్టకుండా దాడులు చేయడంలో వీటికవే సాటిగా నిలుస్తున్నాయి. బెలూచిస్తాన్ ప్రావిన్స్‌లో తాజాగా ఆపరేషన్ బామ్ పేరిట నిర్వహించిన దాడుల్లో ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం అయ్యాయి. 17 చోట్ల చేసిన దాడుల్లో అక్కడ ప్రభుత్వ ఆస్తులు మాత్రమే టార్గెట్‌గా నిలిచాయి. పంజ్‌గూర్, సురాబ్, కెచ్, ఖరన్ వంటి ప్రాంతాలతో పాటు అనేక జిల్లాల్లో దాడులు చేసింది. మక్రాన్ తీరం నుంచి కోహ్-ఎ-సులేమాన్ పర్వతశ్రేణివరకూ తమ పోరాటం విస్తరించిందని బిఎల్ఎఫ్ చెపుతోంది. సైనిక చెక్‌పోస్టులుసైతం ఈ దాడుల్లో ధ్వంసం అయ్యాయి. దాడులు చేయడం బిఎల్ఎఫ్‌కు కొత్తేమీ కాదు. రెండునెలలక్రితమే పాక్‌లో పర్వతశ్రేణుల మధ్య నుంచి వెళ్లే రైలు మార్గంలో జాఫర్‌రైలును హైజాక్ చేసారు. రైలులో ఉన్న పాక్ జవాన్లందరినీ బందీలుగాచేసారు. 90 మందిని కాల్చివేసినట్లు బిఎల్ఎఫ్ ప్రకటించింది. భారత్‌లో పహల్గాం దాడి తర్వాత పాక్ ఉగ్రస్థావరాలపై నిర్వహించిన ఆపరేషన్‌సింధూర్ అనంతరం ఈ బెలూచిస్తాన్ స్వాతంత్ర్య పోరాటం మరింత పెరిగింది. తాము ప్రత్యేక దేశంగా ప్రకటించుకుంటున్నామని, తమ దేశకరెన్సీ,తమ దేశ జెండా, తమ భౌగోళిక స్వరూపంగుర్తించాలంటూ ఇటు భారత్‌తోపాటుఅటు ఐక్యరాజ్యసమితిని కూడా కోరిన సంగతి తెలిసిందే. మరోపక్క ఈ పోరాటాన్ని అణిచివేయాలంటే పాకిస్థాన్‌కు సైనిక పాలన ఒక్కటే మార్గం అన్న ప్రచారం కూడా తెరపైకి వచ్చింది. అందుకు అనుగుణంగానే ఇటీవలి కాలంలో సైనిక చీఫ్ ఆసిమ్ మునీర్ వ్యవహారశైలి కూడా కనిపిస్తోంది. భారత్‌పై తలుచుకున్నపుడల్లా కాలు దువ్వడం, అంతర్జాతీయ వేదికలపై కాశ్మీర్ ఎప్పటికీ మాదే అంటూ ప్రగల్భాలు పలకడం అలవాటైన పాకిస్థాన్ తన దేశంలో ఎదురవుతున్న ముప్పును మాత్రం సర్దుబాటు చేసుకోలేని స్థితిలో ఉంది. ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయిన తరుణంలో బెలూచిస్తాన్‌లో ఉన్న అపారమైన వనరులన్నింటినీ చైనాకు తాకట్టుపెట్టి పబ్బం గడుపుకుంటున్నదన్న భావన బెలూచ్ ప్రజల్లో నిలిచింది. వాస్తవానికి బెలూచిస్తాన్‌లో అపారమైన ఖనిజ వనరుల సంపద ఉంది. రాగి, బంగారం, క్రోమైట్, బొగ్గు, ముడి ఇనుముతో పాటు లిథియం వనరులు కూడా అపారంగా ఉన్నాయి. అలాగే బారైట్, సల్ఫర్, మార్బుల్, లెడ్, జింక్ వంటివి అనేక వనరులున్నాయి. రేఖో డిఖ్ ప్రాజెక్టు పరంగా చూస్తే ప్రపంచంలోనే అతిపెద్ద రాగి, బంగారం నిల్వలున్న ప్రాంతంగా నిలిచింది. ముస్లింబాగ్ ప్రాంతంలో క్రోమైట్, ఛాగాయ్, ఖుజ్‌దార్ ప్రాంతాల్లో అపారమైన లిథియం నిల్వలున్నట్లు పాక్‌కు దగ్గరవుతున్న చైనా గుర్తించింది. అందుకే ఈ ప్రాంతంలోనే వివిధ ప్రాజెక్టులు, కారిడార్లు నిర్మించేందుకు పాక్ ప్రభుత్వానికి ఆర్థికవనరులు దండిగా అందిస్తోంది. రానురాను ఈ ప్రాంతంపై పట్టు సాధిస్తున్నది. ఈ ధోరణులు గుర్తించిన తర్వాతనే బెలూచిస్తాన్‌లో స్వాతంత్ర్యపోరాటం, విముక్తి పోరాటం పేరిట ఆందోళనలు పెరిగిపోయాయి. ఇటు బెలూచ్ విముక్తి పోరాటంతో పాటు పాకిస్థాన్‌కు ఇప్పుడు ఆఫ్ఘాన్ సరిహద్దు వైపు నుంచిమరో ఉగ్రవాదసంస్థ నుంచి ముప్పుపొంచి ఉంది.టిటిపి పేరిట ఈసంస్థ ఒకవిధంగా మారణహోమాన్ని సృష్టిస్తున్నదనే చెప్పాలి. ఈ ఒండు అంతర్గత ముప్పును అధిగమించలేని పాకిస్థాన్ భారత్ పైకి మాత్రం అటు చైనా,ఇటు బంగ్లాదేశ్‌లను కలుపుకుని కయ్యానికి కాలు దువ్వుతోంది. నిజానికి వ్యవసాయం,పశుసంపద కూడా అపారంగా ఉంది. సహజవాయువు, బొగ్గు, ఇతర ఖనిజ వనరుల తవ్వకాలతో ఆర్థిక వ్యవస్థకు ఈ ప్రావిన్స్ మూలస్తంభంగా నిలిచింది. పాక్ నైరుతి భాగంలో ఉన్న బెలూచిస్తాన్‌కు సరిహద్దు ఇరాన్, అఫ్గానిస్థాన్‌లతోపాటు ఖైబర్ ఫఖ్తూన్క్వా, పంజాబ్, సింధ్‌రాష్ట్రాలు ఉన్నాయి. అపారమైన ఖనిజ వనరులున్న ఈ ప్రాంతాన్ని పాక్ వదులుకునేందుకు సిద్ధంగా లేకపోయినా అగ్రరాజ్యాలు అంటే చైనా,అమెరికా వంటి దేశాలు మాత్రం ఈ ప్రాంతంపైనే ఫోకస్ పెంచాయి. తమ ప్రాంతం అభివృద్ధికి స్థానిక వనరులే కీలకం అని భావించిన బెలూచ్ పౌరుల పోరాటం సాయుధ పోరాటంగా మారటానికిదే కారణం.ఈస్థాయిలో ఉద్రిక్తతలు, హింస పెరిగి పోవడానికి కారణం కూడా పాక్ పాలకులేనని చెప్పకతప్పదు. ఇప్పటికైనా తప్పులు తెలుసు కుని ప్రాయా శ్చిత్తం లేకుంటే పాక్ పాలకులు మరింతగా ముప్పును ఎదుర్కొనాల్సి వస్తుందని నిస్సందేహంగా చెప్పవచ్చు. ●



బెలూచ్

---

# ప్రజల జీవితాలతో కల్తీ కల్లు దళారుల చెలగాటం!



మన్నారం నాగరాజు

పొద్దంతా కష్టపడే కార్మికులు, రైతులు సాయంత్రం ఓ గ్లాసు మంచి కల్లు తాగి అలసట మరిచిపోవాలని ఆశపడతారు.సహజమైన కల్లు ఒక్కసారైనా జీవానికి ఊపిరిలా కావాలి. కానీ వారికి కల్తీ కల్లు నీటికి బాదం వాసనలు కలిపి, రసాయనాలు మిక్స్‌చేసి వాసన వచ్చేలా చేసి, అసలు ఆరోగ్యాన్ని నాశనం చేసే ద్రవ్యాలను కలిపి ప్రజల జీవితాలతో దళారులు ఆడుకుంటున్నారు. కల్లును తాటి చెట్టు లేదా ఈత చెట్టు నుంచి నేరుగా తీసుకుంటారు. దీన్ని త్రాగుట వలన కొంత ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని భావించబడుతుంది. అయితే, కల్లును మితంగా తీసుకుంటే మంచిదే కాని, అధికంగా తీసుకుంటే అనారోగ్యానికి దారితీస్తుంది. కల్లు తయారీలో స్వచ్ఛత లేదనేది మరో సమస్య. అయినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో కల్లు ఆదాయ మూలంగా మారినప్పటికీ, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కల్లుపై నియంత్రణ అవసరం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కల్తీకల్లు అనేది ఒక పెద్ద ముప్పుగా మారింది. ఇది నేరగాళ్లకు లాభాన్ని తెస్తున్నా, సామాన్య ప్రజలకు మాత్రం విషపూరిత జీవనాన్ని అందిస్తోంది. కల్తీకల్లు ఉత్పత్తి, వ్యాప్తికి అనేక కారణాలు ఉన్నాయి. వీటిని సమగ్రంగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా ఈ కారణాలు సామాజిక, ఆర్థిక, పాలనా విధానాలలో లోపాలు కలిగినవిగా చెప్పవచ్చు.అసలైన మద్యం ధరలు అధికం కావడం. రోజువారీ కూలీలు, చిన్న ఉద్యోగాలు చేసే వారు ఎక్కువ ఖర్చు చేయలేరు. అందువల్ల చవకగా దొరికే కల్తీ కల్లు వైపు మొగ్గు చూపుతారు.కల్తీ కల్లు కారణంగా ఎందరో జీవితాలు అర్ధంతరంగా ముగిసిపోతున్నాయి. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కల్లు ప్రియుల బలహీనతలను ఆసరాగా చేసుకుని కల్లు డిపో నిర్వాహకులు కల్లులో నిషేధిత మత్తు పదార్థాలు మోతాదుకు మించి కలిపి విక్రయిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని రాబట్టుకునేందుకు ఈ విధంగా అడ్డదారి ఫార్ములాను వాడుతున్నారు. దీంతో కొద్దికొద్దిగా మత్తుకు అలవాటు పడి, ఒక్కరోజు కూడా కల్లు మత్తు లేకుండా ఉండలేని స్థితిలోకి వెళ్లిపోతున్నారు. కల్తీ కల్లుకు బానిసలవుతున్నారు. డిపో నిర్వాహకులు తమ వ్యాపారాన్ని పెంచుకోవడానికి నిరుపేదలు, రోజువారీ కూలీలనే టార్గెట్ చేసుకుంటున్నారు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కల్లు గీసే చెట్లు, వాటి నుంచి ఉత్పత్తయ్యే కల్లుకు, ప్రతిరోజూ కల్లు సేవించే కల్లు క్వాంటిటీకి ఎక్కడా పొంతన ఉండదు. దీంతో కృత్రిమంగా కల్లు తయారు చేయడం పైనే దృష్టి సారిస్తున్నారు కల్లు డిపో నిర్వాహకులు. నీళ్లలో తెల్లగా నురుగు వచ్చేలా ఓ లిక్విడ్ కలిపి కల్లులా కనపడేలా కృత్రిమ కల్లును తయారు చేస్తారు. దానిలో మత్తు కోసం డైజోఫాం, ఆల్ప్రాజోలం వంటి నిషేధిత మత్తు పదార్థాలు కలుపుతారు. కల్లు తాగే వారి అవసరాలను బట్టి కొంచెం మోతాదుకు మించి కూడా డైజోఫాం, ఆల్రాజోలం, మిథైల్ ఆల్కహాల్, యాసిడ్లు, రంగు పదార్థాలు వేసి నకిలీగా తయారుచేసి అమ్ముతారు. ఈత చెట్ల నుండి తీసే కల్లు మాదిరిగా కనిపిస్తున్నప్పటికీ సహజసిద్ధమైన కల్లు కాదని తెలిసినా, కృత్రిమంగా మత్తు పదార్థాలు కలిపి తయారుచేసిన కల్లు అని తెలిసినా కల్లు ప్రియులు దాన్నే ఇష్టంగా తాగుతున్నారు. క్రమక్రమంగా కృత్రిమ కల్లుకు బానిసలుగా మారిపోతున్నారు. కల్తీ కల్లు విక్రయాలు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా యథేచ్ఛగా జరుగుతున్నా సంబంధిత ఎక్సైజ్ అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. కల్లు డిపో నిర్వాహకుల నుంచి తమకు రావాల్సిన నెలవారీ ముడుపులు ఠంచనుగా వారి జేబుల్లోకి వెళితే ఎవడెలా చస్తే తమకేంటనే ఉద్దేశంతో ఎక్సైజ్ అధికారులు పనిచేస్తున్నట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసు, ఎక్సైజ్ అధికారులు కొన్ని సందర్భాల్లో పట్టించుకోకపోవడం, లేదంటే లంచాల విషయంలో రాజీపడటం వల్ల ఈ వ్యాపారం పెరుగుతోంది. ఇది కల్తీకల్లు వ్యాపారులకు మరింత ధైర్యాన్ని



ఇస్తోంది. హైదరాబాద్ నగరంలో కల్లు తాగుతున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా మురికివాడలలో నివసించే పేదలు ఎక్కువగా కల్లు తాగుతున్నారు. కల్లుకు ఉన్న డిమాండును దృష్టిలో ఉంచుకొని కల్లు అమ్మేవారు సింథటిక్ కల్లు తయారుచేయడం మొదలుపెట్టారు. దానిలో మత్తు రావడానికి ప్రమాదకరమైన క్లోరల్ హైడ్రేట్, డైజోపామ్, ఆల్రజోలం వంటివి కలపడంతో ప్రజల ఆరోగ్యంపై చాలా ప్రభావం పడడం మొదలైంది. క్లోరల్ హైడ్రేట్ నాడీ మండలంపై ప్రభావం చూపుతుంది. కడుపులోని పేగులలో మంటలకు కారణమవుతుంది. లివర్ డామేజ్ చేస్తుంది. కంటిచూపు మందగించడం, గుండెపై ప్రభావం చూపుతుంది.ఈ పరిస్థితులను గమనించి 2004లో అప్పటిప్రభుత్వం హైదరాబాద్ నగరంలో 50కి.మీ. లోపు ఈత, తాటి చెట్లు లేనందున దుకాణ దారులు సింథటిక్ కల్లు తయారుచేస్తున్నారని కల్లు దుకాణాలన్నీ మూయించారు. దీనిపై గీత సహకార సంస్థ వారు హైకోర్టును ఆశ్రయించారు. (డబ్ల్యుపి. సంఖ్య 18181 /2004). రాష్ట్ర ప్రభుత్వం ఆబ్కారీ శాఖ పాలసీ ప్రకారం హైదరాబాద్ నగరం చుట్టూ 50 కి.మీ. లలోపు తాటి,ఈత చెట్లు లేవని, హానికరమైన రసాయనాలతో కల్తీ కల్లు తయారుచేసి అమ్ముతున్నారని, 2002 నుంచి 2004 సంవత్సరాలలో కల్తీకల్లు అమ్మకంపై3,100 కేసులు నమోదు చేయడం జరిగిందని, సుమారు 100 మంది కల్తీ కల్లు బారినపడి చనిపోయినారని కోర్టుకు తెలిపింది. ప్రజల ఆరోగ్య దృష్ట్యా హైదరాబాద్ నగరంలో కల్లు దుకాణాలు మూయించినట్లు వెల్లడించింది. ప్రభుత్వ చర్యను కోర్టు సమర్థిస్తూ కేసు కొట్టివేసింది. 2004 నుంచి 2014 వరకు హైదరాబాద్ నగరంలోని కల్లు దుకాణాలు మూతపడ్డాయి. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత మూతపడ్డ కల్లు దుకాణాలను ప్రభుత్వం జీఓ 24 ప్రకారం 49 2014న మళ్లీ తెరిపించింది. ప్రభుత్వం నీరా అమ్మకం అంటూ కొత్త రాగం అందుకుంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం గుడుంబాను 2015లో ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేసింది. కానీ, కల్తీకల్లు హానికరమని తెలిసినా మూతపడ్డ దుకాణాలు తెరిపించికల్లు తాగడాన్ని ప్రోత్సహించింది. నిజానికి ప్రస్తుత సీజన్లో తాటి చెట్లకు ఆశించిన స్థాయిలో కల్లు ఉత్పత్తి కాదు. ఒకటి రెండు తాటి చెట్ల నుంచికల్లును సేకరించినా, ఇది వారి సొంత అవసరాలకు కూడా సరిపోదు. కానీ జిల్లాలోని ఏ ప్రధాన రోడ్డువెంట చూసినా కృత్రిమ కల్లు దుకాణాలే దర్శనమిస్తున్నాయి. ఎప్పటికప్పుడు ఆయా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, నమూనాలు సేకరించాల్సిన ఎక్సైజ్ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈవిషయంపై సరియైన నిర్ణయం తీసుకోవాలి. ఇక తమిళనాడురాష్ట్రంలో తాటి చెట్టు రాష్ట్ర వృక్షం అక్కడ కల్లు అమ్మకం పై నిషేధముంది. తాటికల్లును బెల్లంగా తయారుచేసి గీత పనివారు అధిక లాభాలు పొందుతున్నారు. కేరళ రాష్ట్రంలో కల్లును మత్తు పానీయంగా ప్రకటించారు. దీనిపై గీత కార్మికులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా కేరళ ప్రభుత్వం కల్లులో 8.1శాతం ఆల్కహాలు ఉంటుందని, మామూలు బీరులో 6 శాతం మాత్రమే ఆల్కహాలు ఉంటుందని అందుకే కల్లును మత్తుపానీయంగా ప్రకటించామని కోర్టుకి తెలుపగా కేసు కొట్టివేసింది. ఇక మొన్న కూకట్‌పల్లిలో కల్తీ కల్లు తాగి అవస్థకు గురైన వారిలో ఐదుగురు చనిపోయారు. దాదాపు 15 మందిని నిమ్స్,గాంధీ హాస్పిటల్‌లకు తరలించారు. కూకట్‌పల్లి ఉషా ముల్లపూడి రోడ్డులో ఎల్లమ్మబండ ప్రాంతంలోని కల్లు దుకాణాల్లో కల్లు తాగిన వారికి సోమవారం ఉదయం వాంతులు విరోచనాలు అయినట్టు తెలుస్తుంది. కల్తీకల్లు నిర్మూలన ఒకటే ప్రభుత్వ బాధ్యత కాదు. ఇది సమాజం మొత్తం కలసి చేయాల్సిన బాధ్యత. దీన్ని అరికట్టేందుకు కొన్ని ముఖ్యమైన కల్తీకల్లు తయారీదారులపై జీవిత ఖైదు లేదా మరణశిక్ష విధించాలి. నేరస్తులకు బెయిల్ అవకాశాలు తగ్గించాలి. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యం చేస్తే వారిపై సస్పెన్షన్‌తో పాటు విచారణ జరిపించాలి. అధిక ధరల వల్ల ప్రజలు కల్తీవైపు వెళ్లకూడదు. చౌక ధరలోహానికర రసాయనాలు లేని మద్యం అందుబాటులో ఉండేలా చూడాలి. గ్రామీణ ప్రాంతాల్లో నాటకాల ద్వారా, విద్యార్థులకు కథానికల ద్వారా కల్తీకల్లు ప్రమాదాలను తెలియజేయాలి. మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహించాలి.బాధిత కుటుంబాలకు తక్షణపరిహారం మాత్రమే కాదు దీర్ఘకాలిక పునరావాసం,ఉపాధి అవకాశాలు కల్పించాలి. ●

# పోలీసుశాఖలో మార్పులు సంస్కరణలతో ధైర్యం నింపిన సిపి ఎస్‌వి రాజశేఖర్ బాబు

**ఎ కొండూరు, జులై 12, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా సిపిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ఎస్‌వి రాజశేఖర్ బాబు విజయవాడ పోలీస్ కమీషనరేట్ పరిధిలో పోలీస్ శాఖలో తెచ్చిన మార్పులు సంస్కరణలను ఇటు ఆ శాఖ ఉద్యోగులు అటు ప్రజలు ఎంతో ప్రశంసిస్తున్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో నూతన టెక్నాలజీ ద్వారా నేరాలను అరికట్టడంతో నేరస్తులను గుర్తించడం వర్ధమాన నేరస్తులు కొత్త




రకాల టెక్నాలజీని ఉపయోగించి పోలీస్ శాఖకు సవాలు విసురుతున్నారని ఈ వర్ధమాన నేరస్తుల సవాళ్లను అదే టెక్నాలజీని వినియోగించి వారి నేర ప్రవృత్తిని అరికట్టడం ప్రజలు వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న అపహరణకు గురైన సెల్‌ఫోన్లు బంగారు నగలు నగదు విలువైన వస్తువులు మోటార్ వాహనాలు చోరీ సొత్తును రికవరీ చేసి తిరిగి బాధితులకు అప్పగించడం ముఖ్యంగా చైన్‌స్నాచర్లను చాలావరకు కట్టడి చేసి నేరస్తులకు త్వరగా శిక్షపడే పోలీస్ శాఖను సంసిద్ధం చేయడం వాహనదారులు హెల్మెట్ ధరించడం స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేసి చాలావరకు ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలు ప్రజలు అభినందించారు. సిసి కెమెరాల ఏర్పాటు డ్రోన్‌లను వినియోగించడం ద్వారా ప్రజల ధన మాన ప్రాణాలకు రక్షణ కల్పించడానికి ధైర్యం నింపడం ఫ్రెండ్లీ పోలీసింగ్ పోలీస్‌ల సంక్షేమానికి కృషి చేయడం ఇవన్నీ ఒక భాగమైతే మరోపక్క లా అండ్ ఆర్డర్‌కు ఎలాంటి విఘాతం కలుగకుండా శాంతి భద్రతలను కంటికి రెప్పలా కాపాడటం డ్రగ్స్ మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన వారికి కౌన్సిలింగ్ అవగాహన కార్యక్రమాలు లాంటి ఎన్నో ప్రజాహిత సమాజహిత పనులు నిర్వహించడం ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ పోలీస్ కమీషనరేట్‌కు ఎంతో గర్వకారణంగా నిలుస్తోందని ఎన్‌టిఆర్ జిల్లా ప్రాంత ప్రజలు పోలీస్ శాఖలో కింద స్థాయి ఉద్యోగులు పని చేయడం గర్వంగా ఉందని వివిధ వర్గాల వ్యాపారులు ఉద్యోగులు విద్యార్థులు మహిళలు సీనియర్ సిటీజన్లు రచయితలు కవులు కళాకారులు మేధావులు జర్నలిస్టులు సిపి రాజశేఖర్‌బాబు విధి నిర్వాహణలో అంకితభావం అకుంఠిత దీక్ష సమాజ సేవా దృక్పథం విశేషంగా ప్రశంసిస్తున్నారు.

# విజ్ఞానదాయకంగా సుజికాన్ 2025 వాకథాన్

**విజయవాడ, జులై 12, ప్రభాతవార్త :** విజయవాడ అసోసియేషన్ ఆఫ్ జెనైటో యూరినరీ సర్జన్స్ ఆధ్వర్యంలో ప్రశాంత్‌హాస్పటల్ కేంద్రంగా శనివారం నిర్వహించిన సుజికాన్ 2025 ఓ విభిన్నఘట్టం ఆవిష్కృతమైంది. ప్రొస్టేట్ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎయిమ్స్ నుండిసికె కన్వెన్షన్ వరకు 2.5 కిమి సాగిన ఈ యాత్ర విజ్ఞానదాయకంగా జరిగింది. ఎయిమ్స్ ఇడి అమర్నాథ్ సింగ్, ఎఎస్యు ప్రెసిడెంట్ డా చెంగల్రాయన్ లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుజికాన్ 2025 ఆర్గనైజింగ్ చైర్మన్ డా సివి సతీష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా



ధీరజ్‌కాసరనేని మీడియాతో మాట్లాడుతూ 36వ సదరన్ యురాలజిస్ట్స్ అసోసియేషన్ వార్షిక సదస్సు (సుజికాన్2025) యురాలజి చికిత్సలో కీలకమైలురాయిగా నిలుస్తుందన్నారు. దేశవ్యాప్తంగా వున్న 1000 మంది యురాలజిస్టులు, ప్రతినిథుల ఈ సదస్సుకు హాజరయ్యాయన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్ హాస్పటల్ చైర్మన్ డా కె ప్రశాంత్‌కుమార్ కాసరనేని, కోశాధికారి డా జి అజయ్‌కుమార్, డా పి శ్రీమన్నారాయణ, డా జి శ్రీనివాసరావు, డా జి రవిశంకర్, డా సి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి

## -వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

**పొన్నూరు, జులై 12,ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. చేబ్రోలు పరిమి సత్యనారాయణ కళ్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి బాబు ష్యూరిటీ...మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేక చతికిలపడిపోయిందన్నారు. అదేమని ప్రశ్నిస్తే, ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష పార్టీలపై కేసులు నమోదు చేయడం, ఇతరత్రా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. చంద్రబాబునాయుడు పాలన అంతా అబద్ధాలు, అసత్యాలతో నడుస్తుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. రానున్న కాలంలో పార్టీని బలోపేతం చేసి మళ్ళీ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకొనేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా జగన్మోహనరెడ్డి చూస్తారన్నారు. ఈసారి కార్యకర్తలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జగన్మోహనరెడ్డి భావిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం మాటలకు, చేస్తున్న పనులకు పొంతన లేకుండా పోయిందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. రానున్న రోజుల్లో పార్టీని బోలపేతం చేయడంతోపాటు, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు. కూటమి ప్రభుత్వం అబద్ధాలతో కాలక్షేపం చేస్తుందన్నారు. ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని తు.చ తప్పకుండా అమలు చేసిన ఘనత జగన్మోహనరెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పొన్నూరు, చేబ్రోలు ఎంపిపిలు భవనం పద్మలీల, కొక్కిలిగడ్డ సాహితి, ఉపాధ్యక్షుడు పసులేటి శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, షేక్ మహమ్మద్(మాము), చింతలపూడి మురళీకృష్ణ, షేక్ నాజర్, అంబటి వెంకటేశ్వరరావు, అల్లం వెంకట్రామయ్య, చాన్‌బాషా, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఈనెల 12 నుండి 14 వరకు అమేజాన్ బిజినెస్‌లో ఉత్తేజభరిత డీల్స్

**విజయవాడ, జులై 12, ప్రభాతవార్త :** తమ బిజినెస్ కస్టమర్లకోసం 72 గంటలపాటు సాగే ప్రైమ్‌డే లో ల్యాప్‌టాప్, టాబ్లెట్, హెడ్‌ఫోన్స్, ఏసిలు, కూలర్లు, ఫ్యాన్లు, ఆఫీస్ ఫర్నిచర్, కిచెన్ ఉపకరణాలు, పారిశ్రామిక సప్లైస్ సహా విస్తృతశ్రేణి ఉత్పత్తులను అందిస్తున్నట్లు అమేజాన్ బిజినెస్ ప్రతినిథులు తెలిపారు ప్రీపెయిడ్ ఆర్డర్లపై అర్హత వున్నశ్రేణుల్లో రు.9,999వరకు క్యాష్‌బ్యాక్ ను ఆనందించాలన్నారు.

# కేవలం 24గంటల్లో అమేజాన్ ప్రైండే ప్రారంభం

**విజయవాడ, జులై 12, ప్రభాతవార్త :** ప్రైమ్‌డేలో తామందించే అపరిమిత ఆఫర్లను అందుకోటానికి 24గంటలే మిగిలాయని కస్టమర్లందరూ ఈ ఆఫర్లు అందుకోవాలని అమేజాన్ ఇండియా ప్రతినిథులు తెలిపారు. జులై 14 రాత్రి 11.59 వరకు మాత్రమే అమల్లో వుండే ఈ ప్రైండేలో ఉత్తమ డీల్స్, బ్లాక్‌బస్టర్ విడుదలలు, స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్ అండ్ బ్యూటి, హోం, కిచెన్, కిరాణా ఇంకా ఎన్నో శ్రేణుల్లో వేగవంతమైన డెలివరీలు కూడా ఆనందించాలన్నారు.

# టాటాన్యూ హెచ్‌డిఎఫ్‌సి క్రెడిట్ కార్డుతో ఆర్డర్లపై జొమాటో ఆఫర్లు

**విజయవాడ, జులై 12, ప్రభాతవార్త :** టాటాన్యూ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ క్రెడిట్ కార్డులతో చేసే ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్లపై అపరిమిత రివార్డులు అందిస్తున్నట్లు జొమాటో ఉత్పత్తి వైస్ ప్రెసిడెంట్ రాహుల్ గుప్తా తెలిపారు. దీనికోసం తాము టాటా డిజిటల్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు. ప్రతి లావాదేవీపై 10శాతం వరకు క్యాష్‌బ్యాక్ (కనీసం రు99 ఆర్డర్‌లపై) అందిస్తామని ఆ క్యాష్‌బాక్‌ను భవిష్యత్తులో జొమాటో ఆర్డర్లపై ఉపయోగించుకోవచ్చున్నారు.

# విజయవాడ వార్త

# గ్యాస్ ప్రమాదాలపై వినియోగదారులకు అవగాహన

**తిరువూరు, జులై 12, ప్రభాతవార్త :** తిరువూరు పట్టణంలోని 3వ వార్డు ఎరుకల కాలనీలో శ్రీరఘు ఇండేన్ గ్యాస్ కంపెనీ మేనేజర్ గంజా కృష్ణమోహన్ శనివారం గ్యాస్ ప్రమాదాలపై వినియోగదారుల సమక్షంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో గ్యాస్ వాడకం సమయంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు అనుకోని పరిస్థితుల్లో ప్రమాదం ఎదురైతే ఏ విధంగా తమను తాము కాపాడుకోవాలి అనే అంశంపై వినియోగదారులకు వివరణ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.



# రాజధాని నిర్మాణ పనుల్లో ప్రమాద నివారణకు పటిష్ట చర్యలు

## గుత్తేదారులకు ఏడీసీ సీఎండీ ఆదేశాలు

విజయవాడ,జులై12,ప్రభాతవార్త: రాజధాని నిర్మాణ పనుల్లో అక్కడ పనిచేస్తున్న కార్మికులు, సాధారణ ప్రజలకు ఎటువంటి ప్రమాద పరిస్థితులు తలెత్తకుండా గుత్తేదారు సంస్థలు చర్యలు చేపట్టాలని అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) చైరపర్సన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి డి.లక్ష్మీపార్థసారథి వారు ఆదేశాలు జారీచేశారు. శనివారం ఆర్వీఆర్ సంస్థ చేపడుతున్నఎన్14, ఈ 8, ఈ 6, ఎన్ 7, 10, 11 రహదార్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అంతకు ముందు తుళ్లూరులోని ఆర్వీఆర్ క్యాంపును పరిశీలించి ప్రపంచ బ్యాంకు నిబంధనలను పాటిస్తూ కార్మికులకు ఆహారం, వసతి సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. రహదార్ల నిర్మాణ ప్రదేశాలలో ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ మేజర్స్ ను క్షేత్రస్థాయిలో పర్యటించి తనిఖీ చేశారు. ఆయా రహదార్లపై ప్రయాణించే వారికి ఎటువంటి ప్రమాదాలు వాటిల్లకుండా ఎక్కడికక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నీటి కుంటలు, నిర్మాణ తవ్వకాల వద్ద రేడియం స్టిక్కర్లతో కూడిన హార్డ్ బ్యారికేడింగ్ సదుపాయాలు కల్పించాలన్నారు. అదేవిధంగా వర్షాకాలంలో చేపట్టవలసిన పనులను వేగవంతం చేయాలని గుత్తేదారు సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఏడీసీ చీఫ్ ఇంజినీరు ఆర్.గోపాలకృష్ణారెడ్డి, ఎస్ఈలు నరసింహమూర్తి, నరసింహారావు, వి.శ్రీనివాస్, ఈఈలు బసవేశ్వరరావు, రమేష్, వైకుంఠరావు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



# సూపర్ స్వచ్ఛత లీగ్‌కు నగరపాలక సంస్థ ఎంపిక : కమిషనర్ ధ్యానచంద్ర

**-ఈ పురస్కారం రాష్ట్రానికి చెందుతుందన్న వైనం**

**-ఈ నెల 17న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నామన్న కమీషనర్ ధ్యానచంద్ర**

**-ఈ అవార్డు సాధించడానికి కారకులైన పారిశుద్ధ కార్మికులకు ధన్యవాదాలు తెలిపిన మేయర్ భాగ్యలక్ష్మి.**

**విజయవాడ కార్పొరేషన్,జులై 12,ప్రభాతవార్త:** సూపర్ స్వచ్ఛ సర్వేక్షన్ 2004లో,సూపర్ స్వచ్ఛత లీగ్‌లో నగరపాలక సంస్థ ఎంపికైందని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2024లో భాగంగా మొట్టమొదటి సారిగా సూపర్ స్వచ్ఛతా లీగ్ ప్రవేశపెట్టిన సంవత్సరం లోనే లీగ్‌లో విజయవాడ నగరం ఎంపిక కావడం గర్వకారణమని,ఇండోర్,నవీ ముంబాయి ,సూరత్ నగరాల జాబితాలో విజయవాడ నగరం కూడ చేరినందుకు తమకెంతో గర్వంగా ఉందని, ఈ అవార్డు నగర ప్రజలు,పారిశుద్ధ్య కార్మికులు స్వచ్ఛ సర్వేక్షన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరిదని తెలిపారు. 2004లో విజయవాడలో తీవ్రమైన విపత్తు బుడమేరు వరదలు సంభవించినప్పటికీ గత సంవత్సరాల కంటే ఎక్కువగా అత్యుత్తమ స్థానాల్లో ఉన్న నగరాలతో పాటు స్వచ్ఛ సర్వేక్షన్‌లో విజయవాడ స్థానం దక్కించుకోవడం గొప్ప విషయమని అన్నారు. ఈ నెల 17న దేశ రాజధాని న్యూ ఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్‌లో జరుగబోయే స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమం 2024లో ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోబోతున్నామన్నారు.విపత్తు సమయంలో ఆంధ్ర రాష్ట్ర సిఎం చంద్రబాబు నాయుడు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ మినిస్టర్ పొంగూరు నారాయణ, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్‌కుమార్, డిఎంఎ పి.సంపత్ కుమార్, స్వచ్ఛాంధ్ర ఎండి వి.అనిల్‌కుమార్ రెడ్డిల సహకారంతో విజయవాడ నగరం పదివేల పారిశుద్ధ్య కార్మికులతో,200 మందికి పైగా అధికారులతో, 32కు పైగా ఐఎఎస్‌లతో వరదల వల్ల వచ్చిన వ్యర్థాలకు,వ్యర్థ నిర్వహణ చేయడం వల్ల విజయవాడకు ఉత్తమ పురస్కారాన్ని అందుకో బోతోందని తెలిపారు. ఈ పురస్కారం కేవలం నగరానికే కాదు ఆంధ్ర రాష్ట్రమంతటిది అని అన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ అవార్డు రావడానికి ముఖ్య కారకులైన ప్రజలు,పారిశుద్ధ్య కార్మికులు ,సిబ్బందికి ధన్యవాదాలు తెలియచేశారు.



# పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో సిగిరెట్,తంబాకు, డ్రగ్స్,గంజాయి అమ్మితే చర్యలు : ఈగల్ ఐజిపి ఆకె రవికృష్ణ

**విజయవాడ క్రైం,జులై 12,ప్రభాతవార్త:** పాఠశాలలకు 100 మీటర్ల దూరంలో ఎక్కడైనా సిగిరెట్,తంబాకు,డ్రగ్స్,గంజాయిలను అమ్మితే చర్యలు తీసుకుంటామని ఈగల్ ఐజిపి ఆకె రవికృష్ణ పేర్కొన్నారు. విజయవాడ కమీషనరేట్ పరిధిలో శనివారం ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమంలో భాగంగా ఈగల్ ఐజిపి ఆకె రవికృష్ణ,విజయవాడ కమీషనరేట్ అడ్మిన్ డిసిపి సరితల అధ్వర్యంలో మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధి లోని సిద్ధార్థ ఫార్మసీ కళాశాల,నలంద స్కూల్ ప్రాంతాల్లో ఉన్న కిరాణా,పాన్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఓటిపిఎ చట్టం 2003 ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్,ఈగల్ బృందాలు చేపట్టిన ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్‌లో స్కూలు చుట్టుపక్కల 100 మీటర్ల దూరంలో ఉన్న అన్ని పాన్ షాపులను రాండ ంగా చెక్ చేశామని తెలిపారు. ఈ తనిఖీల సమయంలో అక్కడే విక్రయిస్తున్న పొగాకు,తంబాకు,సిగిరెట్లపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. గత వారం రోజుల్లో ఆరు వేల షాపులను తనిఖీ చేశామని ఏడు లక్షల 50వేల రూపాయల జరిమానాను విధించామన్నారు. అమ్మకందారులపై భవిష్యత్తులో అమ్మకుండా హెచ్చరికలు జారీ చేశామన్నారు. అదే విధంగా ఈ ఉద్యమంలో టీచర్స్ అందరూ భాగస్వాములు కావాలని, 100 మీటర్ల పరిధిలో ఎక్కడైనా సిగరెట్, తంబాకు,డ్రగ్స్,గంజాయి అమ్మకాలు,కొనుగోలు,రవాణా జరుగుతున్నా యనే సమాచారం ఉంటే ఖచ్చితంగా ఈగల్ టోల్ ఫ్రీ నెం.1972కి కాల్ చేయమన్నారు. యువతను విద్యాసంస్థలను కాపాడటం కోసం మనం అందరం కలిసి పోరాడాలన్నారు. పొగాకుకు సంబంధించిన అమ్మకాలు ప్రత్యక్షంగా ప్రతి ఒక్కరు సమాచారం ఇచ్చి యువత భవిష్యత్తును కాపాడాలని ప్రతి ఒక్కరిని కోరుతున్నామని పేర్కొన్నారు. అనంతరం



సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో జరిగిన డ్రగ్స్,మాదక ద్రవ్యాల వ్యసనాలపై అవగాహన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు వాటి హానికర నష్టాలపై స్పష్టమైన సందేశం ఇచ్చారు. పాఠశాల,కళాశాలల వద్ద డ్రగ్స్ రహిత విద్యా సంస్థల దిశగా ఈ ఉద్యమానికి నాయకత్వం వహించాలన్నారు. అక్రమ వినియోగాన్ని నిరోధించేందుకు విద్యార్థులకు 100 మీటర్ల పరిధిలో వ్యాప్తి కలిగిన దుకాణాలపై నిఘా పెట్టాలని, విద్యార్థుల్లో అవగాహన పెంచే డ్రగ్స్ వద్దు బ్రో వంటి కార్యక్రమాలు, తంబాకు,సిగరెట్, అమ్మకాలు,ఉత్పత్తులపై నిరంతర తనిఖీలతో పాటు ఈగల్ క్లబ్ అధ్వర్యంలో నిరంతరం అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తామని, తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని, టుబాకో రహిత విద్యాసంస్థలు,1972 ఈగల్ కాల్ సెంటర్ సమాచారం ప్రకారం చట్టపరమైన చర్యలతో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌ని తీర్చిదిద్దే లక్ష్యంతో ఈగల్ ముందుకు వెళ్తోందని,డ్రగ్స్ రహిత విద్యాసంస్థలకు ప్రధానంగా ఆయన సూచించారు.

# సిరివెంచర్ ప్రాంతంలో నలుగురు గంజాయి సేవిస్తున్న యువకుల అరెస్టు

**తిరువూరు, జులై 12, ప్రభాతవార్త :** తిరువూరు పట్టణం సిరివెంచర్ ప్రాంతంలో అక్రమంగా గంజాయి పంచుకుని వినియోగిస్తున్న సుందరయ్య కాలనీకి చెందిన గుంజ



వెంకటేశ్వరరావు అలియాస్ వెంకటేష్ అలియాస్ కాకి అలియాస్ కోతి (21), రామన్నపాలెంకు చెందిన కంభంపాటి సింహాద్రి (21), భగత్‌సింగ్ కాలనీకి చెందిన గంధసిరి ఉపేంద్ర (19), సుందరయ్య కాలనీకి చెందిన మొగలిపువ్వు ఆనంద్ కుమార్ (25) అనే నలుగురు నిందితుల నుండి గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను తిరువూరు తహాశీల్దార్ ఎం ఉదయ్ భాస్కర్, విఆర్వోలు, మరియు పోలీస్ సిబ్బందితో కలసి ఆకస్మిక దాడి చేసి అదుపులోకి తీసుకుని ఎన్‌డిపిఎస్ చట్టం సెక్షన్ 8(సి) ఆర్/డబ్లు 20(బి)(11)(ఎ) ప్రకారం సిఆర్.నెం. 190/2025గా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# సబ్సెపెహ్లీ లైఫ్ ఇన్సూరెన్స్ పేరుతో జీవిత బీమాపై అవగాహన

**విజయవాడ, జులై 12, ప్రభాతవార్త :** లైఫ్ఇన్సూరెన్స్ కౌన్సెల్ ఆధ్వర్యంలో జీవిత బీమాపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు శనివారం సబ్సె పెహ్లీ లైఫ్ ఇన్సూరెన్స్ పేరుతో నగరంలో బీమాపై అవగాహన కా ్యంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీమా అవగాహన కమిటీ సభ్యులు మాట్లాడుతూ నేషనల్ ఇన్సూరెన్స్ అకాడమి డిసెంబర్ 2023 అధ్యయనం ప్రకారం భారతదేశం ఎక్కువ జీవిత బీమా రక్షణ లోటు ఎదుర్కొంటోందన్నారు. దీని పరిష్కారానికి తాము చేసే ప్రచారంలో జీవితబీమాను ఆర్థిక పునాదిగా చేసుకోడానికి అవగాహన కల్పిస్తుందన్నారు. ఈ ఏడాది పొడవునా టివి, డిజిటల్, ప్రింట్, అవుట్‌డోర్ తదితర బహుళ మీడియా ప్లాట్‌ఫాంలద్వారా ప్రచారం చేస్తామన్నారు.

# వైఎస్ విగ్రహానికి ముసుగు వేసి తాళ్లతో కట్టడం అన్యాయం

## -మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ షేక్ సలీం

**మంగళగిరి, జులై 12 ప్రభాతవార్త :** యర్రబాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని దివంగత నేత వైయస్




రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ముసుగు వేసి తాళ్లతో కట్టి వేయడాన్ని కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ షేక్ సలీం ఖండించారు.వైయస్ విగ్రహాన్ని ముసుగు వేసి కట్టి వేయడం ఏమిటని ప్రశ్నించారు. అంతకుముందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్దకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చేరుకొని పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా షేక్ సలీం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలువైయస్ షర్మిల రెడ్డి, గుంటూరు జిల్లా అధ్యక్షులు చిలక విజయ్ కుమార్ ఆదేశాలతో పెద్ద ఎత్తున నిరసన తెలిపామని అన్నారు. ఆరోగ్యశ్రీ ప్రారంభించిన మహానేత పేదల పాలిట పెన్నిది అయిన వైయస్ రాజశేఖర్ రెడ్డి సేవలను గుర్తు చేసుకుంటూ ఆసుపత్రి ప్రాంగణంలో గతంలో విగ్రహం ఏర్పాటు చేస్తే ఇప్పుడు తొలగించడం ఏంటని ప్రశ్నిం చారు. విగ్రహాలకు ముసుగు వేయ వచ్చేమో కానీ, మహానేతను ప్రజల హృదయాల్లో నుంచి తొలగించలేరని హెచ్చరించారు. ఆసుపత్రి వద్ద ఉన్న వైయస్‌ఆర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నా చేపట్టి ఆసుపత్రి సిబ్బందిని ప్రశ్నించగా మెడికల్ క్యాంపు నిర్వహించామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. అయినా మెడికల్ క్యాంపు కి వైయస్ విగ్రహం ఏమీ అడం వచ్చిందని అన్నారు.వైయస్‌ఆర్ విగ్రహానికి ఉన్న ముసుగు తొలగించి, పాలాభిషేకం చేసినివాళులర్పించారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా కాపు సాధికారక చైర్మన్‌రేమిడి శెట్టి హనుమంతరావు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు షేక్ మున్ని,మంగళగిరి మండల అధ్యక్షులుకుప్పాలకృష్ణ చౌదరి,తాడేపల్లి మండల అధ్యక్షులు షేక్ పఠాన్ సుభాని,తాడేపల్లి పట్టణ అధ్యక్షులు దర్శనపు శామ్యూల్ పాల్గొన్నారు.

# నాగపూర్ షరీఫ్‌లో తాజుద్దీన్ బాబా 103వ ఉర్స్ గంధ మహోత్సవం

**అమరావతి, జులై 12, ప్రభాతవార్త :** పరమపవిత్ర సూఫీ తీర్థయాత్ర గుంటూరు జిల్లా వేమూరు నియోజకవర్గం జంపని ఎబిఎస్‌టిఎ దర్బార్ నుండి ఈ నెల 17న మహారాష్ట్రలోని నాగపూర్ షరీఫ్ హజరత్ సూఫీ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షాతాజ్ ఖాదరీ బొగ్దాది బాబా ఎన్‌టిఆర్ జిల్లా చీమలపాడు వారి దివ్య ఆశీస్సులతో నాగపూర్ హజరత్ తాజుద్దీన్ బాబా 103వ ఉర్స్ గంధ మహోత్సవానికి భక్తి శ్రద్ధలతో అత్యంత వైభవంగా బాబా వారి భక్తులతో బయలుదేరుతున్నట్లు ఎబిఎస్‌టి దర్బార్ ఫౌండర్ అతా ముహమ్మద్ నిజాముద్దీన్ నిజామి షాతాజ్ ఖాదరీ (అతా నిజాంబాబా) శనివారం మీడియాకు తెలిపారు. "రోషన్‌హువా ఏ చిరాగ్ ఘర్సే అతావుల్లా షాహ్‌కే జల్తా రహేగా సాయమే పీరాన్ పీర్‌కే" తేరే దీదార్‌కే ఖాబిల్‌తో కహా మేరినజర్‌హై ఏ తేరీ ఇనాయత్‌హైకె రుఖ్ తేరా ఇదర్‌హై 103వ ఉర్సు గంద మహోత్సవానికి బాబా భక్తులు వేలాదిగా నాగపూర్ తరలివస్తున్నారని తెలిపారు.

# తెదేపాలో యాదవులకు సముచిత స్థానం

**తాడేపల్లి,జులై 12,ప్రభాతవార్త :** మంగళగిరి 30వ వార్డు యాదవ పాలెంలో ఇటీవల నూతనంగా మార్కెట ్ యార్డు డైరెక్టర్‌గా నియమితులైన బైరబోయిన పద్మావతిని శనివారం తెలుగుదేశం పార్టీలోని యాదవ సామాజిక వర్గం నాయకులు కలసి అభినందించారు.ఈ సందర్భ ంగా బైరబోయిన పద్మావతి,శ్రీనివాసరావు దంపతులను రాష్ట్ర టిడిపి బిసి సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్,పార్టీ రూరల్ అద్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు,నాయకులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి,పుష్పగుచ్చాలు అందించారు.అనంతరం దానబోయిన,పల్లబోతుల మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన నాటి నుండి యాదవ సామాజికి వర్గంకు పార్టీ సముచిత స్థానం ఇస్తుందన్నారు.బైరబోయని కుటుంబం పార్టీ ఆవిర్భావం నుంచి చేస్తున్న కృషిని గుర్తించి రాష్ట్ర మంత్రి నారా లోకేష్,పద్మావతిని యార్డు డైరెక్టర్‌గా నామినేట్ చేయడం అభినందనీయ మన్నారు.టిడిపి అంటే బిసిలని,నాటి ఎన్టీఆర్ నుంచి నేట ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వరకు పార్టీలో బిసిలకు పెద ్దపీట వేసిన ఘనత భారతదేశంలో టిడిపి దని వారన్నారు.పద్మావతి రైతులు అభివృద్ధికి కృషిచేస్తూ భవష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆలా వెంకట నారాయణ,బత్తుల నాగరాజు,రుద్రు శ్రీనివాసరావు,చింకా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# నిరుపేదలకు అండగా సిఎం సహాయనిధి

## ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ

**బాపట్ల, జులై12,ప్రభాతవార్త:** నిరుపేదలకు వైద్యఖర్చుల నిమిత్తం సిఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు.శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అర్హులైన 25మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల సహాయార్థం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ నిధి నుండి వచ్చిన రూ. 14,15,822 విలువ గల సిఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు.ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల మండలం గుడిపూడి గ్రామానికి చెందిన కందెపూడి రామారావుకి రూ.3,25,368, బాపట్ల మండలం ఆదర్శనగర్ కి చెందిన కొక్కిలిగడ్డ రామకృష్ణకి రూ.1,56,652, అడవిపల్లి పాలెం గ్రామానికి చెందిన చౌడిపల్లి కనకరాజుకి రూ.84928, గోపాపురం గ్రామానికి చెందిన కుంచెర్ల లోకానందంకి రూ.65918, నందిరాజుతోట గ్రామానికి చెందిన మామిడాల శేష మోహన్‌రావుకి రూ.56779 ,కంకటపాలెం గ్రామానికి చెందిన ఆవుల వెంకటేశ్వర్లుకి రూ. 53721,పూండ్ల గ్రామానికి చెందిన కోట వెంకటేశ్వర్లుకి రూ.51486, పిన్నిపోయినవారి పాలెం గ్రామానికి చెందిన డి.చిన్నకి రూ.51310,చెరువు జమ్ములపాలెం గ్రామానికి చెందిన కె. కియాష్కి రూ.45350,అప్పికట్ల గ్రామానికి చెందిన షేక్ . ఖాసిం సాహెబ్ కి రూ.43100,ముత్తాయిపాలెం గ్రామానికి చెందిన కర్రీ వీర్లంకయ్యకి రూ.43020, కొండబొట్లవారిపాలెం గ్రామానికి చెందిన యు.పావనికి రూ. 42610, అడవి పల్లి పాలెం గ్రామానికి చెందిన పి.అప్పలరాజుకి రూ. 40350,నందిరాజుతోట గ్రామానికి చెందిన బొర్ర వీర వసంతరావుకి రూ.40000,అడవిపల్లి పాలెం గ్రామానికి చెందిన బండి మార్తకి రూ.37724,మరుప్రోలువారి పాలెం గ్రామానికి చెందిన మేరుగు రాజారావుకి రూ.35800,బాపట్ల మండలం వెదులపల్లి గ్రామానికి చెందిన ఎం శ్రీనివాసరావుకి రూ.35880, నందిరాజుతోట గ్రామానికి చెందిన కాసాని శంకర్రావుకి రూ. 33070, మూలపాలెం గ్రామానికి చెందిన బెజ్జం సాగర్‌కి రూ.30514,బేతపూడి గ్రామానికి చెందిన దిండు సాయి ఆది రామారెడ్డికి రూ.30541, పిన్నిపోయినపాలెం గ్రామానికి చెందిన పి.కాళికాంబకి రూ.26479,ఆదర్శనగర్ కి చెందిన కే. పద్మాకి రూ.26240,అప్పికట్ల గ్రామానికి చెందిన ఇనగంటి అమరేశ్వరికి రూ.20524, అడవి పల్లెపాలెం గ్రామానికి చెందిన గుడిపల్లి చిట్టెమ్మకి రూ.20295,కృపా నగరికి చెందిన జి. కుసుమకి రూ.18163లను అందజేశారు.ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివ సాంబి రెడ్డి, బాపట్ల మండల పార్టీ అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, బాపట్ల పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని ప్రతి ఇంటికి చేరవెయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**బాపట్ల, జులై12,ప్రభాతవార్త:** అభివృద్ధిని ప్రతి ఇంటికి చేరవెయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు.శనివారం కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో రాష్ట్ర



ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 8వ వార్డు జమేదార్ పేటలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొని ఇంటింటికీ వెళ్లి గత ఏడాది కాలంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, ఎట్టుబడులు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకుని, ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, కరపత్రాలను ప్రజలకు అందించారు.ప్రతి కుటుంబాన్ని కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకొని,వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని నాయకులకు, అధికారులకు సూచించారు. అభివృద్ధిని ప్రతి ఇంటికి చేరవేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివ సాంబి రెడ్డి,బాపట్ల పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు,వార్డు ప్రెసిడెంట్ చింతా యేశోబు,క్లస్టర్,యూనిట్,బూత్ ఇన్ ఛార్జ్,వార్డు కమిటీ నాయకులు,తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మునిసిపల్ ఇంజనీర్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**బాపట్ల, జులై12,ప్రభాతవార్త:** మున్సిపల్ ఇంజనీర్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తమ న్యాయమైన డిమాండ్లను తక్షణ పరిష్కరించాలని కోరుతూ జీవో నెంబర్ 36 అమలు చేయాలని




బాపట్ల నియోజకవర్గ శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మను కలిసి అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీర్ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామి ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు బాపట్ల పట్టణ నాయకులు కే శరత్ మున్సిపల్ ఇంజనీరింగ్ యూనియన్ నాయకులు రత్నం నాని మురళి కృష్ణ హరిబాబు ప్రమేల ఏసమ్మ నరేష్ సామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఆర్టీసీ డిపోలో డయల్‌యువర్ డిఎం

**నరసరావుపేట టౌన్, జూలై 12 ప్రభాతవార్త :** స్థానిక ఆర్టీసీ డిపోలో సోమవారం డయల్‌యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు శనివారం తెలియజేశారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. డిపో పరిధిలో బస్ సర్వీసులకు సంబంధించి ప్రయాణికులకు అవసరమైన సలహాలు, సూచనలు తెలియజేయాలని కోరారు. అదే విధంగా ప్రయాణికులు ఏవైనా సమస్యలు ఉంటే వాటిని కూడా తమ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా తెలియజేస్తూ సమాచారాన్ని 9959225428కు తెలియజేయాలని డిపో మేనేజర్ శ్రీనివాసరావు ప్రయాణికులకు సూచించారు.

## పట్టణంలో పూల మొక్కల పంపిణీ

**నరసరావుపేట టౌన్, జూలై 12 ప్రభాతవార్త :** స్థానిక పట్టాభిరామస్వామి ఆలయ ఆవరణలో శనివారం మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా చేతుల మీదుగా పూల మొక్కలు, పూల కుండీలను మహిళలకు పంపిణీ చేశారు.



కల్పవల్లి సేవా ట్రస్ట్ ఛైర్మన్ కేశవరావు కార్యక్రమాన్ని నిర్వహించారు. సుబ్బరాయగుప్తా మాట్లాడుతూ మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన ట్రస్ట్ సభ్యులను అభినందించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలను తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో బత్తుల మురళి, వనమా సాంబశివరావు, చేగు వెంకటేశ్వరరావు, గట్టుపల్లి సత్యనారాయణ, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## జీ తెలుగులో జూలై 14నుండి 'జయం' సీరియల్ ప్రసారం

**అమరావతి, జూలై 12, ప్రభాతవార్త :** తెలుగు ప్రజలకు వినోదాన్నిచ్చేలా ప్రేమ, పట్టుదల, బాధ్యతల నడుమసాగే నూతన సీరియల్ జయం ను ఈనెల 14నుండి ప్రతిరోజు రాత్రి 8 గంటలకు ప్రసారం చేస్తామని జితెలుగు ప్రతినిథులు తెలిపారు. శ్రీరాం వెంకట్, వర్షిణి లు ప్రధాన పాత్రలతో రూపొందించామన్నారు.

## అనసూయమ్మకు నివాళులర్పించిన ఎమ్మెల్యే యరపతినేని

**గురజాల, జూలై 12 ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శనివారం ఇటీవల అనారోగ్యంతో



మరణించిన బిగ్ టివి బ్యూరో చీఫ్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు యేచూరి శివ మాతృమూర్తి అనసూయమ్మ వైకుంఠ సమారాధన జరిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హాజరై అనసూయమ్మ చిత్రపటంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రాజెక్ట్ చైర్మన్ పులుకూరి కాంతారావు, గురజాల మండల టీడీపీ అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, నేలవల్లి బొల్లయ్య, శరమాల హనుమంతురావు, యేచూరి శ్రీనివాసరావు, నవులూరి శ్రీరామ్మూర్తి, ఆకుల పిచ్చయ్య గుప్త, పెరుమాల ప్రభాకరరావు, జనసేన నేతలు కటకం అంకారావు, గురజాల నగర పంచాయతీ ఇన్‌చార్జి చైర్మన్ బడేజాని, సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ హుస్సేన్, గురజాల సీఐ భాస్కరరావు, ఎస్ఐలు వినోద్‌కుమార్, అనంతకృష్ణ, మున్సిపల్ కమిషనర్ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతమైన స్విమ్మింగ్ పోటీలు

**నరసరావుపేట టౌన్, జూలై 12 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్విమ్మింగ్ టీం ఎంపిక ట్రైల్స్ నిర్వహించారు. అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి, స్విమ్మింగ్ కోచ్ జి.సురేష్ పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. 17,14,12 సంవత్సరాల లోపు బాలుర, బాలికల కోసం ట్రైల్స్



పోటీలు జరిగినట్లు కార్యదర్శి సుబ్బారెడ్డి తెలియజేశారు. ఈ విభాగాలలో 28 మంది క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేశారన్నారు. 28 మందిలో 11 మంది బాలురు, ముగ్గురు బాలికలు ఎంపికైనట్లు తెలిపారు. జూలై 19,20 తేదీలలో విశాఖపట్నంలో జరగనున్న ఛాంపియన్‌షిప్‌కు పల్నాడు జిల్లా నుండి ఎంపికై ప్రాతినిధ్యం వహించనున్నట్లు కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి తెలియజేశారు.

## మాతాశ్రీ హాస్పటల్‌లో అధునాతన 3డి4కె ల్యాప్రోస్కోపిక్ యూనిట్‌ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

**నరసరావుపేట, జూలై 12 ప్రభాతవార్త :** మాతాశ్రీ హాస్పటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అధునాతన 3డి/4కె ల్యాప్రోస్కోపిక్ యూనిట్‌ను శనివారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు హాస్పటల్ ఛైర్మన్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, హాస్పటల్ డైరెక్టర్ యేలూరి సుబ్బారెడ్డి లు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. శస్త్ర చికిత్సల్లో యూనిట్ ప్రయోజనాలను తెలియజేశారు. ప్రస్తుతం వైద్య రంగంలో వస్తున్నటువంటి అనేక ఆధునిక సౌకర్యాలు, ఉపయోగాలు పల్నాడు జిల్లాకు సైతం డాక్టర్ రామచంద్రారెడ్డి వంటి యువ డాక్టర్లు అందుబాటులోకి తీసుకువస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ల్యాప్రోస్కోపి, గ్యాస్ట్రోకేర్ విభాగాలలో వారి సేవలు అభినందనీయమన్నారు. ఇటీవల కాలంలో కడుపులో నాలుగు పెన్నులను విజయవంతంగా వెలికి తీయడం జరిగిందన్నారు. గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ వంటి మహానగరాలకు మాత్రమే పరిమితమవుతూ అత్యధిక వ్యయంతో కూడిన 3డి/4కె ల్యాప్రోస్కోపిక్ యూనిట్ అందుబాటులోకి తీసుకురావడం విశేషమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాసవి అమ్మవారికి సారె సమర్పణ

**రొంపిచర్ల, జూలై 12 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రొంపిచర్లలో కొలువైయున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు శనివారం సారె సమర్పించారు. ఆలయ అధ్యక్షులు మద్ది రామచంద్రరావు, మద్ది రామ బ్రహ్మానందరావులు ఆషాడమాసం సందర్భంగా అమ్మవారికి పూలు, గాజులు, చలివిడి, గోరింటాకు అందజేశారు. అదే విధంగా ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాలతో ఊరేగింపు



చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

## ఎంపిఎం ఫార్మసీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**నరసరావుపేట, జూలై 12 ప్రభాతవార్త :** ఎంపిఎం ఫార్మసీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కళాశాల ఛైర్మన్ ఎం.ఆర్. శేషగిరిరావు పాల్గొన్నారు. డైరెక్టర్ దరువూరి శ్రావ్య కార్యక్రమాన్ని పర్య వేక్షించారు. ముఖ్యఅతిథులుగా ప్రముఖులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ మక్కెన హరిబాబులు హాజరయ్యారు. ప్రిన్సిపాల్ ప్రసాదరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఛైర్మన్ శేషగిరిరావు మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఔషధ నిపుణులుగా జీవితంలో కొత్త అధ్యయనాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలియజేశారు. ఫార్మసీ అనేది కేవలం ఒక ముక్తి మాత్రమే కాదన్నారు. ఇది ఒక సేవా రంగం అని తెలిపారు. మందుల తయారీ, వాటి ప్రభావం, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం ఫార్మసిస్ట్‌ల బాధ్యతగా తెలిపారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేయడం వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల సూచనలు ఎంతో ఉంటాయన్నారు. ఎంపిఎం కళాశాల పేరును నిలబెట్టాలని ఈ సందర్భంగా వారు కోరారు.



## మంచిచేసే వారిని ఆశీర్వదించి మీ జీవితాలు బాగుచేసుకోండి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**యడ్లపాడు, జులై 12, ప్రభాతవార్త :** మంచి చేసేవారిని కాదని, మిమ్మల్ని ముంచేవారిని నమ్మి గతంలో ప్రజలు మోసపోయారని, ఒకేమాటపై నిలిచి కూటమిప్రభుత్వాన్ని అశీర్విధించాలని మాజీ మంత్రి, స్దానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. కొండవీడు కోట ఘాట్ రోడ్డు నిర్మించింది చంద్రబాబేనని, కోటను పర్యాటకంగా అభివృద్ధిచేస్తే చిలకలూరిపేట



నియోజకవర్గానికి మంచి పేరు ప్రఖ్యాతలు వస్తాయన్నారు. నాలుగేళ్లలో కొండవీడును మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు...

**44లక్షలతో చేపట్టిన సీసీరోడ్లు..డ్రైన్ల నిర్మాణానికి శంఖుస్దాపన :** సుపరిపాలనలో తొలి అడుగు ఇంటికింటికీ తెలుగు దేశంలో భాగంగా శుక్రవారం రాత్రి అయన లింగారావుపాలెం, కోట, సంతపేట, చెంఘీస్కాన్‌పేట గ్రామాలలో పర్యటించారు. తొలుత లింగారావుపాలెంలో దాతల సహకారంతో ఏర్పాటుచేసిన మంచినీటి ప్లాంట్ ను ప్రారంభించిన అయన 13లక్షలతో చేపట్టిన సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంఖుస్దాపన చేశారు. అనంతరం కోట గ్రామంలో 8లక్షలతో, చెంఘీస్కాన్‌పేట గ్రామంలో 23లక్షల చేపట్టిన సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంఖుస్ధాపనచేసారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

**ఏప్రిల్ నుంచే 4వేల పింఛన్ అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిది :** ప్రభుత్వం త్వరలో గ్రామాల్లో ఇళ్లు లేని పేదలకు ముందుగా స్దలాలు కేటాయించి తర్వాత ఇళ్ల నిర్మాణం చేపడుతుందని, తల్లికి వందనం సాయం అర్హతకలిగిన ప్రతి తల్లికి అందుతుందని, ఎవరూ అందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, నిరుద్యోగభృతి కూడా అమల్లోకి రానుందన్నారు. అగస్ట్ 15నుంచి మహిళలు ఉచిత బస్సు ప్రయాణానికి కూడా అందించనున్నారన్నారు. కూటమిప్రభుత్వం ఏర్పడింది మే నెలలో అయినా ఏప్రిల్ నుంచే ఇచ్చిన హామీ ప్రకారం నెలకు 4వేల పింఛన్ అందించిందన్నారు.

**పవన్ వ్యాఖ్యలపై ప్రజలు అలోచన చేయాలి :** జగన్ దెబ్బకు కుదేలైన రాష్ట్రాన్ని, సర్వం కోల్పోయిన ప్రజల్ని కాపాడాలంటే చంద్రబాబుకే సాధ్యమన్న పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై ప్రజలు కూడా అలోచన చేయాలన్నారు. నియోజకవర్గంలో ముఖ్యంగా యడ్లపాడు మండలంలో రోడ్లు కూడా వేయని గొప్ప చరిత్ర మాజీ అవినీతి మంత్రిదని అసహనం వ్యక్తంచేశారు. రోడ్ల నిర్మాణంలో అలసత్వాన్ని సహించేది లేదని, అధికారులు కాంట్రాక్టర్లు సకాలంలో పనులు పూర్తిచేయకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతానని అన్నారు. కార్యక్రమంలో నెల్లూరి సదాశివరావు, కామినేని సాయిబాబు, మద్దూరి శ్రీనివాసరెడ్డి, కందిమల్ల రఘురామరావు, పోపూరి వెంకయ్య, తోకల రాజేష్, సిలార్, దుర్గారావు, సుధీర్, ఏనాదుల భాస్కర్, అందజనేయులు, మాణిక్యారావు, హాఫీజ్, అజర్, నూర్ పాల్గొన్నారు.

## 20వ వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

**చిలకలూరిపేటటౌన్, జులై 12, ప్రభాతవార్త:** పట్టణంలోని 20వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ చైర్మన్ అయిన షేక్ రఫాని శనివారం వార్డు పరిధిలోని అన్ని వీధులలో పర్యటించి వార్డు ప్రజలను అడిగి తమ సమస్యలను తెలుసుకున్నారు. ఆదివారం 20వ వార్డులో మాజీ



మంత్రి, స్దానిక శాసనసభ్యులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొననున్నారని, ఆ సందర్భంగా కూడా వార్డులో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని వార్డు ప్రజలకు మున్సిపల్ చైర్మన్ రఫాని కోరారు.

## నేడు పట్టణంలో విద్యుత్తు సరఫరా నిలిపివేసే ప్రాంతాలు


**చిలకలూరిపేటటౌన్, జులై 12, ప్రభాతవార్త:** పురుషోత్తమపట్నం సబ్‌స్టేషన్ పరిధిలోగల వీధులు, కాలనీలలో విద్యుత్ లైన్ల మరమ్మత్తులు, విద్యుత్ తీగలకు అడ్డుగా వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. ఈ కారణంగా టౌన్2 పరిధిలోని సుగాలీ కాలని, భావనారుషినగర్, పండరీపురం 8,9 వీధులలో ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్‌శాఖ డిఈఈ ఆర్ అశోక్‌కుమార్ శనివారం తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించ వలసినదిగా ఆయన కోరారు.

## అబ్దుల్ కలాం ఫౌండేషన్ కర్లపాలెం ద్వారా ప్రతి శుక్రవారం సేవలు

**కర్లపాలెం, జులై12, ప్రభాతవార్త:** అబ్దుల్ కలాం ఫౌండేషన్ కర్లపాలెం ద్వారా ప్రతి శుక్రవారం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఫౌండేషన్ ప్రెసిడెంట్ ,గ్రామ ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ బాష తెలిపారు.కర్లపాలెం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్లపాలెం ఇందిరానగర్ లోని ఒక నిరు పేద కుటుంబం కు 10 కేజీలు బియ్యం అందజేశారు.ఈ సందర్భంగా పఠాన్ అహ్మద్ బాష మాట్లాడుతూ పేదలకు ప్రతి శుక్రవారం బియ్యం ,నిత్యావసర సరుకులు ,దుప్పట్లు ,అనారోగ్యంగాఉన్న వారికి ఆర్థిక చేయూత అందించడం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పఠాన్ కరిముల్లా, షేక్ ఇబ్రహీం, షేక్ జిలాని, షేక్ నాగురా తదితరులు పాల్గొన్నారు

## అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదు

**విట్లవానిపాలెం, జులై 12, ప్రభాతవార్త:** అసాంఘిక కార్యాక్రమాలకు పాల్పడిన, చట్టవ్యతిరేక కార్యాక్రమాలు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని చందోలు ఎస్ఐ ఎం వెంకట శివకుమార్‌అన్నారు.మండలపరిధిలోని ఖాజీ పాలెం గ్రామమంనందు పల్లె నిద్ర కార్యక్రమం లో భాగంగా శుక్రవారం ఎస్ ఐ ఎం వెంకట శివకుమార్



పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఖాజీపాలెం గ్రామంలో శాంతియుత వాతావరణం వున్నదని కొనియాడారు.గ్రామంలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని తెలియచేసారు. గ్రామసమస్యలు ఏమైనావుంటే తెలియచేయాలనీ వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు .గ్రామాలలో రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహిస్తు న్నామని, గ్రామస్తులు అందరు సహృదయంతో కలసిమెలసి జీవించాలని ఈ సందర్భంగా అయన తెలియచేసారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు, గ్రామనాయకులు పాల్గొన్నారు.

## అమియో ఫ్రెష్ న్యూట్రి బ్లెండర్ తో హెల్తీచాయిసెస్ మేడ్ ఈజీ

**విజయవాడ, జూలై 12, ప్రభాతవార్త :** ఆహార తయారీరంగంలోకి తాము రూపొందించిన అమియో ఫ్రెష్ న్యూట్రిబ్లెండర్ తో ఆరోగ్యకరమైన జీవనశైలిని సులభతరం చేస్తుందని క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లి. పిఎల్ హెడ్ కేతన్ చౌదరి తెలిపారు. 400 వాట్ల మోటార్తో సొగసైన బ్లెండర్ తక్కువ సమయంలో గరిష్ట ఫలితాలందిస్తూ సౌలభ్యం, సామర్థ్యంలను మిళితం చేస్తు అందిస్తున్నామన్నారు.

## ఇంటి నివేశ స్థలం మంజూరుకై సచివాలయంలో ఆన్‌లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకోవాలి



**యడ్లపాడు, జులై 12, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం వారిచే హౌసింగ్ ఫర్ అల్ స్కీమ్‌లో బాగంగా ఇంటి నివేశ స్దలం లేని నిరుపేదలందరూ కూడా మీ గ్రామ సచివాలయం ద్వారా ఇంటినివేశన స్దలము మంజూరుకై అర్జీని దాఖలు పరచుకోవాల్సిందిగా తహశీల్దార్ విజయశ్రీ తెలిపారు. ప్రతి లబ్దిదారుడు అర్జీతోపాటు కుటుంబమునకు జారీకాబడిన రేషన్ కార్డు, కుటుంబ సభ్యులందరి అధార్ కార్డులు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలను జతపరచాలని, కావున లబ్దిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలన్నారు.

## బైక్ దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

**యడ్లపాడు, జులై 12, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బోయపాలెం గ్రామస్దులు బైక్ దొంగతనం చేస్తున్న యువకుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన శుక్రవారం రాత్రి సమయంలో చోటుచేసు కుంది. సంఘటనకు సంబంధించి బోయపాలెం రామాలయం వీధిలో అర్ధరాత్రి సమయంలో కుక్కలు విపరీతంగా అరువటం గమనించి బయటకు వచ్చి చూసేసరికి యువకుడు బైక్ దొంగిలించేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నాడని, గ్రామస్తులు బయటకు రావటం గమనించి పారిపోతుండగా అతనిని వెంబడించి పట్టుకొని పోలీసులకు అప్పగించటం జరిగిందన్నారు. ఇదే వీధిలో గతంలో మూడు బైక్‌ల వరకు దొంగలు దొంగిలించారని వారు తెలుపుతున్నారు. గ్రామస్దులు పట్టుకొచ్చిన యువకుడిని విచారిస్తున్నట్లు పోలీసులు తెలుపుతున్నారు.

## ప్రత్తిపాటిని సత్కరించిన మునిసిపల్ ఉద్యోగులు

**చిలకలూరిపేట, జులై12, ప్రభాతవార్త:** చిలకలూరిపేట మున్సిపాలిటీలో గతంలో జరిగిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కుంభకోణం కేసులో



సస్పెండ్ అయిన కొందరు మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు సస్పెండ్ రద్దవడంతో తిరిగి విధులలో చేరారు. ఈ మేరకు పురపాలకశాఖ ఉన్నతాధికారులు వారి సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ విషయంలో తమకు పూర్తి సహయ సహకారాలు అందించిన మాజీమంత్రి, స్దానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావును శనివారం వారి నివాసంలో మున్సిపల్ ఉద్యోగులు కలసి సత్కరించి కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యను ప్రత్తిపాటి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేసిన బేరింగ్ మౌలాలిని కూడా ఉద్యోగులు, స్వయంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి శాలువా కప్పి సత్కరించారు.

## తెదేపా నాయకుడు కె చినబాబు ఆదరణ కూడికలో పాల్గొని నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, జులై12, ప్రభాతవార్త:** పట్టణంలోని 12వ వార్డుకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు కొప్పుల చినబాబు ఇటీవల మృతి



చెందారు. కాగా ఆయన ఆదరణ కూడికను శనివారం తూర్పుమాలపల్లిలోని వారి నివాసంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు ప్రత్తిపాటి పాల్గొని చినబాబు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ప్రత్తిపాటితో పార్టీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, షేక్ అజారుద్దిన్, మద్దుమాల రవి, కందుల వెంకటరమణ, ముల్లా కరిముల్లా, తోట బ్రహ్మస్వాములు, పిల్లి కోటి తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## అసిస్ట్ ఆధ్వర్యంలో రాజుపాలెం గ్రామంలో ఏర్పాటుచేసిన ఫిల్టర్ ప్లాంట్‌ను ప్రారంభించిన డైరక్టర్ జాష్టి రంగారావు


**చిలకలూరిపేట, జులై12, ప్రభాతవార్త:** ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్ద అసిస్ట్ ఆధ్వర్యంలో మార్టూరు మండలం రాజుపాలెం గ్రామంలో మంచినీటి చెరువు



పునరుద్దరణ, శాండ్ వాటర్ ఫిల్టర్‌పాయింట్ ప్లాంటును శనివారం అసిస్ట్ డైరక్టర్ జాష్టి రంగారావు ప్రారంభించారు. గ్రామానికి చెందిన జాష్టి శ్రీనివాసులు రూ 18లక్షలు ఆర్థిక సహాయాన్ని ఈ ప్రాజెక్ట్‌కు అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పెద్దలు జాష్టి శ్రీనివాసులు, జె శంకరయ్య, కృష్ణ మూర్తి, లక్ష్మీనారాయణ, అసిస్ట్ సంస్ద అసోసియేట్ డైరక్టర్లు విష్ణుప్రియ, ఎమ్మెస్ఆర్‌సి మూర్తి, డిప్యూటి డైరక్టర్ రవిబాబు, గ్రామస్దులు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా అసిస్ట్ మేలుకొలుపు సంస్కృతిక బృందం పలు సాంస్కృతిక కార్యక్రమాల ను నిర్వహించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాజుపాలెం గ్రామ ప్రజలకు శుద్దిచేసిన మంచినీరు అందుబాటులోకి వచ్చాయి.

## పండరీపురం రోటరిక్లబ్ ఆధ్వర్యంలో గర్బిణీ స్త్రీలకు శ్రీమంతం వేడుకలు

**చిలకలూరిపేట, జులై12, ప్రభాతవార్త:** పండరీపురం రోటరిక్లబ్ ఆధ్వర్యంలో మాతా శిశుసంక్షేమం కార్యక్రమంలో బాగంగా నిరుపేద గర్బిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా రోటరి 3150 రోటరి జిల్లా గవర్నర్ డాక్టర్ ఎస్‌వి రాంప్రసాద్ పాల్గొన్నారు. అతిధిగా పాల్గొన్న ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ లావు సుష్మ పాల్గొని గర్బిణీ స్త్రీలకు సలహలు, సూచనలు అందచేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు బోనం వెంకటేశ్వరరావు, కార్యదర్శి దోరడ్ల మనోజ్‌కుమార్, డైరక్టర్లు లంకా ఆదినారాయణరెడ్డి, అలంగార్ మోహన్, బిట్రా నాగేశ్వరరావు, బి చెంచు పున్నయ్య, ఆలా దాసునాయన, కాకుమాను సింగారావు, కెఎస్ఆర్‌ఎసి రాజు, రంగనాయక్, భాస్కరరెడ్డి, దివ్వెల సుబ్రహ్మణ్యం, పూసల మణిప్రసాద్, అసిస్టెంట్ గవర్నర్ రాఘవయ్య, పాల్గొన్నారు.



## చిలకలూరిపేట రోటరిక్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలోని గర్బిణీ స్త్రీలకు పౌష్టికాహారం పంపిణీ

**చిలకలూరిపేట, జులై12, ప్రభాతవార్త:** చిలకలూరిపేట రోటరిక్లబ్ ఆధ్వర్యంలో శనివారం మాతాశిశుసంక్షేమం కార్యక్రమం క్రింద 40మంది బాలింతలకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఉప్పుటూరి ప్రసాద్, కార్యదర్శి బోడి రామ సుబ్బారావు, డైరక్టర్లు గళ్లా సాంబశివరావు, గుడిపల్లి సాంబశివరావు, కోట్లు, పానకాల రాంబాబు, మారెళ్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



# సొసైటీ ఛైర్మన్ నరసయ్యను సత్కరించిన జిల్లా నాయకులు

**రాజుపాలెం, జూలై 12 ప్రభాతవార్త :** మండల పరిధిలోని అనుపాలెం గ్రామ సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జనసేన పార్టీ మండల అధ్యక్షులు తోట నరసయ్యను ఆదివారం జిల్లా నాయకులు గాదె వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బోనబోయిన శ్రీనివాస్ యాదవ్‌లు



శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం మండల పరిధిలోని దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఛైర్మన్ గరికపాటి శంకరరావు తన ఆశ్రమంలో నరసయ్యకు శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా తోట నరసయ్య మాట్లాడుతూ రైతులకు ఎంతగానో ఉపయోగపడే సొసైటీని అభివృద్ధి చేస్తానని, తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, రాజుపాలెం మండల ఉపాధ్యక్షులు బత్తుల హనుమంతరావు, మండల కార్యదర్శి పసుపులేటి వెంకటేశ్వర్లు, రుసుం వెంకటేశ్వర్లు, సొసైటీ అసిస్టెంట్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అనసూయమ్మకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

**గురజాల, జూలై 12 ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శనివారం ఇటీవల అనారోగ్యంతో మరణించిన బిగ్ టివి బ్యూరో చీఫ్, ఏపీ ఎలక్ట్రానిక్



మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు యేచూరి శివ మాత్ర్మూర్తి అనసూయమ్మ వైకుంఠ సమారాధన జరిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరై అనసూయమ్మ చిత్రపటంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధరరెడ్డి, సీనియర్ నేత కొమ్మినేని వెంకటేశ్వర్లు, జిల్లా నేతలు గాంధీ, పోలు వీరారెడ్డి, మండల అధ్యక్షుడు కొమ్మినేని బుజ్జి, పట్టణ అధ్యక్షుడు అన్నారావు, కర్రా కోటేశ్వరరావు, మస్తాన్ ప్రసాద్, నాసర్‌వలి, పోలా సతీష్, ఐజేయూ జాతీయ కార్యదర్శి డి సోమసుందర్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచర్ల జయరాజు, జాతీయ నేతలు చందు జనార్దన్, విజయవాడ అర్బన్ యూనియన్ అధ్యక్షుడు చావా రవి, జిల్లా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి భువన్, నాగరాజు, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు రమణ, ఉమ్మడి గుంటూరు, కృష్ణ, ప్రకాశం జిల్లా యూనియన్ నేతలు పాల్గొన్నారు.

# దివ్వెల సేవలు నిరుపమానం

**సత్తెనపల్లి, జూలై 12 ప్రభాతవార్త :** సమాజంలో దివ్వెల సేవలు నిరుపమానమని లోక్ జనశక్తి పార్టీ జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ విజయకుమార్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో దివ్వెల శ్రీనివాసరావు, చల్లా రత్తయ్యలను ఘనంగా సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ భరతమాత అన్నప్రసాద వితరణ పథకం ద్వారా 715 రోజులు



దాతల సహకారంతో నిర్విరామంగా అన్నసంతర్పణ చేయడం గొప్ప విషయమన్నారు. ఇటువంటివారిని ఆదర్శంగా తీసుకోవాలని విజయ్‌కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహంకాళి వెంకట్రావు, కారుమంచి గంగారావు, న్యాయవాదులు కిషోర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ డెలిగేట్‌గా న్యాయవాది వేణుగోపాల్

**సత్తెనపల్లి, జూలై 12 ప్రభాతవార్త :** నేపాల్ రాజధాని కాట్మండ్‌లో జూలై 18 నుండి 21వ తేదీ వరకు జరగనున్న 19వ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ డెమో క్రటిక్ లాయర్స్ సెమినారుకు భారతదేశ న్యాయవాద బృందంలో సత్తెనపల్లి పట్టణానికి చెందిన న్యాయవాది వేణుగోపాల్ మెంబర్‌గా ఎంపికయ్యారు. ఆయన పర్యటన విజయవంతం కావాలని ప్రముఖులు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన

**సత్తెనపల్లి, జూలై 12 ప్రభాతవార్త :** మత్తు పదార్థాలు ప్రాణాంతకమని విద్యార్థులకు తెలియజేస్తూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు కృష్ణవేణి కళాశాలలో శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సులో ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం వలన కలిగే అనర్థాలను తెలియజేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా



ఉండాలన్నారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వలన రక్తపోటు, వందత్వం, అలసర్లు వంటివి వస్తాయన్నారు. ఉద్రేకాలు అదుపుతప్పి కోపం, చిరాకు, ఏకాగ్రత లోపించడం, మతిమరుపు వంటి వాటికి గురవుతారని తెలియజేశారు. డ్రగ్స్ వంటి కేసుల్లో 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సి.ఐ. విజయ్‌కుమార్, ఎస్.ఐ. నాగలక్ష్మి, కానిస్టేబుల్స్ ఖాజా, ఆనంద్, శివ పాల్గొన్నారు.

# పరివర్తన ఆశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేత

**సత్తెనపల్లి, జూలై 12 ప్రభాతవార్త :** పట్టణంలోని పరివర్తన చెవిటి, మూగ, మానసిక వికలాంగుల ఆశ్రమానికి ఖమ్మం జిల్లాకు చెందిన షేడెడ్ విజన్ సంస్థ శనివారం మూడు నెలలకు సరిపడ నిత్యావసర వస్తువులు అందజేసింది. బ్యాగులు, సీలింగ్ ఫ్యాన్లు, టిఫిన్ బాక్స్‌లు, గీజర్, మిక్సీలు, బట్టలు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పిస్సమరాజు కిరణ్, నారాయణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులను ఆదుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. షేడెడ్ విజన్ సంస్థను అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాఘవరెడ్డి, రవీంద్ర, రాజేష్, వీరాంజనేయరెడ్డి, కిషోర్‌బాబు, మేరీ, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

# సంయుక్త సహకారంతో పాఠశాల భవనాన్ని చారిత్రాత్మక భవనంగా పునరుద్ధరిద్దాం : కరణం రాజా (అమెరికా)

**పెదనందిపాడు జూలై 12 (ప్రభాతవార్త)** 105 సంవత్సరాల క్రితమే పెదనందిపాడు పాత మద్రాస్ రోడ్డు పక్కన సుమారు 20 ఎకరాల పైగా భూమిని సేకరించి అనాటి ప్రముఖుల సహకారంతో పాఠశాలను నిర్మించి .ఈ ప్రాంత విద్యార్థుల



వేలామందికి ఉన్నత స్థాయికి ఎదగటానికి కారకులైన తన తాత ,స్వర్గీయ కరణం చిన్నయ్య (కృషిపాదు) ఆశయాలా సాధనకు కృషి చేస్తున్న నేటి. అప్పా జడ్పీహెచ్ఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల కు తన పూర్తి సహాయ సహకారాలు అందజేస్తానని కరణం రాజా.( అధ్యక్షులు ఇమ్మక్యూ లాటా ఎన్ ఏ ఫౌండేషన్(యూఎస్ఏ) అన్నారు. కరణం రాజా సుమారు ఐదు దశాబ్దాలు పైగా అమెరికాలో ఉంటున్నారు జీవిఎల తన స్వగ్రామమైన కృషిపాదు వచ్చిన సందర్భంగా. గ్రామ అభివృద్ధికి ఎన్నో నిధులు సమకూర్చి గ్రామస్థుల అభిమానానికి పాత్రులు అయినారు. ఈ నేపథ్యంలో శనివారం పెదనందిపాడు పాఠశాల అప్పా జడ్పీహెచ్ ఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కరణం రాజాను పెదనందిపాడు జడ్పీ పాఠశాలకు ఆహ్వానించి వారి తాత కరణం చిన్నయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అసోసియేషన్ కోశాధికారి చెన్నుపాటి కోదండరామయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో తమ అసోసియేషన్ పోషకులు కరణం రాజాను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కరణం రాజా మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం తీసుకొని ముందుకు పోవాల్సిందిగా అసోసియేషన్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణయ్య. సెక్రెటరీ కొండ్రుపల్లి అప్పారావు. జాయింట్ సెక్రెటరీ కొత్త శ్రీధర్. దాసరి శేషగిరిరావు. నర్రా బాలకృష్ణ. బండి నాగేశ్వరరావు. సభ్యులు జవహర్ రాజీ. గేరా మోహన్ రావు. కొల్లా సీతారామయ్య. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి శ్రీనివాసరావు. తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పాఠశాలల్లో పూర్వ విద్యార్థి అమెరికా నివాసి నూతి బాపయ్య చౌదరి. విద్యార్థుల సౌకర్యం కోసం నిర్మిస్తున్న భోజనశాలను వారు పరిశీలించారు. కరణం చిన్నయ్య పాఠశాలకు నిర్మించిన భవనాన్ని చారిత్రాత్మక కట్టడం లా ఉండే విధంగా పునర్మించేందుకు తన సహకారం అందజేస్తానన్నారు.

# పోలింగ్ బూత్‌లను పరిశీలించిన తహశీల్దారు

**మాచర్ల, జూలై 12 ప్రభాతవార్త:** జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు మాచర్ల మండలంలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించినట్లు మాచర్ల తహశీల్దారు బి.కిరణ్‌కుమార్ తెలిపారు. పోలింగ్ బూత్‌ల బీఎల్‌వోలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ బూత్‌లలోని వసతులు, సౌకర్యాలు పరిశీలించారు. తాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు, ర్యాంప్‌లు మొదలగు వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు.



# పదవులకే వన్నె తెచ్చిన వ్యక్తి తాడిశెట్టి వెంకట్రావు

**గుంటూరు తూర్పు, జూలై 12 (ప్రభాతవార్త) :** తాను చేసిన పదవులకే వన్నె తెచ్చిన వ్యక్తి తాడిశెట్టి వెంకట్రావు అని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఖాజావలి అన్నారు. మాజీ శాసన సభ్యులు తాడిశెట్టి వెంకట్రావు 59వ జన్మదిన వేడుకలు మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీ నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఖాజావలి మాట్లాడుతూ రాజకీయాలలో కష్టపడి ఉన్నత స్థానానికి వెళ్ళిన వ్యక్తి తాడిశెట్టి వెంకట్రావు అని కొనియాడారు. ఎస్ఎన్‌యుఐ నగర అధ్యక్షులుగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన వెంకట్రావు కష్టపడి అంచెలంచెలుగా ఎదిగారని ఆయన అన్నారు. ఎస్ఎన్‌యుఐ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పనిచేసే సమయంలో విద్యార్థి సమస్యలపై



రాజీలేని పోరాటాన్ని చేశారని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టి అప్పటి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపరిచి అనేక పోరాటాలు చేశారని అన్నారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా వెంకట్రావు పనితీరుకు జాతీయ స్థాయిలోనే ప్రత్యేకమైన గుర్తింపు వచ్చిందని అందువల్లేనే 2004లో అధిష్టానం గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుండి పోటీచేసే అవకాశాన్ని వెంకట్రావుకి ఇచ్చారని ప్రజాబలాన్ని నమ్ముకున్న వెంకట్రావు న్నికలలో విజయం సాధించారని తెలిపారు. శాసన సభ్యుడిగా పేద, బడుగు వర్గాల సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి పనిచేసి వారి హృదయాలలో స్థానాన్ని పొందారని ఖాజావలి అన్నారు. పేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార విషయంలో వెంకట్రావు పలుమార్లు ఉన్నతాధికారులతో విభేదించి పేద ప్రజల పక్షాన నిలబడి ఆ సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేశారని అందువల్లనే నేటికీ గుంటూరు ప్రజలు వెంకట్రావును అభిమానిస్తున్నారని ఆయన అన్నారు. జన్మదినాన్ని పురస్కరించుకుని అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకును తాడిశెట్టి మురళికట్ చేశారు. ఈ సందర్భంగా నగరంలో అనేక ప్రాంతాలలో వెంకట్రావు అభిమానులు అన్నదానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలోనూ రాధాకృష్ణమూర్తి, ఆదప కాశీ విశ్వనాథం, అన్నం సాయిరాం, చింతా సుబ్బారావు, సాంబారును వాసు, ఇంకొల్లు ఈశ్వరరావు, పదన కోటేశ్వరరావు, జిల్లా మహేష్‌బాబు అభిమాన సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, కిషోర్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# గణపవరం సెక్షన్ పరిధిలోని 14 గ్రామాలలో విద్యుత్తు అధికారుల దాడులు

## రూ1,85,600 అపరాధ రుసుం వసూలు


**నాదెండ్ల, జులై12,ప్రభాతవార్త:** మండలంలోని గణపవరం సెక్షన్ పరిధిలోని 14 గ్రామాలలో సిఆర్‌డిఏ సర్కిల్, విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజనీర్ యం శ్రీనివాసరావు నేతృత్వంలో గుంటూరు టౌన్2 ఈఈ వై ఎడుకొండలు, డిపిఈ, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 29 బృందాలుగా ఆయా గ్రామాలలో



దాడులు నిర్వహించి అనధికారికంగా అధికలోడు విద్యుత్ వినియోగం చేసుకుంటున్న 58 సర్వీసులను గుర్తించి వారికి రూ 1,85,600 అపరాధ రుసుం కింద జరిమానా విధించడం జరిగింది. అనంతరం ఎడిఈ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో విద్యుత్‌శాఖ అధికారులు మాట్లాడుతూవిద్యుత్ చౌర్యం అనేది సామాజిక నేరంకింద పరిగణించబడుతుందని, దానికి జైలుశిక్ష కూడా ఉంటుందని, రాబోయే రోజులలో ఉన్నతాధికారుల ఆదేశాలతో అనధికార విద్యుత్ వినియోగం చేసేనట్లయితే కేసులుకూడా నమోదు చేస్తామని, తరచుగా దాడులు నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈలు ఎ గురునాథరావు, ఎన్ మల్లిఖార్జునప్రసాద్, కె రవికుమార్, మరియు 11మంది ఎఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నట్లు చిలకలూరిపేట డిఈఈ ఆర్ అశోక్‌కుమార్, గణపవరం ఎఈ డి వీరేంద్రకుమార్‌లు తెలిపారు.

# కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్‌లకు నియామకపత్రాలు అందజేసిన ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, జూలై 12 ప్రభాతవార్త :** కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్‌లకు శనివారం నియామకపత్రాలను ఎమ్మెల్యే డాక్టర్



చదలవాడ అరవిందబాబు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని కోఆపరేటివ్ సొసైటీలకు సంబంధించి కొత్తగా నియమితులైన ఛైర్మన్‌లకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. లింగంగుంట్ల కోఆపరేటివ్ సొసైటీకి సంబంధించి ఛైర్మన్‌గా కన్నెదార రాజా, మెంబర్లుగా ఎస్.జి.బాషా, సుద్దపల్లి నవీన్ నియమితులైనట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలియజేశారు. అదే విధంగా జొన్నలగడ్డ కోఆపరేటివ్ సొసైటీకి ఛైర్మన్‌గా యర్రం రాంబాబు, ఇక్కుర్రు కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్‌గా కొల్లి వెంకటేశ్వర్లు, విప్పర్ల కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్‌గా జెల్లిపల్లి శేషమ్మ, సంతగుడిపాడు కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్‌గా పొనుగోటి శ్రీనివాసరావు, బుచ్చిపాపన్నపాలెం కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్‌గా సూరాబత్తుల రామారావు, రొంపిచర్ల కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్‌గా పల్లెల వెంకటరత్నారెడ్డి, అన్నవరం కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్‌గా కుందేటి రామబ్రహ్మం, సుబ్బయ్యపాలెం కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్‌గా ఇంటూరి వెంకటప్రసాద్ నియమితులైనట్లు తెలియజేశారు.

**పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ...**

నియోజకవర్గంలో శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు శనివారం పట్టణంలోని 3వ వార్డులో పర్యటించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. డ్రైన్లలో పూడికను తొలగించారు. స్థానికులు పలకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు వెంట ఉన్నారు.

# సుబ్బరాయశ్రేష్టి సేవలు సమాజానికి ఆదర్శనీయం : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

**నరసరావుపేట, జూలై 12 ప్రభాతవార్త :** ఎస్ఎస్ఎన్ కళాశాల వ్యవస్థాపక సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు



సుబ్బరాయశ్రేష్టి అందించిన సేవలు సమాజానికి ఆదర్శనీయమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం సుబ్బరాయశ్రేష్టి 68వ వర్ధంతి కార్యక్రమాన్ని కళాశాల ఆవరణలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని సుబ్బరాయశ్రేష్టి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో విద్యావ్యాప్తికి విశేషమైన కృషి చేశారని గుర్తు చేశారు. అదే విధంగా 1950లో స్థాపించిన కళాశాల నేలాది మందికి విద్యాదానం చేసిందన్నారు. తాను కూడా కళాశాలలో చదువుకున్నానని, పేద విద్యార్థులకు ఎస్ఎస్ఎన్ కళాశాల దేవాలయం అన్నారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, కళాశాల అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్‌లు మాట్లాడుతూ తాము పెద్దలు చూపిన మార్గంలో కళాశాలను ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. వారి స్ఫూర్తి తమకు ఎల్లప్పుడూ ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. కళాశాలలో చదువుకొని ఉన్నత స్థానాలలో నిలిచిన ప్రతి ఒక్కరూ సుబ్బరాయశ్రేష్టికి రుణపడి ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్ ఎం.ఎస్.సుధీర్, కమిటీ సభ్యులు బత్తుల మురళీ, బొలిశెట్టి రామ్మోహన్‌రావు, లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాససాయి తదితరులు పాల్గొన్నారు.

# దాతల సహాయంతో 300 మందికి అన్నదానం

**కారంపూడి, జూలై 12 ప్రభాతవార్త:** కారంపూడి పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్లోని ప్రసన్నాంజ నేయస్వామి ఆలయం వద్ద దాతల సహకారంతో 300 మందికి అన్నదానం చేసినట్లు శ్రీవాసవీ సేవ అన్న ప్రసాద కమిటీ తెలిపింది. దాతలు పయ్యావుల



పేరమ్మ- సుబ్బారావు కుటుంబ సభ్యుల సహకారంతో 150 మందికి, ఒప్పిచర్లకు చెందిన ఇల్లూరి వుల్లయ్య- ఆదిలక్ష్మి, పెదకొదమగుండ్లకు చెందిన గుండా కోటేశ్వరరావు- విజయలక్ష్మి, కోటా పాపారావు (కారంపూడి ఆఫీసు)- విజయలక్ష్మిల సహకారంతో మరో 150 మందికి అన్నదానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్నప్రసాద కమిటీ ఫౌండర్ భవిరిశెట్టి రామారావు, మహిళా కమిటీ సభ్యులు చిన్ని లక్ష్మి, మాడిశెట్టి పుష్పలత, పల్లా పద్మ, కొల్లివర వెంకటలక్ష్మీకుమారి, గుండా మహేశ్వరి, యకల రమాదేవి, సూరే ధనలక్ష్మి, ఆతుకూరి అంజలి, ఊటుకూరి వాణి, చింతా రేణుక, ఊటుకూరి వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి స్థలాలకు దరఖాస్తు చేసుకోండి : తహశీల్దార్ నిర్మలా

**రొంపిచర్ల, జూలై 12 ప్రభాతవార్త :** మండలంలోని నిరుపేదలు సొంత గృహం, ఇంటి స్థలానికి దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ నిర్మలా శనివారం కోరారు. ఇంతవరకు ఇంటి స్థలం పొందనటువంటి నిరుపేదలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో 3



సెంట్లు, పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు ఇంటి స్థలం కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రొంపిచర్ల మండల పరిధిలో అర్హులను సమీప గ్రామ సచివాలయాలలో అందజేయాలన్నారు. అర్హతో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటర్ ఐడి, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు జత చేసుకోవాలని తహశీల్దార్ నిర్మలా సూచించారు.

# ముస్లిం మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా షేక్ మౌలాలి


**పొన్నూరు, జూలై 12,ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొన్నూరు రూరల్ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడిగా షేక్ మౌలాలిని నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. మండల పరిధిలోని ఆలూరు గ్రామానికి చెందిన మౌలాలి పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ పార్టీ అభివృద్ధికి సేవలందిస్తున్నారు. దీన్ని గుర్తించిన అధిష్టానం మౌలాలిని నియమించింది. వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మౌలాలి నియామకాన్ని ధృవీకరించారు. ఈ సందర్భంగా మౌలాలి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ముస్లిం మైనార్టీ రూరల్ అధ్యక్షుడిగా నియమించడం సంతోషంగా ఉందని పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణకు పలువురు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మౌలాలి నియామకం పట్ల నాయకులు షేక్ మామూ, చాన్‌బాషా, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.



# సిఎంఆర్ఎఫ్ పేదల సంజీవని

-అనారోగ్యానికి ఏ ఒక్కరూ భయపడొద్దు --రూ.2లక్షలు విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత -ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

**గుంటూరు తూర్పు, జూలై 12 (ప్రభాతవార్త) :** సీఎం రిలీఫ్ ఫండ్ పేదల సంజీవని అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. శనివారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే



వారి కార్యాలయంలో ముగ్గురికి రూ.2లక్షలు విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే నసీర్ చేతుల మీదుగా అందజేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఊడా కార్తీక్ కుమార్‌రెడ్డి, ఏసుగుంట సుబ్బులు, పడాల మురళి అనారోగ్యానికి గురి కావడంతో ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్ళి చికిత్స తీసుకున్నారు. వైద్యానికి సంబంధించి అప్పులు కావడంతో తమను ఆదుకోవాలని ఎమ్మెల్యే నసీర్‌ను సంప్రదించారు. వారి ఆర్థిక పరిస్థితులు పరిశీలించిన ఎమ్మెల్యే నసీర్ వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. అనంతరం ఐదా కార్తీక్‌కుమార్‌రెడ్డికి రూ.57,786, ఏసుగుంట సుబ్బులుకు రూ.75,300, పడాల మురళికి రూ.70వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు చేయించారు. ఈ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే వారి కార్యాలయంలో లబ్ధిదారులకు నసీర్ అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.3కోట్ల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశామని తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ప్రజలకు తాము ఎల్లప్పుడూ అండగా నిలబడతామని ఆయన హామీ ఇచ్చారు.

# చేబ్రోలు యూత్ విభాగం అధ్యక్షుడిగా అల్లం వెంకట రామయ్య

**పొన్నూరు, జూలై 12,ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేబ్రోలు మండల యూత్ అధ్యక్షుడిగా అల్లం వెంకటరామయ్యను నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంలో భాగంగా అన్ని విభాగాల అధ్యక్షులను, సభ్యులను నియమిస్తుంది. అందులో భాగంగా చేబ్రోలు యూత్ విభాగం అధ్యక్షుడిగా అల్లం వెంకట రామయ్యను నియమించింది. అల్లం వెంకట రామయ్య పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తుండడంతో పార్టీ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకొంది. అందుకు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మద్దతు తెలిపారు. నూతనంగా నియామకమైన అల్లం వెంకటరామయ్య మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో అమలు చేసేందుకు కృషి చేస్తానన్నారు. 2029లో మళ్ళీ వైఎస్ జగన్మోహనరెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు శ్రమించని లేకుండా పార్టీని బలోపేతం చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా నియామకానికి కృషి చేసిన సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అల్లం నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.



# గ్రామాభివృద్ధి తెదేపాతోనే సాధ్యం : వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ మాదల

**పొన్నూరు, జూలై 12,ప్రభాతవార్త:** గ్రామాభివృద్ధి టిడిపితోనే సాధ్యమని వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ మాదల



వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని మామిడాల గ్రామంలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి తిరుగుతూ ఆయా గృహాలకు చేకూరిన లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు కొంతమంది తమ గ్రామంలో కాలువలు లేక మురుగు రోడ్లపై ప్రవహిస్తుందని, రోడ్లు సక్రమంగా లేకపోవడంతో ప్రయాణించడం ఇబ్బంది ఉందని నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. నాయకులు సమస్యలను ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొర్రు రామారావు, చలమశెట్టి సీతారామయ్య, బత్తుల బ్రహ్మయ్య, రవిచంద్ర, కొండేపి గోపి, కృష్ణ, మిణుగుల రాధాకృష్ణ, దానియేలు, తదితరులు పాల్గొన్నారు.



# కర్నాటక సంగీత ప్రపంచంలో మహోన్నతుడు బాలమురళీకృష్ణ

**గుంటూరు కల్చరల్, జూలై 12,ప్రభాతవార్త :** కర్నాటక సంగీత ప్రపంచంలో మహోన్నతుడు,మధురగాన సరస్వతి,అపర త్యాగరాజు డాక్టర్ బాలమురళీకృష్ణ సంగీతమే తన జీవితంగా జీవనయాత్ర కొనసాగించిన సంగీత ద్రష్ట అని అవధానం మనమూ పాడదాం రండి బృంద సభ్యులు నివాళులర్పించారు.అవధానం సంస్థ కార్యాలయంలో ప్రముఖ సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతి కార్యక్రమం జరిగింది.కార్యక్రమంలో విద్యావేత్త,గాయకుడు ఏ.పోతురాజు మాట్లాడుతూ సుమారు 8దశాబ్దాల పాటు సంగీత ప్రపంచంలో తనదైన శైలిలో రసజ్ఞులను ఉర్రూతలూగించిన విశిష్ట వాగ్గేయకారుడు మంగళంపల్లి అన్నారు.సంగీత విద్వాంసురాలు యర్రగడ్డ లక్ష్మీ మాట్లాడుతూ డాక్టర్ బాలమురళీకృష్ణ గొప్ప గాయకుడు,వాద్యకారుడు,నటుడు,స్వరకర్త,సాహితీవేత్త,పద్మశ్రీ,పద్మవిభూషణ్,పద్మభూషణ్ లాంటి అనేక పురస్కారాలు పొందారన్నారు.కార్యక్రమంలో సంగీత విద్యాంసులు మల్లేశ్వరరావు,గాయని రాజ్యలక్ష్మి,రాధిక తదితరులు ప్రసంగించారు.

# 18న 'కొత్తపల్లిలో ఒకప్పుడు'

రానా దగ్గుబాటి


స్పిరిట్ మీడియా ప్రజెంట్ చేస్తున్న రూరల్ కామెడీ కొత్తపల్లిలో ఒకప్పుడు. ఉమా మహేశ్వర ఉగ్ర రూపస్య వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రాలతో అనుబంధం కలిగి ఉన్న నటిచిత్రనిర్మాత ప్రవీణ పరుచూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. పరుచూరి విజయ ప్రవీణ ఆర్ట్స్ ఈ ప్రాజెక్టును నిర్మిస్తోంది. మనోజ్ చంద్ర, మోనికా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఫస్ట్ లుక్, టీజర్ ట్రైలర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా ఈ నెల 18న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా టీం ప్రెస్ మీట్ నిర్వహించింది. ప్రెస్ మీట్ లో హీరో మనోజ్ చంద్ర మాట్లాడుతూ, అందరికి నమస్కారం. కొత్తపల్లిలో ఒకప్పుడు సినిమాలో ఇది ఒక చోటు. కానీ ఈ సినిమా మా గుండెల్లో చోటు. 18వ తారీఖున మీ గుండెల్లోకి దూసుకొస్తున్నాము. మా కలని నిజం చేసిన ప్రొడ్యూసర్, డైరెక్టర్ ప్రవీణకి కృతజ్ఞతలు. స్పిరిట్ మీడియా ద్వారా నన్ను పరిచయం చేస్తున్న రానాకి ధన్యవాదాలు. ఈ సినిమాకి పనిచేసిన ప్రతి ఆర్టిస్టు టెక్నీషియన్ కష్టాన్ని నేను దగ్గర నుండి చూశాను. వారికి నేను జీవితాంతం రుణపడి ఉంటాను. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. మీరందరూ థియేటర్స్ కొచ్చి సపోర్ట్ చేసి మా సినిమాని ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను. ప్రవీణ పరుచూరి సినిమాల్లో నటించాలంటే నటిస్తే సరిపోదు జీవించాలి. అలా రామకృష్ణ క్యారెక్టర్‌కి నేను ప్రాణం పోశాను. మీరందరూ కూడా ఈ సినిమాని ఆస్వాదిస్తారని భావిస్తున్నాను. తప్పకుండా థియేటర్స్‌లోకి రండి. మిమ్మల్ని డిసప్పాయింట్ చెయ్యము. థాంక్యూ సో మచ్ అన్నారు. డైరెక్టర్ ప్రవీణ పరుచూరి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఇది నా మూడో సినిమా. అందులో ఏదో ఒక ప్రత్యేకత ఉండాలని అనుకున్నాను. ఒక పల్లెటూర్ని ఒక ఫారిన్ సినిమాటోగ్రాఫర్‌తో షూట్ చేయించాం. ఈ సినిమాకి ఒక ఫారిన్ డీవోపీ పనిచేస్తున్నారు. నేను ఫస్ట్ సినిమా కేరాఫ్ కంచరపాలెం తీశాను. జీవితంలో ఒక్క సినిమా చాలు అనుకున్నాను. ఆ సినిమాకి ఆడియన్స్ చాలా పెద్ద విజయాన్ని ఇచ్చారు. ఆడియన్స్ ఎంకరేజ్మెంట్ నన్ను చాలా ఆశ్చర్యపరిచింది. ప్రేక్షకుల ప్రోత్సాహం వలన నేను మరో సినిమా తీయగలిగాను. కేరాఫ్ కంచరపాలెం సినిమాని చాలామంది థియేటర్స్‌లో చూడలేదని చెప్తుంటారు. సినిమా చూస్తున్నప్పుడు చాలా హాయిగా నవ్వుకుంటారు. సెకండ్ హాఫ్‌లో నా స్టైల్‌లో కొన్ని సెన్సిబిలిటీస్ కాన్సెప్ట్స్ ఉంటాయి. తప్పకుండా ఆలోచన కలిగించేలా ఉంటుంది. జులై 18న ఎవరు కూడా థియేటర్స్‌లో మిస్ అవ్వొద్దు అని కోరుకుంటున్నా. నేను ఈసారి నేను డైరెక్షన్ చేసిన సినిమా ఇది.



# 'పెద్ది' ఫస్ట్ లుక్ రిలీజ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ పెద్ది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఫిలిం మేకర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే సినిమా ఫస్ట్ షాట్ గ్లింప్స్ తో దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. పవర్ ఫుల్ కొలాబరేషన్, అద్భుతమైన టీంతో పెద్ది భారతీయ సినిమాలో కొత్త ప్రమాణాలను నెలకొల్పడానికి సిద్ధంగా ఉంది. ప్రముఖ పాన్ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో విజనరీ వెంకట సతీష్ కిలారు తన ప్రతిష్టాత్మక బ్యానర్ వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్ ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ శివరాజ్ కుమార్ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. ఇంటెన్స్ చూపు, రఫ్ అండ్ టఫ్ లుక్‌తో శివరాజ్‌కుమార్ కనిపించే తీరు అదిరిపోయింది. ఈ చిత్రంలో గౌర్నాయుడు అనే పవర్ ఫుల్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, జగపతి బాబు, దివ్యేంద్రు శర్మ ఇతర కీలక పాత్రల్లో కనిపించ నున్నారు. చిత్రానికి స్టార్ డివోపీ ఆర్. రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఆస్కార్ అవార్డు విజేత ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తున్నారు. జాతీయ అవార్డు గెలుచుకున్న నవీన్ నూలి ఎడిటర్. వినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ చేశారు. ఈ చిత్రం 2026 మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజున ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తారాగణం: రామ్ చరణ్, జాన్వి కపూర్, శివ రాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ

సాంకేతిక సిబ్బంది:రచన, దర్శకత్వం: బుచ్చి బాబు సానా, సమర్పణ: మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, బ్యానర్: వృద్ధి సినిమాస్, నిర్మాత: వెంకట సతీష్ కిలారు, సంగీతం: ఎఆర్ రెహమాన్, డిఒపి: ఆర్ రత్నవేలు, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా, ఎడిటర్: నవీన్ నూలి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వి.వై ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్: ఫస్ట్ షో పీఆర్వో: వంశీ శేఖర్.



# 'ఓజీ' షూటింగ్ పూర్తి

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ శక్తివంతమైన పాత్ర గంభీరగా అలరించనున్న చిత్రం ఓజీ. పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానుల్లో ఈ చిత్రంపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ ఓజీ చిత్రీకరణ పూర్తయిందని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా నిర్మాతలు ఒక ప్రత్యేక పోస్టర్ ను విడుదల చేశారు. వర్షంలో తడుస్తూ కారు దిగి గన్‌తో ఫైర్ చేస్తున్న పవన్ కళ్యాణ్ పోస్టర్ అదిరిపోయింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఓజీ ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. 2025 సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో అడుగు పెట్టనుంది. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మి, ప్రియాంక అరుల్ మోహన్, ప్రకాష్ రాజ్, శ్రియ రెడ్డి వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్ తమన్ సంగీతం సమకూరుస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న ఆర్ఆర్ఆర్‌ను నిర్మించిన డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో ఈ చిత్రం రూపొందుతోంది. డీవీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. 2025లో అతిపెద్ద సినిమాటిక్ ఈవెంట్‌గా ఇప్పటికే ఓజీఖిప్రశంసించబడుతోంది. రవి కె చంద్రన్, మనోజ్ పరమహంస ఛాయాగ్రాహకులుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



# 'కూలీ' నుంచి పూజా హెగ్డే ఎక్స్‌ప్లోజివ్ షో

సూపర్ స్టార్ రజనీకాంత్, లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో ప్రతిష్టాత్మక సన్ పిక్చర్స్ బ్యానర్ నిర్మించిన క్రేజీ పాన్ ఇండియా యాక్షన్ మూవీ కూలీ. కింగ్ నాగార్జున కీలక పాత్ర పోషిస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్లు, గ్లింప్స్, ఫస్ట్ సింగిల్‌తో సినిమా హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ సెకండ్ సింగిల్‌ను విడుదల చేశారు. మోనికా అనే ఈ పాట ఎక్స్‌ప్లోజివ్ నెంబర్‌గా అదరగొట్టింది. సముద్ర నేపథ్యంలో సెట్ చేయబడిన ఈ పాటలో పూజా హెగ్డే రెడ్ కలర్ డ్రెస్‌లో, ప్రతి ఫ్రేమ్‌ను తన అద్భుతమైన మూవ్స్ తో కట్టిపడేసింది. ఆమెతో పాటు సౌబిన్ షాహిర్ కూడా కనిపించడం ట్రాక్‌కు ఫన్ ఎనర్జీ తీసుకువచ్చింది. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ మరో చార్ట్‌బస్టర్‌ను కంపోజ్ చేశారు. అనిరుధ్, శుభలక్ష్మి కలిసి హై ఎనర్జీతో పాడిన ఈ సాంగ్ లో అసల్ కోలార్ రాప్ ఫ్రెష్ నెస్ యాడ్ చేసింది. కూలీ మూవీలో అమీర్ ఖాన్, ఉపేంద్ర, సత్యరాజ్ వంటి పవర్‌హౌస్ స్టార్స్ నటించారు. నిర్మాత కళానిధి మారన్ నిర్మాణంలో కూలీలో టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. సినిమాటోగ్రఫీ గిరీష్ గంగాధరన్, ఎడిటింగ్ ఫిలోమిన్ రాజ్. ఆగస్టు 14న గ్రాండ్ పాన్ఇండియా విడుదలకు సిద్ధంగా ఉన్న ఈ చిత్రం హాలీడే వీకెండ్ కి పర్ఫెక్ట్ టైం. ఈ సినిమా డి. సురేష్ బాబు, దిల్ రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ యాజమాన్యంలోని ఆసియన్ మల్టీప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. తారాగణం: రజనీకాంత్, నాగార్జున, ఆమిర్ ఖాన్, సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఉపేంద్ర, శ్రుతి హాసన్, మహేంద్రన్, సాంకేతిక బృందం: రచన, దర్శకత్వం: లోకేష్ కనగరాజ్, నిర్మాత: కళానిధి మారన్, బ్యానర్: సన్ పిక్చర్స్, రిలీజ్: ఆసియన్ మల్టీప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, సంగీతం: అనిరుధ్ రవిచందర్, డిఒపి: గిరీష్ గంగాధరన్ ఎడిటర్: ఫిలోమిన్ రాజ్ పీఆర్వో: వంశీ శేఖర్.



# 'కేడీ ది డెవిల్' టీజర్ లాంచ్

కన్నడ యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా హీరోగా కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద నిర్మాత వెంకట్ కె. నారాయణ అత్యంత భారీఎత్తున నిర్మించిన చిత్రం కేడీ ది డెవిల్. ఈ సినిమాను ప్రేమ్ తెరకెక్కించారు. ఈ మూవీలో ధ్రువ సర్జాకు జోడిగా రీష్మా నానయ్య నటించారు. ఇక ఈ ప్రాజెక్ట్‌లో సంజయ్ దత్, శిల్పా శెట్టి, నోరా ఫతేహి వంటి వారంతా ముఖ్య పాత్రల్ని పోషించారు. గురువారం నాడు ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌లో సంజయ్ దత్ మాట్లాడుతూ, హైదరాబాద్‌తో నాకు ఎంతో అనుబంధం ఉంది. ఇక్కడ ఎంతో మందితో కలిసి పని చేశాను. మరీ ముఖ్యంగా నాకు హైదరాబాద్ ఫుడ్ అంటే చాలా ఇష్టం. నేను ప్రభాస్ రాజా సాబ్ సినిమాకు పని చేస్తున్నాను. అక్కడే తెలుగు నేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాను. నాకు తెలుగులో చిరంజీవి గారంటే చాలా ఇష్టం. కేవీఎన్ ప్రొడక్షన్స్ వెంకీ సర్, సుప్రిత్‌లకు సినిమా పట్ల ఎంతో ప్యాషన్ ఉంది. అందుకే ఇలాంటి మూవీని ఇంత గొప్పగా నిర్మించగలిగారు. డైరెక్టర్ ప్రేమ్ చాలా మంచి వ్యక్తి. ఆయన ఎంతో ఒదిగి ఉంటారు. రీష్మా చాలా చక్కగా నటించారు. ధృవ్ నా తమ్ముడులాంటి వారు. ధృవ చాలా ఎత్తుకు ఎదగాలని కోరుకుంటున్నాను. శిల్పా శెట్టితో ఎప్పుడు పని చేసినా అదే ఎనర్జీ ఉంటుంది. మా సినిమాను అందరూ చూసి సక్సెస్ చేయండి అని అన్నారు. ధృవ సర్జా మాట్లాడుతూ, కేడీ కోసం పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా కెమెరామెన్ విలియం, మా నిర్మాత వెంకట్, సుప్రిత్, మ్యూజిక్ డైరెక్టర్ అర్జున్ అందరికీ ధన్యవాదాలు. నాకు సంజయ్ దత్ అంటే ఎంతో ఇష్టం. ఆయనతో పని చేయడం ఆనందంగా ఉంది. శిల్పా శెట్టి వంటి యాక్టర్లతో పని చేయడం ఎప్పుడూ సంతోషంగానే ఉంటుంది. సెట్స్ మీద ఆమె మా యాక్టింగ్‌ను కరెక్ట్ చేస్తుంటారు. రీష్మా మంచి నటి. మా మూవీ త్వరలోనే రాబోతోంది. అందరూ చూడండి. అందరికీ నచ్చుతుంది అని అన్నారు. దర్శకుడు ప్రేమ్ మాట్లాడుతూ, కేడీ ది డెవిల్ టీజర్‌కు వస్తున్న రెస్పాన్స్ చూస్తే నాకు మాటలు రావడం లేదు. నాకు కన్నడ మాత్రమే వచ్చు. తెలుగు అర్థం అవుతుంది.



# 'గదాధారి హనుమాన్' టీజర్

మైథలాజికల్ జానర్‌లో అత్యంత భారీ చిత్రంగా విరభ్ స్టూడియో బ్యానర్ మీద రేణుకా ప్రసాద్, బసవరాజ్ హురకడ్లి సంయుక్తంగా నిర్మించిన చిత్రం గదాధారి హనుమాన్. తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో తెరకెక్కించిన ఈ చిత్రంలో రవి కిరణ్ హీరోగా నటించారు. ఈ మూవీకి రోహిత్ కొల్లి దర్శకత్వం వహించారు. శుక్రవారం నాడు ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్, రాజ్ కందుకూరి, డైరెక్టర్ సముద్ర వంటి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో సి.కళ్యాణ్ మాట్లాడుతూ, హనుమాన్ సినిమాను నేనే ప్రారంభించాను. ప్రశాంత్ వర్మకి నాతోనే సినిమాను ప్రారంభించాలనే ఓ సెంటిమెంట్ ఉంటుంది. ఆ హనుమాన్ ఎలా హిట్ అయిందో.. ఈ గదాధారి హనుమాన్ కూడా అంతే స్థాయిలో హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. హనుమాన్‌ను నమ్ముకున్న వారంతా విజయాన్ని సాధిస్తారు. టీజర్ అద్భుతంగా ఉంది. తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో వస్తోన్న ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. రాజ్ కందుకూరి మాట్లాడుతూ, గదాధారి హనుమాన్ టైటిల్ చాలా పాజిటివ్‌గా ఉంది. ఇలాంటి ఓ టైటిల్‌ను పెట్టుకుని సినిమా తీసిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. రవి కిరణ్ ఇది వరకే నాకు కథ చెప్పారు. క్లైమాక్స్ అద్భుతంగా ఉండబోతోంది. ఇలాంటి చిత్రాలు ఇప్పుడు ఎక్కువగా ఆడుతున్నాయి. సినిమాలో కంటెంట్ ఉంటే చిన్నదా? పెద్దదా? అన్న తేడాని ఆడియెన్స్ చూడటం లేదు. రవి కిరణ్ ఈ మూవీతో సూపర్ స్టార్ అవుతారనిపిస్తోంది. ఈ చిత్రం కచ్చితంగా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది అని అన్నారు. దర్శకుడు సముద్ర మాట్లాడుతూ, గదాధారి హనుమాన్ ఈవెంట్‌కు విచ్చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. దర్శకుడు రోహిత్ నాకు మంచి మిత్రుడు. టీజర్ బాగుంది. రవి కిరణ్ ఈ చిత్రంతో మరోసారి పెద్ద విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను అని అన్నారు. హీరో రవి కిరణ్ మాట్లాడుతూ, మా కోసం వచ్చిన రాజ్ కందుకూరికి థాంక్స్. ఈ చిత్రాన్ని ఇంత గొప్పగా నిర్మించిన మా నిర్మాతలు బసవరాజ్, రేణుకా ప్రసాద్ గారికి థాంక్స్. మొదట్లో ఈ సినిమాను చాలా చిన్నగా చేయాలని అనుకున్నాం. కానీ ఆ హనుమాన్ ఇచ్చిన సపోర్ట్, శక్తి వల్లే ఈ సినిమాను ఇంతటి స్థాయిలో తెరకెక్కించగలిగాం. క్లైమాక్స్ చాలా కాంప్లికేటెడ్‌గా ఉంటుంది. మా చిత్రంలో మ్యూజిక్, బీజీఎం, విజువల్స్ నెక్స్ట్ లెవెల్లో ఉంటాయి. నేను చిరంజీవికి పెద్ద అభిమానిని. ఆయనకు హనుమాన్ అంటే ఇష్టం. ఆ ఇద్దరి ఆశీస్సులు మా సినిమాపై ఉంటాయని భావిస్తున్నాను. ఈ చిత్రంలో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి.





శ్రియా శరణ్ నయా లుక్

# 'కె-ర్యాంప్' గ్లింప్

యంగ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా కె-ర్యాంప్. కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న 11వ చిత్రమిది. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్ల మీద సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. కె-ర్యాంప్ సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఓ స్పెషల్ వీడియోతో కె-ర్యాంప్ సినిమా నుంచి రిచెస్ట్ చిల్లర్ గయ్ గ్లింప్స్ రిలీజ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ నెల 14న ఈ గ్లింప్స్ రిలీజ్ చేయ బోతున్నారు. కొచ్చి పోర్ట్ లొకేషన్‌లో కిరణ్ అబ్బవరం, దర్శకుడు జైన్స్ నాని మధ్య సరదా సంభాషణతో రూపొందించిన ఈ అనౌన్స్‌మెంట్ వీడియో ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం చిత్రీకరణ తుది దశకు చేరుకున్న "కె-ర్యాంప్" మూవీ దీపావళికి గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. నటీనటులు: కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా, నరేష్, సాయి కుమార్, వెన్నెల కిషోర్ తదితరులు. టెక్నికల్ టీమ్: ప్రొడక్షన్ డిజైనర్: బ్రహ్మ కడలి, యాక్షన్: పృథ్వీ, ఎడిటర్: ఛోటా కె ప్రసాద్. డీవోపీ: సతీష్ రెడ్డి మాసం, మ్యూజిక్: చేతన్ భరద్వాజ్, పీఆర్ఒ: జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్), వంశీ శేఖర్, కో ప్రొడ్యూసర్ బాలాజీ గుట్ట, ప్రొడ్యూసర్: రాజేష్ దండాశివ బొమ్మకు, రచన, దర్శకత్వం: జైన్స్ నాని.



# ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా మూవీ 'జూనియర్'

ప్రముఖ రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి, రాధా కృష్ణ దర్శకత్వం వహించిన యూత్ ఎంటర్‌టైనర్ జూనియర్‌తో హీరోగా అరంగేట్రం చేస్తున్నాడు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. వారాహి చలన చిత్రం బ్యానర్‌పై రజని కొర్రపాటి నిర్మిస్తున్నారు. ఈ సినిమా పాటలు చార్ట్‌బస్టర్ హిట్ అయ్యాయి. టీజర్, ట్రైలర్‌కి ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రానికి స్టార్ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ డివోపీగా పని చేస్తున్నారు. సినిమా జూలై 18న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సినిమాటోగ్రాఫర్ కె.కె.సెంథిల్ కుమార్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు.

**ఈ ప్రాజెక్టు ఎలా స్టార్ట్ అయింది?** నిర్మాత సాయితో నాకు మంచి పరిచయం ఉంది. ఆయనతో ఈగ సినిమా చేశాను. ఆర్ఆర్ఆర్ తర్వాత ఈ సినిమా గురించి చెప్పారు. డైరెక్టర్ రాధాకృష్ణ చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. మంచి ప్రొడక్షన్ హౌస్, టెక్నికల్ టీం కూడా చాలా బాగుంది. అలా ఈ ప్రాజెక్ట్ చేయడం జరిగింది.

**ఈ కథలో మిమ్మల్ని అట్రాక్ట్ చేసిన ఎలిమెంట్ ఏమిటి?** కొత్తవారిని పరిచయం చేసినప్పుడు ఫ్యామిలీ డ్రామా జానర్‌కి వెళ్ళరు. డాన్సు ఫైట్లు ఉంటే చాలు అనుకుంటారు. కానీ ఈ సినిమాలో స్ట్రాంగ్ ఎమోషన్ ఉంది. అది నాకు చాలా ఇంప్రెస్ చేసింది. కొత్త హీరో ఇలాంటి ఛాలెంజ్ తీసుకొని చేయడం అనేది నాకు చాలా నచ్చింది

**హీరో కిరీటి గురించి?** కిరీటి చాలా హార్డ్ వర్కర్. చాలా అద్భుతమైన డాన్సర్. యాక్షన్ చాలా బాగా చేస్తాడు. తన యాక్టింగ్ కూడా చాలా బాగుంది. తను బ్యాలెన్స్డ్ యాక్టర్. తను వన్ ఆఫ్ ది బెస్ట్ న్యూ కమ్మర్.

**మీరు రాజమౌళితో పెద్ద కాన్వాస్ సినిమాలు చేశారు. ఇప్పుడు జూనియర్ లాంటి న్యూ కమ్మర్ సినిమాని ఎంచుకోవడానికి కారణం?** ప్రతి సినిమా దేనికదే ప్రత్యేకం. ఒక హెవీ గ్రాఫిక్స్ సిజీ వర్క్ ఉన్న సినిమా తర్వాత ఇలాంటి సినిమా చేయడం నాకూ రిఫ్రెషింగ్ అనిపించి చేశాను. ఇందులో ఉన్న కోర్ ఎమోషన్ నాకు చాలా నచ్చింది. ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామాస్ రావడం తగ్గిపోయింది. ఇలాంటి సమయంలో ఈ సినిమా చేసే అవకాశం రావడం ఆనందంగా ఉంది. ఈ సినిమా పాటలు జనాలకి నచ్చాయి. వైరల్ వయ్యారి పాటలో కిరీటి శ్రీలీల డ్యాన్సులు అందరినీ ఆకట్టుకున్నాయి. ట్రైలర్ కూడా బాగా నచ్చింది.

**మీరు ఒక సినిమాని సెలెక్ట్ చేసుకోవాలంటే కథలో ఎలాంటి ఎలిమెంట్స్ చూస్తారు?** స్టోరీ ఎమోషనల్‌గా మూవ్ అవుతుందో లేదో చూస్తాను. అది చాలా ఇంపార్టెంట్. ఎమోషన్ మనల్ని కదిలించకపోతే మిగతా ఎలాంటి ఎలిమెంట్స్ ఉన్నా కూడా వర్కౌట్ అవ్వదు.

**మీరు రాజమౌళితో కంటిన్యూగా పని చేశారు కదా..ఇప్పుడు చేస్తున్న సినిమాకి గ్యాప్ రావడానికి కారణం ఏమిటి?** ఇప్పుడే కాదండి. గతంలో కూడా రాజమౌళి నేను వరుసగా సినిమాలు చేస్తున్నప్పుడు మధ్యలో గ్యాప్ ఉండేది.

**రవిచంద్రన్‌తో పనిచేయడం ఎలా అనిపించింది?** రవిచంద్రన్ గ్రేట్ యాక్టర్. ఆయన ఏజ్‌లో ఆయనకున్న ఎనర్జీ చూస్తే అన్ బిలియబుల్ అనిపిస్తుంది. ఆయనతో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్పీరియన్స్.



కె.కె.సెంథిల్ కుమార్

13-7Pg5.qxd:13-7Pg5.qxd 13/07/25 10:38 PM Page 1



# దక్షిణాదిరాష్ట్రాల అభివృద్ధితోనే 'వికసిత్ భారత్'

## కేరళలో బిజెపి మొరార్జీభవన్ ప్రారంభించిన హోంమంత్రి అమిత్‌షా



**తిరువనంతపురం, జూలై 12:** దక్షిణాది రాష్ట్రాలు బలోపేతం కాకుండా వికసిత్ భారత్ సాధ్యం కాదు అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. శనివారం కేరళలో బీజేపీ రాష్ట్ర కమిటీ కార్యాలయాన్ని, మొరార్జీ భవన్‌ను ప్రారంభించిన ఆయన, అక్కడి అధికార, ప్రతిపక్ష పార్టీలపై విమర్శల వర్షం కురిపించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నిర్వహించబోయే నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాల ఆందోళనను గమనించామని, వాటిని కూడా పరిగణనలోనికి తీసుకునే పునర్విభజన జరుగుతుందని ఆయన అన్నారు. సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్, ప్రతిపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌లు రాష్ట్రంలో అవినీతిని సృష్టించాయని, బుజ్జగింపు రాజకీయాలను అనుసరిస్తున్నాయని దుయ్యబట్టారు. ఈ రెండు పార్టీలు కేరళను పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) లాంటి దేశ వ్యతిరేక శక్తులకు సురక్షితమైన స్వర్గధామంగా మార్చాయని ఆరోపించారు. పుత్తారికండం మైదానంలో జరిగిన వార్డు స్థాయి నాయకుల సమావేశంలో, పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులతో బీజేపీ పెద్ద సమావేశాన్ని నిర్వహించింది. అందులో పాల్గొన్న అమిత్ షా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ మాత్రమే కేరళ రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి తీసుకురాగలదు. ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ వల్ల ఇది సాధ్యంకాదు. బలమైన దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి లేకుండా వికసిత్ భారత్ సాకారం కాదు. వికసిత్ భారత్‌కు మార్గం వికసిత్ కేరళం ద్వారానే ఉంటుంది. కనుక ఇప్పటి నుంచి బీజేపీ ప్రాథమిక లక్ష్యం వికసిత్ కేరళం అవుతుందని అన్నారు. వికసిత్ కేరళ మిషన్ లోగోను ఆవిష్క రించిన అమిత్ షా ఇదే సభలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి పీఠం కంటే కేరళ రాష్ట్ర అభివృద్ధే (వికసిత్ కేరళం) తమ ధ్యేయమని అన్నారు. 2022లో కేంద్ర ప్రభుత్వం పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాఖి (పీఎఫ్ ఐ)తోపాటు, దాని అనుబంధ సంస్థలను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటిం చింది. అయితే పీఎఫ్ఐపై కేరళ ప్రభుత్వం నిషేధం విధించలేదు. దీనిపై కూడా అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఎఫ్ఐ సంస్థపై నిషేధం విధించే అన్ని అధికారాలు కేరళ ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, ఎందుకు అలా చేయ డంలేదని ప్రశ్నించారు. కానీ మోదీ సర్కార్ దేశ వ్యతిరేక శక్తులపై ఉక్కుపాదం మోపిందని, అందులో భాగంగా వివిధ ప్రాంతాలకు వ్యాపించిన పీఎఫ్ఐపై నిషేధం విధించి, దాని అగ్ర నాయకులను అరెస్ట్ చేయించిందని అమిత్ షా పేర్కొన్నారు. బీజేపీ, సీపీఎం రెండూ కేడర్ ఆధారిత పార్టీలు. అయితే ఈ రెండు పార్టీల మధ్య ప్రధానమైన వ్యత్యాసం ఉంది. బీజేపీ కేడర్ కోసం కాకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తుంది. కానీ సీపీఎం రాష్ట్ర అభివృద్ధి కంటే కార్యకర్తల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తుందని అమిత్ షా అన్నారు. అసోం, త్రిపురల్లో బలమైన పార్టీలు ఉన్నప్పటికీ, అక్కడ బీజేపీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసిందని, అలాగే తమిళనాడులో కూడా తమ పార్టీ అధికారంలోకి వస్తుందని అమిత్ షా అన్నారు. ఇక 2026 కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి, ప్రభుత్వం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా బీజేపీ బరిలోకి దిగుతుందని ఆయన ప్రకటించారు. కేరళలో ఈ ఏడాది చివర్లలో స్థానిక సంస్థల ఎన్నికలు, వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలోనే అమిత్ షా కేరళలో బీజేపీ రాష్ట్ర కమిటీ కార్యాలయాన్ని, మొరార్జీ భవన్‌ను ప్రారంభించారు.

# చిరాగ్‌పాశ్వాన్‌ను హత్య చేస్తామని ఇన్‌స్టా పోస్టులు!

## సైబర్‌సెల్‌కు ఫిర్యాదులు చేసిన ఎల్జేపీ నాయకులు



**పాట్నా,జూలై 12:** కేంద్ర మంత్రి లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్‌కు సోషల్ మీడియాలో హత్యా బెదిరింపులు వచ్చాయని, ఆయన పార్టీ ప్రతినిధి రాజేష్ భట్ శుక్రవారం తెలిపారు. చిరాగ్‌ను చంపేస్తానని బెదిరిస్తూ టైగర్ మెరాజ్ ఇడిసి పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టారని ఆయన తెలిపారు. ఈ సంఘటన బీహార్ రాజకీయాల్లో కలకలం రేపింది. ఈ విషయంపై భట్ పాట్నాలోని సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాశ్వాన్‌కు పెరుగుతున్న ప్రజాదరణ కారణంగానే ఈ బెదిరింపులు వచ్చాయని పేర్కొన్నారు. పోలీసులు వెంటనే ఈ విషయంపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. గతవారం సారన్‌లో జరిగిన సభలో పాశ్వాన్ ప్రసంగించారు. అందులో రాబోయే బీహార్ ఎన్నికలకు తాను పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. బీహార్ ప్రజలు, సోదర సోదరీమణుల కోసం పోటీ చేస్తానని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. ఈ క్రమంలోనే ఆయనకు హత్యా బెదిరింపులు రావడం గమనార్హం. ఈ ఏడాది చివర్లో అక్టోబర్ లేదా నవంబర్‌లో బీహార్ ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఇందుకు సంబంధించి భారత ఎన్నికల కమిషన్ అధికారిక తేదీని ప్రకటించలేదు. ఎన్నికల్లో నేను ఏ స్థానం నుంచి పోటీ చేయాలనేది ప్రజలే నిర్ణయిస్తారు. నేను ఏ నిర్ణయం తీసుకున్నా అది ప్రజల మంచి కోసమే" అని చిరాగ్ పేర్కొన్నారు. చిరాగ్ పాశ్వాన్ రాష్ట్ర రాజకీయాల్లోకి తిరిగి రావడం కీలక పరిణామంగా మారబోతోంది.

# ఉక్రెయిన్ రక్షణ వ్యవస్థలు ధ్వంసం: రష్యా రక్షణ శాఖ వెల్లడి



**మాస్కో, జూలై 12:** ఉక్రెయిన్‌పై రష్యా భారీ స్థాయిలో దాడులు కొనసాగిస్తోంది. తాజాగా కీవ్‌లోని ఆయుధ పరిశ్రమలపై మాస్కో 600 డ్రోన్లు, క్షిపణులతో వైమానిక దాడులకు పాల్పడింది. ఉక్రెయిన్‌కు చెందిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ కేంద్రాలు, సైనిక వైమానిక స్థావరాలపైనా దాడులు నిర్వహించినట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. ఈ దాడుల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా నివాస భవనాలు, మౌలిక సదుపాయాలు, విశ్వవిద్యాలయాలు దెబ్బతిన్నాయి. పదులసంఖ్యలో ప్రజలు గాయాలపాలయ్యారు. రష్యా ప్రయోగించిన 319 డ్రోన్లు, 25 క్రూజ్ క్షిపణులను నేలకూల్చినట్లు ఉక్రెయిన్ ఎయిర్ డిఫెన్స్ ఫోర్స్ వెల్లడించింది. కీవ్ చేపట్టిన ఎదురుదాడుల్లో మాస్కోలోని పలు భవనాలు ధ్వంసమయ్యాయి. తమతో జరుగుతున్న యుద్ధంలో రష్యా వాడుతున్న 40 శాతం బాలిస్టిక్ క్షిపణులు, ఫిరంగి వ్యవస్థలు ఉత్తరకొరియా నుంచే రష్యాకు అందుతున్నాయని ఉక్రెయిన్ ఆరోపించిన కొన్ని గంటల్లోనే పుతిన్ సేనలు ఈ దాడులకు పాల్పడడం గమనార్హం. పుతిన్ సేనలు కొనసాగిస్తున్న యుద్ధానికి గట్టిగా బదులు చెప్తామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ శుక్రవారం పేర్కొన్నారు. యుద్ధం విషయంలో త్వరగా ఓ నిర్ణయానికి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌కు తాత్కాలికంగా నిలిపివేసిన కొన్ని ఆయుధాల సరఫరాను తిరిగి ప్రారంభించినట్లు అమెరికా అధికారులు తెలిపారు. ఇందులో 155 ఎంఎం మందుగుండు సామాగ్రితో పాటు జిఎంఎల్ఆర్ ఎస్‌గా పిలిచే ప్రెసిషన్ గైడెడ్ రాకెట్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

# 8వ పేకమిషన్ సిఫారసులపైనే ఉద్యోగుల ఫోకస్




**న్యూఢిల్లీ,జూలై 12:** కేంద్రం అమలుచేయనున్న 8వ వేతన సంఘం సిఫారసులకోసం 1.12 కోట్ల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఇది 7వ వేతన సంఘం గడువు డిసెంబర్ 2025తో ముగిసిన వెంటనే ప్రారంభమవుతుంది. 8వ వేతన సంఘం ప్రాథమిక వేతనం, అలవెన్సులు, పెన్షన్లు, పదవీ విరమణ ప్రయోజనాలను పెంచే అవకాశం ఉన్నందున, ఇది వచ్చే ఏడాది జనవరి 2026 నుంచి అమల్లోకి వస్తుందా లేదా ఆలస్యం అవుతుందా అని చాలా మంది ఆందోళన చెందుతున్నారు. 8వ వేతన సంఘం 2027లో అమలులోకి వచ్చే అవకాశం ఉందని ఒక నివేదిక పేర్కొంది. దీనికి కారణం జనవరి 2025లో కేంద్ర ప్రభుత్వం 8వ వేతన సంఘాన్ని ప్రకటించినప్పటికీ, జులై 2025 వరకు దాని ఛైర్మన్, సభ్యులు లేదా నిబంధనలకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు. మరోవైపు ఇప్పటికే 8వ వేతన సంఘం ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల జీతాలు, పెన్షన్లను 3034 శాతం వరకు పెంచే అవకాశం ఉందని అంబిట్ క్యాపిటల్ నివేదిక అంచనా వేసింది. ఈదృష్ట్యా 2027వరకు అమలులోకి వచ్చే అవకాశం లేదు. కమిషన్ ఏర్పాటు నుంచి అమలు వరకు చాలా సమయం పడుతుంది. 7వ వేతన సంఘం ఫిబ్రవరి 2014లో ఏర్పాటైతే, అది జనవరి 2016 నుంచి మాత్రమే అమలులోకి వచ్చింది. సుప్రీంకోర్టు న్యాయవాది సందీప్ బజాజ్ అభిప్రాయం ప్రకారం, 8వ వేతన సంఘం జనవరి 2025లో అధికారికంగా ప్రకటించినప్పటికీ, దాని పురోగతి నెమ్మదిగా ఉంది. కమిషన్ ఛైర్‌పర్సన్, సభ్యుల నియామకం, నిబంధనల ఖరారు వంటి ముఖ్యమైనవి ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. వేతన సంఘాలు సాధారణంగా వాటి ఏర్పాటు నుంచి అమలు వరకు 2 సంవత్సరాలు తీసుకుంటాయని బజాజ్ తెలిపారు. దీని ప్రకారం, 8వ వేతన సంఘం జనవరి 2026 నుంచి అమలులోకి వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఇది 2027 వరకు వాయిదా పడే అవకాశం ఉందని తెలుస్తోంది. 2025-26 కేంద్ర బడ్జెట్‌లో 8వ వేతన సంఘానికి ఎటువంటి నిధులు కేటాయించలేదని బజాజ్ ప్రస్తావించారు. యాంబిట్ క్యాపిటల్ డేటా ప్రకారం, జీతాలు, పెన్షన్లలో అంచనా వేసిన 3034 శాతం పెంపును పరిగణనలోకి తీసుకోవడానికి ప్రభుత్వానికి అదనంగా రూ. 1.8 లక్షల కోట్లు అవసరం అవుతాయి.



# ప్రేమకోసం సరిహద్దులు దాటి కటకటాల పాలు!

**ఐజ్వాల్, జూలై 12:** ప్రేమ కోసం సరిహద్దు దాటిన యువతి భారత్‌లో కటకటాల పాలైంది. తమ ప్రేమను పంచుకోవడానికి అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన బంగ్లాదేశ్ యువతి గుల్నానా అఖ్తర్‌ను త్రిపుర పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ ఘటన త్రిపురలోని సెపాహిజాల జిల్లాలో చోటుచేసుకుంది. ఆమె కోసం కర్ణాటక నుంచి వచ్చిన ప్రియుడు దత్తా యాదవ్‌ను కూడా త్రిపుర పోలీసులు అరెస్ట్ చేశారు. గుల్నానా అఖ్తర్ బంగ్లాదేశ్‌లోని బొగురా జిల్లాలోని పల్సా గ్రామానికి చెందిన యువతి. ఆమెకు 8నెలల క్రితం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా భారతదేశానికి చెందిన దత్తా యాదవ్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారింది. దత్తా యాదవ్ కర్ణాటకలోని బెంగళూరులో నివసిస్తున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో వారి పరిచయం టెక్స్ట్ మెసేజ్‌లు, ఫోటోలు, వీడియో కాల్స్ ద్వారా కొనసాగింది. ఈ వర్చువల్ పరిచయం క్రమంగా గాఢమైన ప్రేమగా మారింది, చివరికి వారు వ్యక్తిగతంగా కలుసుకోవాలనే తీవ్రమైన కోరికను పెంచుకున్నారు. ఈ కోరికతోనే గుల్నానా గురువారం సరిహద్దు దాటడానికి ప్రమాదకరమైన నిర్ణయం తీసుకుంది. అదే సమయంలో, దత్తా బెంగళూరు నుండి త్రిపురలోని సెపాహిజాల జిల్లాలో ఉన్న హరిహోర్దులా సరిహద్దు గ్రామానికి చేరుకున్నాడు. వారిద్దరూ సరిహద్దు వద్ద కలుసుకున్నప్పటికీ, వారి ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. సమాచారం అందుకున్న భారత సరిహద్దు భద్రతా దళం (బీఎస్‌ఎఫ్) ఆ జంటను అదుపులోకి తీసుకుంది. వెంటనే వారిని మధుపూర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. గురువారం వారిని న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. గుల్నానా మరియు దత్తాలపై పోలీసులు పాస్‌పోర్ట్ చట్టం, విదేశీయుల చట్టం, మరియు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద కేసులు నమోదు చేశారు.

# సోషల్ మీడియాలో వీడియో చేస్తే రోడ్డు రాదు!

## గర్భిణులు వైరల్‌చేసిన వీడియోపై మధ్యప్రదేశ్ మంత్రి వ్యాఖ్యలు



**సిద్ధి(ఎంపీ)జూలై 12:** మధ్యప్రదేశ్‌లోసిధి జిల్లాలోని ఒక గ్రామానికి చెందిన కొంతమంది గర్భిణీ స్త్రీలు తమ గ్రామానికి రోడ్డు కావాలంటూ ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా అది వైరల్‌గా మారడం, ఆపై ఎంపీ మంత్రి స్పందించిన తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఖడ్డీ ఖుర్ద్ గ్రామానికి సరైన రోడ్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణీలు ఆస్పత్రులకు వెళ్లాలంటే అరిగోస అనుభవిస్తున్నారు. ఈ క్రమంలో లీలా సాహు అనే మహిళ గ్రామంలోని కొంతమంది గర్భిణీలతో కలిసి తమకు రోడ్డు కావాలంటూ 2023లో ఓ వీడియో చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఆ పోస్ట్‌ను ప్రధాని మోదీతో పాటు నితిన్ గడ్కరీకి ట్యాగ్ చేసింది. మధ్యప్రదేశ్ నుంచి 29మంది ఎంపీలను గెలిపించాం. కానీ మేం రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని రాసుకొచ్చింది. లీలాకు సోషల్ మీడియాలో లక్ష మంది ఫాలోవర్లు ఉండడంతో అది వైరల్‌గా మారింది. దీంతో తగిన చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరిస్తామని స్థానిక కలెక్టర్ సహా ఎంపీ హామీ ఇచ్చారు. కానీ ఏడాది గడిచినా ఆ గ్రామానికి రోడ్డు రాలేదు. ఈ క్రమంలో బీజేపీ ఎంపీ రాజేశ్ మిశ్రా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. మహిళ డెలివరీ డేట్‌కు వారం ముందు రోడ్డు వేస్తామని అన్నారు. అంతేకాకుండా ఆమె కోరుకుంటే మా వద్దకు రావచ్చు. ఆమెకు అన్నీ సౌకర్యాలు కల్పిస్తాం. కానీ ఇలా బహిరంగంగా మాట్లాడడం కరెక్ట్ కాదు. అత్యవసరమైతే తమ వద్ద హెలికాప్టర్లు ఉన్నాయి. ఆశా కార్యకర్తలతో పాటు అంబులెన్స్‌లు ఉన్నాయని అన్నారు. అటవీశాఖ అనుమతుల వల్ల రోడ్డు వేయడం ఆలస్యం అవుతుందని చెప్పారు. ఆన్ లైన్‌లో వీడియో పెట్టగానే సమస్యలు పరిష్కారం కావని మంత్రి రాకేశ్ సింగ్ అన్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టగానే వారి వద్దకు సిమెంట్, కాంక్రీట్‌తో చేరుకోవాలా అని ప్రశ్నించారు. బడ్జెట్ పరిమితంగా ఉంటుందని నిబంధనల ప్రకారం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని తెలిపారు. ఎంపీ, మంత్రి వ్యాఖ్యలపై నెటిజన్లు మండిపడుతున్నారు.

# సెల్ఫీతీసుకుందామని భర్తను నదిలోకి తోసేసిన భార్య

**బెంగళూరు, జులై 12:** కర్ణాటకలోని రాయచూర్ జిల్లా కద్లూరు వద్ద సెల్ఫీ తీసుకునే నెపంతో భర్తను కృష్ణా నదిలోకి తోసివేసిన ఘటన కలకలం రేపింది. కర్ణాటకతెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ఈ అమానుష ఘటన చోటు చేసుకుంది. నదిలో పడిపోయిన భర్తను గ్రామస్థులు చాకచక్యంగా రక్షించడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే తాయప్ప, చిన్ని అనేదంపతులు కృష్ణానది ఒడ్డున విహార యాత్రకు వచ్చారు. ఇద్దరూ సెల్ఫీలు తీసుకుంటుండగా, భార్య చిన్ని తన భర్త తాయప్పను ఒక్కసారిగా నదిలోకి తోసివేసింది. ఊహించని ఈ పరిణామంతో తాయప్ప నీటిలో పడిపోయి ప్రాణాలకోసం అల్లాడాడు. అయితే, అతడు నీట మునుగుతుండడాన్ని గమనించిన స్థానికులు వెంటనేస్పందించి, తాళ్ల సాయంతో సురక్షితంగా బయటకు తీశారు. ఈఘటనపై తాయప్ప స్పందిస్తూ, తన భార్య తనను చంపడానికి పథకం ప్రకారం నదిలోకి తోసిందని ఆరోపించాడు.

# ప్రాచీన వైద్యపద్ధతులు కృత్రిమ మేధతో విలీనం

## తొలిదేశంగా భారత్: ప్రపంచ ఆరోగ్యసంస్థ వెల్లడి



**జెనీవా,జూలై 12:** భారత్ మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రాచీన వైద్య పద్ధతుల సమాచారాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సమీకృతం చేసిన తొలి దేశంగా భారత్ అవతరించింది. ఈ విషయాన్ని స్వయంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. ఆయుష్ చికిత్సా పద్ధతుల వివరాలను కూడా ఏఐతో భారత్ సమీకృతం చేసిందని తెలిపింది. ఈ నేపథ్యంలోనే తాము మ్యాపింగ్ ది అప్లికేషన్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ ట్రెడిషనల్ మెడిసిన్ శీర్షికన సంప్రదాయ వైద్య విధానాలపై ఏఐ కార్యాచరణ ప్రణాళికను ప్రకటించామని వెల్లడించింది. ఆయుర్వేద, సిద్ధ, యునాని, సోవా రిగ్పా, హోమియోపతి వంటి ప్రాచీన వైద్య విధానాలను ట్రెడిషనల్ నాలెడ్జ్ డిజిటల్ లైబ్రరీ ద్వారా డిజిటల్ రూపంలోకి తెచ్చిన తొలి దేశం భారతేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ కొనియాడింది. ఇందులోని విలువైన ప్రాచీన సమాచారాన్ని ప్రతీ వైద్య నిపుణుడు అర్థవంతంగా తెలుసుకునేందుకు ప్రత్యేక ఏఐ టూల్స్ ఉన్నాయని తెలిపింది. డిజిటల్ ఆరోగ్య ఆవిష్కరణలతో పాటు ప్రాచీన వైద్య విధానాల సమాచారాన్ని భావితరాలకు చేర్చే విషయంలో ప్రపంచంలో అగ్రగామిగా భారత్ నిలవాలనే నరేంద్రమోదీ సర్కారు సంకల్పానికి ఈ పురోగతి నిదర్శనమని తెలిపింది. సంప్రదాయ ఔషధాల వినియోగ సమాచారాన్ని ఏఐతో సమీకృతం చేయాలనే డబ్ల్యూహెచ్ఓ కార్యాచరణ ప్రణాళికకు భారత్ మార్గదర్శిగా నిలిచిందని పేర్కొంది. ప్రాచీన వైద్య పద్ధతులను ప్రోత్సహించేందుకు ఒక శాస్త్రీయమైన వ్యవస్థను అందుబాటులోకి తేవాలనే బలమైన సంకల్పంతో కేంద్ర సర్కారు ముందుకుసాగుతోందని ఆయుష్ శాఖ వెల్లడించింది. ప్రపంచ సంప్రదాయ ఔషధ చికిత్సా మార్కెట్‌లో భారత్ ప్రభావం పెరుగుతోందని, ఏఐ, ఆయుష్ విభాగాల్లో భారత్ కీలక పురోగతిని సాధించిందని, ఆయుర్వేద, సిద్ధ, యునాని, సోవా రిగ్పా, హోమియోపతి వంటి చికిత్సా పద్ధతులపై ఏఐ సాఫ్ట్‌వేర్లను భారత్ అందుబాటులోకి తెచ్చింది. ఈ చికిత్సలు అందించే క్రమంలో రోగి నాడిని పరిశీలించడం, నాలుకను పరీక్షించడం వంటి రోగ నిర్ధరణ పద్ధతులను ఎలా అనుసరించాలనే సమాచారం ఆయా సాఫ్ట్‌వేర్లలో ఉందని డబ్ల్యూహెచ్ఓ వెల్లడించింది. రోగులకు ఆయుర్వేద చికిత్సను అందించే క్రమంలో వాత, పిత్త, కఫ దోషాలను గుర్తిస్తారు. ఇందుకోసం ప్రకృతి మదింపు పరీక్ష చేస్తారు. మెషీన్ లెర్నింగ్ అల్గారిథమ్‌లు, డీప్ న్యూరల్ నెట్‌వర్క్‌లతో ఈ మదింపును చేసేలా టెక్నాలజీని భారత్ అందుబాటులోకి తెచ్చింది. భారత్ తీసుకొచ్చిన ఆయుర్ జీనోమిక్స్ కాన్సెప్ట్‌ను డబ్ల్యూహెచ్ఓ కొనియాడింది. ఆయుర్వేద సిద్ధాంతాలతో జీనోమిక్స్‌ను మిళితం చేయడం గొప్ప విషయమని పేర్కొంది. జీనోమిక్స్ అనేది జీవరాశుల డీఎన్ఏలు, జన్యువుల గురించి అధ్యయనం చేస్తుంది. ఏయే వ్యాధులు ఎందుకు వస్తాయి, ఎలాంటి ఆరోగ్య సమస్యలకు ఏవిధమైన పరిష్కారాలు ఉంటాయి, అనే ప్రశ్నలకు ఆయుర్వేదం ప్రకారం సమాధానాలను అందించే ఏఐ సాఫ్ట్‌వేర్‌లను భారత్ అందు బాటులోకి తెచ్చింది.



# ఉత్పత్తిరంగమే ఉపాధికల్పనకు మూలం

## రోజ్‌గార్‌మేళా 16వ ఎడిషన్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జూలై 12:** ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు భారత్ వేగంగా అడుగులు వేస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన గత 11 ఏళ్లలో ప్రతి రంగంలోనూ దేశం పురోగతి సాధించిందని పేర్కొన్నారు. రోజ్‌గార్ మేళ 16వ ఎడిషన్‌లో మాట్లాడిన ప్రధాని మోడీ ఈసందర్భంగా కొంతమందికి రోజ్‌గార్ నియామకపత్రాలను అందచేసారు. భారతదేశానికి ఉన్న గొప్ప బలాల్లో తయారీ రంగం ఒకటని అన్నారు. తమ ప్రభుత్వం ప్రైవేట్ రంగంలో ఉపాధి పెంచడానికి చర్యలు చేపడుతోందని వెల్లడించారు. భారత ప్రభుత్వం ప్రైవేట్ రంగంలో కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించడంపై దృష్టి పెట్టింది. ఇందుకోసం ఇటీవలే ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) ను ఆమోదించింది. ఈ పథకం కింద, ప్రైవేట్ రంగంలో మొదటిసారి ఉద్యోగాన్ని పొందినవారికి ప్రభుత్వం మొదటి నెల రూ.15,000 అందిస్తుంది. ఇందుకోసం ప్రభుత్వం దాదాపు రూ.1లక్ష కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ఈ పథకం సుమారు 3.5 కోట్ల ఉద్యోగాలు సృష్టించడంలో సహాయ పడుతుందని మోడీ అన్నారు. తమ ప్రభుత్వం తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. నేడు భారతదేశపు గొప్ప బలాల్లో తయారీ రంగం ఒకటి. దీని ద్వారా పెద్ద సంఖ్య ఉద్యోగాలు సృష్టించబడుతున్నాయి. అందుకే తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఈ సంవత్సరం బడ్జెట్లో మిషన్ మాన్యుఫాక్చరింగ్‌ను ప్రకటించాం. అంతేకాదు మేము మేక్ ఇన్ ఇండియా ప్రచారాన్ని బలోపేతం చేశాము. భారత్‌లో ఎలక్ట్రానిక్స్, మొబైల్ ఫోన్ తయారీ, రక్షణ తయారీ రంగాలు భారీ స్థాయిలో వృద్ధి సాధించాయని మోడీ తెలిపారు. పీఎల్ఐ స్కీమ్ కింద దేశంలో 11 లక్షల ఉద్యోగాలు సృషించామన్నారు. ముఖ్యంగా ఇటీవలి సంవత్సరాల్లో మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్స్ రంగాలు బాగా విస్తరించాయి. నేడు దేశంలో రూ.11 లక్షల కోట్ల విలువైన ఎలక్ట్రానిక్స్ తయారవుతున్నాయి. గత 11 ఏళ్లలో ఈ రంగం 5 రెట్లు ఎక్కువగా వృద్ధిని సాధించింది. గతంలో మొబైల్ ఫోన్ తయారీలో 24 యూనిట్లు మాత్రమే ఉండేవి. కానీ ఇప్పుడు ఇవి 300 యూనిట్లకు పెరిగాయి. ఇందులో లక్షలాది మంది యువత పనిచేస్తున్నారు అని మోడీ చెప్పారు.

ఆపరేషన్ సిందూర్ తర్వాత రక్షణ ఉత్పత్తుల తయారీలో వేగవంతమైన వృద్ధి జరుగుతోందని మోదీ అన్నారు. రక్షణ ఉత్పత్తుల తయారీలో భారత్ కొత్త రికార్డులు సృష్టిస్తోందని మన డిఫెన్స్ ప్రొడక్షన్ ఏకంగా రూ.1.25 లక్షల కోట్లు దాటిపోయిందన్నారు.

## వీసా వస్తే సరిపోదు.. నిబంధనలు పాటించాల్సిందే

# 'బహిష్కరణ ముప్పు'పై యుఎస్ హెచ్చరిక




**వాషింగ్టన్, జూలై 12:** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన నాటినుంచి వలసదారులపై కఠిన వైఖరి అనుసరిస్తున్నారు. ఇప్పటికే వీసాల జారీకి 'సోషల్ మీడియా వెట్టింగ్'ను తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. అయితే, వీసా పొందిన తర్వాత కూడా నిబంధనలు పాటించకపోతే 'బహిష్కరణ ముప్పు' తప్పదని అగ్రరాజ్యం తాజాగా హెచ్చరించింది. ఈ మేరకు భారత్‌లోని యుఎస్ రాయబార కార్యాలయం 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది. 'వీసా మంజూరుతోనే వలసదారులపై స్క్రీనింగ్ ఆగిపోదు. వారి ప్రతి కదలికను నిశితంగా గమనిస్తూనే ఉంటాం. అమెరికా చట్టాలు, ఇమిగ్రేషన్ నిబంధనలను వీసాదారులు తప్పనిసరిగా పాటించాల్సిందే. వాటిని అతిక్రమిస్తే మాత్రం తక్షణం వీసాలను రద్దుచేసి దేశం నుంచి వెళ్లగొడతాం' అని ఎంబసీ తమ పోస్టులో స్పష్టం చేసింది. వీసా దరఖాస్తుదారులు తప్పనిసరిగా తమ ఐదేళ్ల సోషల్ మీడియా ఖాతాలను సమర్పించాల్సి ఉంటుందని ఇటీవల అమెరికా వెల్లడించిన విషయం తెలిసిందే. ఫేస్‌బుక్, లింక్డిన్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌ఖాతాలనూ, అందులో అభ్యర్థులు చేసిన పోస్టులు, కామెంట్లు, వెల్లడించిన అభిప్రాయాలనూ అగ్రరాజ్య అధికారులు పరిశీలిస్తారు. అలా అని వాటిలో ఉన్న పోస్టులు ఏవీ ఇప్పుడు డిలీట్ చేయడానికివీల్లేదు. ఒకవేళ అలా చేసినట్టు కనిపిస్తే పరిశీలన మరింత లోతుగా వెళ్లి తనిఖీచేసే అవకాశం ఉంటుంది. ఈ వివరాలను ఇవ్వకపోతే వీసా తిరస్కరిస్తారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకమైన ఆలో చనలు ఉన్నట్లు కనిపించిన వ్యక్తులను దేశంలోకి రాకుండా చూడటంకోసం ఈ 'సోషల్ మీడియా వెట్టింగ్'ను అగ్రరాజ్యం తీసుకొచ్చినట్లు తెలు స్తోంది.

# సంక్షిప్తంగా..

## ఇరాన్‌లో బాలికపై హత్యాచారం: దోషికి బహిరంగ మరణశిక్ష



**టెహ్రాన్, జూలై 12:** ఓ బాలికను హత్యాచారం చేసిన కేసులో దోషిగా తేలిన వ్యక్తికి ఇరాన్ అధికారులు బహిరంగంగా మరణశిక్ష విధించారు. ఈ మేరకు స్థానిక మీడియా కథనాల మేరకు బుకాన్‌కు చెందిన ఓ బాలికపై అత్యాచారం, హత్య చేసిన కేసులో ఓ వ్యక్తి దోషిగా తేలాడు. అతడికి బహిరంగంగా మరణశిక్ష విధించాలని బాధిత కుటుంబసభ్యులు, ప్రజల నుంచి పెద్ద ఎత్తున అభ్యర్థనలు వచ్చాయి. మార్చిలో అతడికి మరణశిక్ష ఖరారు కాగా సుప్రీంకోర్టు కూడా దాన్ని సమర్థించింది. భావోద్వేగాలతో ముడిపడిన కేసు కాబట్టి కఠినశిక్షపై నిర్ణయం తీసుకున్నామని న్యాయ మూర్తి పేర్కొన్నారు. బాధిత కుటుం బసభ్యుల కోరిక మేరకు శిక్షను విధిస్తున్నట్లు చెబుతూ తాజాగా దాన్ని అమలు చేశారు.

## భర్త సెల్‌ఫోన్ చోరీకి భార్య సుపారీ..

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఇద్దరు వ్యక్తులు వున్నట్లుండి అతన్ని అడ్డగించి సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు. దీనిపై బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేసి, సెల్‌ఫోన్ చోరీ చేసిన నిందితుల్లో ఒకరిని అరెస్టు చేసి విచారించగా అదిరిపోయే ట్విస్ట్ వెలుగు చూసింది. సెల్‌ఫోన్ చోరీ చేయమని బాధితుడి భార్య తమకు సుఫారి ఇచ్చిందని నిందితుడు వాంగ్మూలం ఇవ్వడంతో పోలీసులు షాక్‌కు గురయ్యారు. బాధితుడి భార్య కొంతకాలంగా మరో వ్యక్తితో అక్రమ సంబంధం కొనసాగిస్తోంది. అయితే ప్రియుడితో సదరు మహిళ సన్నిహితంగా వున్న ఫోటోలను ప్రియుడు చిత్రీకరించి వాటిని తన సెల్‌ఫోన్‌లో దాచుకున్నాడు. దీని తరువాత తనతో అక్రమ సంబంధం నడిపే మహిళకు పంపాడు. దీంతో పాటు ఆమె భర్తకు కూడా పంపాడు. దీంతో సదరు మహిళ తన అక్రమసంబంధం వ్యవహారంకుటుంబ సభ్యులకు తెలిసిపోయి పరువుపో యేలా వుందని భావించి తన భర్త సెల్‌ఫోన్‌ను దొంగిలించాలని ఇద్దరువ్యక్తులకు సుఫారి ఇచ్చింది. సుఫారి తీసుకున్న నేరగాళ్లు సెల్‌ఫోన్‌ను దొంగిలించారు కానీ నిజాలను మాత్రం పోలీసులకు చెప్పేశారు. ఈకేసులో సెల్‌ఫోన్‌ను దొంగిలించిన నేరగాళ్లలో ఒకడితో పాటు సుఫారి ఇచ్చిన మహిళను పోలీసులు అరెస్టు చేశారు.

## జీతాలు సరిపోవడంలేదు: ఎంపి కంగనా రనౌత్



**సిమ్లా, జూలై 12 :** రాజకీయ నాయకుల వేతనాలపై ఎంపీ కంగనా రనౌత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, రాజకీయాల్లో నిజాయితీగా పని చేసే ఎంపీలకు వేతనం సరిపోవడం లేదని అన్నారు. తమతో ఉండే సిబ్బందికి జీతాలు ఇచ్చిన తర్వాత ఎంపీలకు మిగిలేది అంతంత మాత్రమేనని అన్నారు. ప్రజాప్రతినిధులు, పీఏలతో కలిసి నియోజకవర్గాలకు వాహనాలలో వెళ్లేందుకు లక్షల రూపాయలు ఖర్చవుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశం కనీసం 300 నుండి 400 కిలోమీటర్ల దూరంలో ఉండటమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. రాజకీయాలు చాలా ఖర్చుతో కూడుకున్నవని ఆమె అభిప్రాయపడ్డారు. ఎంపీలకు వచ్చే వేతనం ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. అందుకే మరో ఉద్యోగం చేసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ఇప్పటికే చాలామంది ఎంపీలకు వ్యాపారాలు ఉన్నాయని, కొందరు న్యాయవాద వృత్తిలో ఉండగా, ఇంకొందరు ఇతర వృత్తుల్లో ఉన్నట్లు చెప్పారు.

# రైతు పొలంలో పురాతన నాణేలు!



**రాయ్‌బరేలి, జూలై 12:** ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ జిల్లా మోరవాన్ తహసీల్‌లోని బైజనాథ్ ఖేడా గ్రామంలో ఆశ్చర్యకర ఘటన వెలుగు చూసింది. జూలై 6వ తేదీ మధ్యాహ్నం గ్రామానికి చెందిన యూసుఫ్ అనే రైతు పొలంలో మేకలు మేపుతోన్న కాపరులు అకస్మాత్తుగా మట్టిలో ఏదో మెరుస్తూ ఉండటాన్ని గమనించారు. దగ్గరగా వెళ్లి చూసేసరికి అవి పాత నాణేలుగా అనిపించాయి. అక్కడే పక్కనే పాత విగ్రహం ముక్కలు, ఇటుకల భాగాలూ కనిపించాయి. వెంటనే గ్రామస్థులు ఈ విషయాన్ని స్థానిక అధికారులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న పురాతత్వశాఖ జోక్యం చేసుకొని అధికారికంగా ఆ పొలాన్ని అధీనంలోకి తీసుకుంది. అక్కడి చుట్టూ బ్యారికేడింగ్ వేసి ప్రజల రాకపోకలపై తాత్కాలిక నిషేధం విధించారు. ఈ ప్రాంతంలో పరిశోధనలు జరిపేందుకు లక్నో కేంద్రంగా పని చేసే పురాతత్వశాఖ బృందం రంగంలోకి దిగింది.

13-7Pg6exHMNWJQE.qxd:13-7Pg6exHMNWJQE.qxd 13/07/25 11:56 PM Page 1



# హాస్టల్ విద్యార్థులకు తల్లిదండ్రులు సంక్షేమ అధికారులే

## - ఆకస్మిక తనిఖీ చేస్తాం.. అలసత్వం వద్దు: కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**విజయవాడ,జూలై 12,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు సంక్షేమ అధికారులు తల్లిదండ్రులతో సమానమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. విద్యార్థులు మెరుగైన విద్యను అభ్యసించడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివేలా సంక్షేమ అధికారులు కృషి చేసినప్పుడు విద్యార్థి జీవితాంతం గుర్తించు కుంటారన్నారు., సంక్షేమ అధికారులు జీవితంలో మధురానిభూతి పొందగలుగుతారన్నారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమ, గురుకుల వసతి గృహాల నిర్వహణపై ఆయా శాఖల జిల్లా అధికారులు, సహాయ సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులతో కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 34 సాంఘీక సంక్షేమ వసతి గృహాలలో 2218 మంది, 26 వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలలో 1259 మంది, 3 వెనుకబడిన తరగుతుల సంక్షేమ వసతి గృహాలలో 341 మంది,2 మైనార్టీ సంక్షేమ వసతి గృహాలలో 64 మంది విద్యార్థులు ప్రస్తుతం విద్యను అభ్యసిస్తున్నారన్నారు. వసతి గృహాలలో వందలాది మంది పేద విద్యార్థుల భవిష్యత్ వసతి గృహ సంక్షేమ అధికారులపై ఆదారిపడి ఉంటుందన్నారు. సంక్షేమ అధికారులు అత్యంత భాధ్యతతో విద్య ఆరోగ్యం క్రమశిక్షణ వంటి విషయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా వసతి గృహ నిర్వహణలో పచ్చదనం, పరిశుభ్రత, పారిశుద్యానికి అత్యంత ప్రాదాన్యతనిచ్చి నిర్వహించినప్పుడు విద్యార్థులలో మానసిక ఉల్లాసం పెరిగి ఆరోగ్యంతో పాటు మెరుగైన విద్యను అభ్యసించేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. విద్యార్థులకు వసతి గృహాలలో కిచెన్ షెడ్ల నిర్వహణను నిశితంగా పరిశీలించాలని ప్రతి వసతి గృహంలోను ఎటిఎం కిచెన్ గార్డెన్‌ను నిర్వహించాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని వసతి గృహాల పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని దోమ తెరలను తప్పక ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఇందుకు మెడికల్ అధికారులు తప్పనిసరిగా హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు తాగునీటిని సరఫరా చేసే ఆర్వో ప్లాంట్‌లు, ఓవర్ హెడ్ ట్యాంకు లను ఎప్పటికప్పుడు శుభ్రపరచి ట్యాంకులపై మూతలు ఏర్పాటు చేయాలన్నారు. వసతి గృహాల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా అధికారుల దృష్టికి తీసుకురావాలని, హాస్టల్ మరమత్తులకు సంబంధించి తగు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. హాస్టల్ ప్రాంగణంలో ఉపాధి హామి పథకం ద్వారా కంపోస్ట్ పిట్స్, సోక్‌పిట్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని రెండు ఎకరాలకు పై బడి స్థలం గల వసతి గృహాలలో ఫాంపాండ్స్ ఏర్పాటు చేస్తామన్నారు.



పివి నరసింహారావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణారావు, చీఫ్ సెక్రటరీ శ్రీనివాసరావు, సురభివాణి

# పివి నరసింహారావు సేవలు చిరస్మరణీయం

## మాజీ ప్రధాని విగ్రహాన్ని ఆవిష్కరించిన తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణ రావు, చీఫ్ సెక్రటరీ శ్రీనివాసరావు, సురభివాణి

**హిందూపురం టౌన్ జులై 12 ప్రభాతవార్త** దేశానికి మాజీ ప్రధాని పీ.వీ నరసింహారావు అందించిన సేవలు చిరస్మరణీయమని తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రెటరి రామకృష్ణ రావు, చీఫ్ సెక్రటరి శ్రీనివాసరావు, పీవీ నరసింహారావు కుమార్తె సౌరబివాణిలు అన్నారు. శనివారం శ్రీసత్యసాయి జిల్లాలోనిపరిగి మండలం కొడిగెనహళ్లి ఏపీఆర్జేసీ పాఠశాలలో పీవీ నరసింహారావు కాంస్య విగ్రహాన్ని తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రెటరీ రామకృష్ణ రావు, చీఫ్ సెక్రటరీ శ్రీనివాసరావు, పీవీ నరసింహారావు కుమార్తె సౌరబివాణిలు ముఖ్య అతిథులుగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ఆర్థిక సంస్కరణ కర్త మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ గురుకుల విద్యాలయాల స్థాపకర్త భారత మాజీ ప్రధాని భారతరత్న పి.వి నరసింహారావు విగ్రహావిష్కరణలో పాల్గొనడం చాలా సంతోషంగా భావిస్తున్నామని తెలిపారు, మేమంతా ఇదే పాఠశాలలో చదువుకొని ఇంతటి స్థాయికి వచ్చామని తెలిపారు 50 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఈ విద్యాలయాల్లో మాలాంటి వాళ్ళు ఎంతోమంది జీవితాలు పాఠశాలలు బాగు చేశాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి దేశానికి విద్యాశాఖ మంత్రిగా, రక్షణ మంత్రిగా, విదేశాంగ మంత్రిగా, దేశ ప్రధానిగా ఆయన సేవలు ఎప్పటికీ మరువలేనివని కోట్ల మంది విద్యార్థులను బాగు చేయడమే కాకుండా దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆర్థిక సంస్థానంలో భాగంగా దశ దిశను మార్చిన గొప్ప వ్యక్తి పి.వి నరసింహా రావు అని అన్నారు.

# చెన్నైలో శ్రీకాళహస్తికి చెందిన రాయుడు మృతి!

## హత్యకేసులో జనసేన ఇన్‌చార్జి, ఆమె భర్త అరెస్టు



జనసేన ఇన్‌చార్జి వినూత, భర్త చంద్రతో రాయుడు(మధ్యలో)

**శ్రీకాళహస్తి,జూలై 12 ప్రభాతవార్త** చెన్నైకు సమీపంలోని కూపం నదిలో మూడు రోజుల క్రితం చెన్నై పోలీసులు కనిపెట్టిన గుర్తుతెలియని శవం శ్రీకాళహస్తి వాసిదిగా చెన్నై పోలీసులు శనివారం గుర్తించారు.ఈ హత్యకు సంబంధించి ఐదుగురిని అరెస్టు చేసారు. వారిలో శ్రీకాళహస్తి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినూతకోట,ఆమె భర్త చంద్రకోట,శ్రీకాళహస్తికి చెందిన శివకుమార్, గోపి దాసర్‌లను అదుపులో తీసుకున్నట్లు చెన్నై పోలీసులు శనివారం ప్రకటించారు. చెన్నైలో ఈ నెల 8న చెన్నై పోలీసులు గుర్తించిందని శ్రీకాళహస్తికి చెందిన శ్రీనివాసులు అనే రాయుడుగా ధృవీకరించారు.చెన్నై సెవెన్ హిల్స్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.మృతుడు రాయుడు చేతిపై పచ్చబోట్టులో వినూత పేరు ఆధారంగా మృతుని గుర్తించినట్లు ప్రకటించారు.అయితే చెన్నై పోలీసులు ధృవీకరణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి ఎస్‌పి హర్షవర్ధన్ రాజును సంప్రదించగా ఆయన రేణిగుంట పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. ఈ నేపధ్యంలో వారు విచారించారు. రాయుడు బొక్కసం పాళెం స్వగ్రామం కాగా సుమారు 10 సంవత్సరాలుగా రేణిగుంటలోని బీడికాలనీలో అక్కతో నివాసముంటున్నట్లు తెలిసింది. రాయుడుకు తల్లిదండ్రి ఉన్నారు.వారు శనివారం చెన్నై బయలు దేరి వెళ్ళారు.రాయుడు మృతదేహం చెన్నైలోని కూపం నది 4వ గేటు వద్ద ఎంఎస్‌నగర్ హౌసింగ్ బోర్డు కాలనీ వెనుక మృతదేహం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసారు. దాంతో విషయం బయటపడింది. మృతుని చేతి మీద ట్యాటు ఆధారంగా మారింది దాంతో పోలీసులు సమీపంలోని సిసి ఫుటేజిల ను పరిశీలించారు.అందులో కారు నెంబర్ ఆధారంగా కూపి లాగారు దాంతో అసలు విషయం బయటకు వచ్చింది.అయితే ఈ కేసుకు సంబంధించి పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.అయితే రాయుడును హత్య ఎక్కడ జరిగిందనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

### హత్య కేసులో ఆరోపణలు, శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జి కోట వినుతపై పార్టీ అధిష్టానం చర్యలు

శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జి కోట వినుతను ఆ పార్టీ బహిష్కరించింది. ఆ మేరకు పార్టీ అధ్యక్షుడు,ఏపీ ఉపముఖ్యమంత్రి ఆదేశాల కీలక నిర్ణయం తీసుకున్నారు. నిందితులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు.వినుతను ఆమె భర్తను పార్టీ నుంచిబహిష్కరించారు, శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాళానికి చెందిన శ్రీనివాసులు అలియాస్ రాయుడు చెన్నైలో మృతి చెందాడు. కోట వినుత వద్ద అతను డ్రైవర్‌గా పనిచేసేవాడు.

# జగన్మాతకు పెద్దఎత్తున భక్తుల ఆషాఢం సారె

**ఇంద్రకీలాద్రి, జూలై 12, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయానికి త్వరితంగా భక్తులు చేరుకోడానికి వీలుగా అన్ని శాఖలతో కలిసి సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని ఇఓ వికె శీనా నాయక్ అన్నారు. శనివారం దేవస్థానంలో ఆయన నగర పోలీస్ అధికారులు, దేవస్థానం అధికారులు, సిబ్బంది, వైదిక సిబ్బందితో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ హైదరాబాద్ తదితర ప్రాంతాలనుండి కొన్ని గంటల్లోనే వచ్చే భక్తులు కుమ్మరి పాలెం నుండి దేవస్థానానికి రావడానికి ఎక్కువ సమయం పడుతోందని చేసిన ఫిర్యాదులను దృష్టిలో వుంచుకుని దేవస్థానానికి చేరుకోడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టోల్‌గేట్ మార్పు, మున్సిపల్ ఆఫీస్ వద్ద హోల్డింగ్ ఏరియా అభివృద్ధి, కనకదుర్గానగర్, దుర్గాఘాట్లలో ఇన్ఫర్‌మేషన్ సెంటర్ ఏర్పాట్లు, భక్తుల సౌకర్యార్థం పాలనా వికేంద్రీకరణ, కొండదిగువన పలు సౌకర్యాల ఏర్పాటు గురించి పోలీస్ అధికారులకు ఇఓ వివరించారు. కొండదిగువన ఆధ్యాత్మిక వాతావరణం ప్రతిఫలించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు జి రామకృష్ణ, దుర్గారావు, దేవస్థానం ఇఇ కోటేశ్వరరావు, ఏఇఓ రంగారావు తదితరులు పాల్గొన్నారు. జగన్మాత దుర్గమ్మ వారికి శనివారం భక్తబృందాలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆషాడం సారెను సమర్పించారు. మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ పలు ప్రాంతాలకు చెందిన బృందాలు, ఉత్తరాంధ్ర భవానీ దీక్షా సేవా పీఠం అధ్యక్షులు పులపా మల్లేశ్వరరావు గురుభవానీ ఆధ్వర్యంలో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం తదితర ప్రాంతాలనుండి 1000 మంది భక్తులు తమ ఇంటి ఆడపడుచుగా భావించి దుర్గమ్మవారికి సారె సమర్పించారు. ఆషాడం సారె సమర్పించిన భక్తుల బృందాలకు దుర్గమ్మవారి దర్శనంఏర్పాటు చేసిన అధికారులు అన్నప్రసాదాలు అందించారు. దుర్గమ్మవారికి రాజమండ్రికి చెందిన శ్రీ లలిత కళాప్రియ నృత్యనికేతన్ నాట్యాచారిణి కె నవ్య ఆధ్వర్యంలో 20 మంది శిష్యబృందం కూచిపూడి శైలి నృత్యనీరాజనం అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శనం కల్పించిన అనంతరం ప్రసాదం, మెమెంటోలు అందించారు.



సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న ఇఓ

# రెవెన్యూ సమస్యలకు మెరుగైన పరిష్కారం

## - భూపరిపాలన ముఖ్యకార్యదర్శి జయలక్ష్మి

**నెల్లూరు కలెక్టరేట్, జూలై 12, ప్రభాతవార్త** తహశీల్దార్లు కార్యాలయాలకే పరిమితం కాకుండా గ్రామాల్లో పర్యటించినప్పుడే సమస్యలకు మెరుగైన పరిష్కారం చూపగలుగుతారని భూపరిపాలన ముఖ్యకార్యదర్శి జయలక్ష్మి అన్నారు. శనివారం నెల్లూరు నగర పర్యటనకు విచ్చేసిన ఆమె, కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ఆనంద్‌తో కలిసి తహశీల్దార్లతో రెవెన్యూ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా రీసర్వే, నీటిపన్నుల వసూళ్ళ, పిజిఆర్ఎస్ అర్జీల పురోగతి, హౌసింగ్ ఫర్ ఆల్ మొదలైన రెవెన్యూ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా భూపరిపాలన ముఖ్యకార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ తహశీల్దార్లందరూ ప్రజలకు దగ్గరగా వెళ్లినప్పుడే సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయన్నారు. విధుల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. ప్రధానంగా రీసర్వే చేపట్టిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పిఎంను త్వరగా విడగొట్టి వ్యక్తిగతంగా పాసుపుస్తకాలు ఇవ్వాలన్నారు. జాయింట్ ఎల్‌పిఎంగా నమోదు చేయడం వల్ల చాలామంది రైతులు ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారన్న ఆమె, తల్లికివందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అర్హులైన రైతులకు అందించేందుకు వెంటనే జాయింట్ ఎల్‌పిఎం సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. వచ్చేవారంలోగా జాయింట్ ఎల్‌పిఎం సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. రీసర్వే సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో ప్రజలు అందిస్తున్న ప్రతి అర్జీని క్షుణ్ణంగా చదివి నిర్ణయం తీసుకోవాలన్నారు. పరిష్కారం చేయకుండా తిరస్కరించిన అర్జీలను ఆడిట్ టీమ్‌లు మరొకసారి పరిశీలించాలన్నారు. ప్రతి అర్జీని నిశితంగా చదివి అర్థం చేసుకుంటే నాణ్యమైన పరిష్కారం చూపవచ్చని, ఒకవేళ పరిష్కారం కాకపోతే ఎందుకు పరిష్కారం కావడం లేదో అర్జీదారునికి ఓపిగ్గా వివరించాలని చెప్పారు. నీటితీరువా పన్నుల వసూళ్లలో ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఆర్డీవోలు రెవెన్యూ అంశాల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, మండలాల వారీగా తహశీల్దార్లతో సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. కాస్త మనసుపెట్టి ఆలోచన చేస్తే ప్రజలకు రెవెన్యూ సేవలు సంతృప్తిగా అందించగలుగుతామని ఉద్బోధించారు.

# కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కల్యాణం



**రాపూరు, (నెల్లూరు) జూలై 12ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం గోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మీ,చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్ఛరణలతో కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చిఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, ఆధ్వర్యంలో సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు.స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు గుండ్లూరు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

# భక్తజనసంద్రంగా వాడపల్లి క్షేత్రం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో ,జూలై 12,(ప్రభాత వార్త)** ఏడువారాల క్షేత్రంగా భక్తజనం అలారారుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయానికి మునుపెన్నడు రానంత భక్తులు రావడంతో క్షేత్ర పరిసరాలు జనసంద్రంగా మారాయి. నెలలో రెండో శనివారం సెలవ రోజు కావడంతో లక్షకు పైగా భక్తులు తరలి రావడంతో స్వామివారికి రికార్డు స్థాయిలో రూ 72లక్షలకు పైగా ఆదాయం సమాకూరింది. దీంతో తెల్లవారుజాము నుండి ఆలయ పరిసరాలన్నీ కిక్కిరిసాయి. వేకువజామున 3 గం టలకు సుప్రభాత సేవ, తొలి హారతితో ప్రారంభమైన భక్తుల రద్దీ., రాత్రి 10 గంటలవరకు కొనసాగింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అత్యధికంగా తరలివచ్చారు. స్వామి వారిని, భక్తి శ్రద్ధలతో దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఒక్కరోజే.. లక్షకు పైగా భక్తులు స్వామివారిని దర్శించు కోగా.. 40వేలమంది అన్నప్రసాదాన్ని స్వీక రించారు. వాహనాలతో పార్కింగ్ ప్రాంతమంతా కిక్కిరిసింది. ప్రత్యేక దర్శనాలు తది తర ద్వారా.. స్వామివారికి 72 లక్షల వరకూ ఆదాయం సమకూరింది. భక్తులకు చలివేంద్రం మజ్జిగ చంటి పిల్లలకు పాలు బిస్కెట్లు పంపిణీ చేశారు. వివిధ జిల్లాల నుండి ఆర్టిసి అధికారులు ప్రత్యేక బస్సులను నడిపారు.

# చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

## - సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను పంపిణీ చేస్తున్న జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు.

**చిత్తూరు, జులై 12 ప్రభాతవార్త:** రాష్ట్రాభివృద్ధి సిఎం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకపోయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సిఎం నారా చంద్రబాబునాయుడు ఒకొక్కటి అమలు చేసి ఇది మంచి ప్రభుత్వం అని ప్రజల చేత మన్ననలు పొందుతున్నారని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజూరులో శనివారం జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను కాజూరు ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కావడంతో సిఎం నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయడానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటికే పెన్షన్ల మొత్తం పెంచి లబ్దిదారులకు ప్రతి నెలా ఒకటవ తేదీ పంపిణీ చేస్తున్నామని, నిరుపేదల ఆకలి తీర్చడానికి పట్టణ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్ల ఏర్పాటు చేశామని, తల్లికి వందనం పథకంలో భాగంగా కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు వుంటే అంత మంది తల్లుల ఖాతాలో నిధులు జమ చేయడం జరుగుతోందని, అలాగే మహిళలకు ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇస్తున్నామన్నారు. ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం అమలుకు సిఎం నారా చంద్రబాబునాయుడు శ్రీకారం చుడ్తున్నారన్నారు. రాష్ట్రంను అగ్రపథంలో తీసుకెళ్ళడం ఒక్క సిఎం నారా చంద్రబాబునాయుడుకు మాత్రమే సాధ్యమవుతుందన్నారు

# తిరుపతి - చిక్కమగళూరు మధ్య నూతన రైలు ప్రారంభం

## - కుప్పం స్టేషన్‌లో పూజలు చేసిన నేతలు !!

**కుప్పం, జూలై 12 ప్రభాతవార్త** కర్ణాటకలోని చిక్కమంగళూరు - తిరుపతి నగరం మధ్య నూతనంగా ప్రవేశ పెట్టిన వీక్లీ ట్రైన్ ప్రారంభమైంది. శుక్రవారం రాత్రి కుప్పంలో కూటమి నేతలు ఈరైలుకు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా పైలట్, లోకోపైలట్‌ను ఘనంగా సత్కరించారు. ఈ ట్రైన్ ప్రతి గురువారం రాత్రి 9గంటలకు తిరుపతిలో బయలుదేరి కుప్పానికి శుక్రవారం వేకువజామున 1గంటకు చేరుతుంది. ఉదయం 3.05గంటలకు బెంగళూరు, 10.30గంటలకు చిక్కమంగళూరుకు చేరుతుంది. అలాగే శుక్రవారం సాయంత్రం 5.30గంటలకు చిక్కమంగళూరులో బయలుదేరి శనివారం అర్ధరాత్రి 12.30గంటలకు కుప్పం, తిరుపతికి ఉదయం 7.40గంటలకు చేరుతుంది. ఈ రైలు కుప్పంలో ఆగేందుకు కృషి చేసిన సిఎం చంద్రబాబునాయుడు, రైల్వేశాఖ మంత్రులు అశ్విని వైష్ణవ్, సోమన్న, ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, ప్రతాప్, జాకీర్, తులసినాథ్, నరేష్, శ్యాంసుందర్, మంజు, చంద్ర, చాంద్, నాగరాజు, మంజునాథ, మురళి గుప్తా, సాయిమాతా ట్రస్ట్ వ్యవస్థాపకులు ఉన్నారు.

# మోడీ 11 యేళ్లపాలనలో అభివృద్ధి శూన్యం

## - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

**గుంతకల్లు, జూలై 12 ప్రభాతవార్త** దేశ ప్రధాని నరేంద్రమోడీ 11 ఏళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సలహా పాటించి ఆయన రిటైర్మెంట్ తీసుకుంటే బాగుంటుందని సూచించారు. శనివారం అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. తాము ఎప్పుడూ వ్యతిరేకించే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌ను ఒక్క విషయంలో మాత్రం ఏకీభవిస్తున్నామన్నారు. 75 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న మోడీకి రిటైర్మెంట్ కావాలని సలహా ఇవ్వడం సరైనదేనన్నారు. మోడీ పాలనలో పేదరికం, నిరుద్యోగం, రైతు సమస్యలు రెట్టింపు అయ్యాయన్నారు. నల్లధనాన్ని బయటకు తీస్తానన్న మోడీ మాట తప్పారని మండిపడ్డారు. ఆర్థిక విషయాల్లో జపాన్‌ను అధికమించామంటూ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా వుందన్నారు. రాజధాని అమరావతి కోసం చంద్రబాబు 32 వేల కోట్లు అప్పు చేసి, మరో 30 వేల కోట్లు అప్పు చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఇప్పటికే ఈ ఏడాది లక్ష కోట్లు అప్పు చేశారని గుర్తు చేశారు. అప్పులు చేయడంలో కూటమి ప్రభుత్వం దేశంలోనే ముందంజలో వుందని ఎద్దేవా చేశారు. అప్పటి ప్రభుత్వంపై అప్పులపై నిప్పులు చెరిగిన చంద్రబాబు ఇప్పుడు ఎలా విచ్చలవిడిగా అప్పులు చేస్తున్నారని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లను పగలగొట్టమని చెప్పిన బాబు ఇప్పుడు ఎలా ఒప్పుకుంటున్నారని ధ్వజమెత్తారు. అధికారం వుంటే ఒకలాగా లేకుంటే మరోలాగా వ్యవహరించడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. గోదావరి బనకచెర్ల ప్రాజెక్టుకు 2 లక్షల కోట్లు అవసరమైతే కేవలం 86 వేల కోట్లతో అంచనా వేయడం దేనికి సంకేతమన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయమంటే కొత్తవి కడతామని చెప్పడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. ఆగస్టు నెలలో జరగనున్న రాష్ట్ర మహాసభల్లో భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని ఆయన తెలిపారు.

# ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : మంత్రి నారాయణ

**నెల్లూరు, జులై 12, ప్రభాతవార్త-వైద్యం** ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ హెచ్చరించారు. శనివారం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కార్పొరేషన్ ఇంజనీరింగ్, ప్రజారోగ్యశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ నెల్లూరుని సమస్యలు లేని నగరంగా మార్చాలని అందుకు అధికారులు నైతిక బాధ్యత వహించాలన్నారు. కార్పొరేషన్ పరిధిలో సమస్యూలు లేకుండా చూడాలన్నారు. నగర వాసులు పురమిత్ర యాప్ ద్వారా అప్లోడ్ చేసిన సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కార మార్గం చూడాలన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, కలుషిత నీరు వస్తుందని ఫిర్యాదు అందిన వెంటనే ఆ సమస్యను సత్వరమే పరిష్కారించాలన్నారు. డ్రైన్ల పూడికతీత పనులపై నిత్యం పర్యవేక్షణ పెట్టాలని అధికారులకు తెలియజేశారు. మంచినీటి పైపులైన్ కోసం తవ్విన రోడ్ల మరమ్మత్తుల పనులను తక్షణమే చేపట్టాలని, పార్కులు, ఎండ్‌లు, ఎండ్ సీసీ రోడ్లు త్వరగా పూర్తి చేయాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఏ సమస్య కూడా నా వరకు రాకుండా చేసినప్పుడే అధికారులు భాగా పని చేసినట్టన్నారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని చర్యలు తప్పవని సుతిమెత్తగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, టీడీపీ ముఖ్యనేతలు, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామిని దర్శించుకున్న కేంద్ర మంత్రి



**గుంతకల్లు, జూలై 12 ప్రభాతవార్త** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామిని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజ్ శ్రీనివాస్‌వర్మ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, వేద పండితులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలు అందచేశారు. ఆయన వెంట స్థానిక బిజెపి నాయకులు వున్నారు.

# రూ.50 లక్షల విలువైన 250 సెల్‌ఫోన్లు రికవరీ: ఎస్పీ మణికంఠ చందోలు

**చిత్తూరు, జులై 12 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా పోలీసులు చాట్‌బాట్, సిఇఐఆర్ పోర్టల్ ద్వారా ప్రస్తుతం 50 లక్షల రూపాయల విలువైన 250 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. చిత్తూరు పోలీసు గెస్ట్‌హౌస్‌లోని కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఎస్పీ మణికంఠ చందోలు మొబైల్ రివకరీ మేళాను ఏర్పాటు చేసి 12వ దశలో రికవరీ చేసిన 250 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పోలీసులు ఇప్పటి వరకు 12 దశల్లో 7.92 కోట్ల రూపాయల విలువైన 3,791 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందన్నారు. మొదటి దశలో 500, 2వ దశలో 200, 3వ దశలో 300, 4వ దశలో 200, 5వ దశలో 300, 6వ దశలో 200, 7వ దశలో 330, 8వ దశలో 305, 9వ దశలో 300, 10వ దశలో 450, 11వ దశలో 456, 12వ దశలో ప్రస్తుతం 250 మొబైల్ ఫోన్లను రికవరీ చేయడం జరిగిందని వివరించారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర రాష్ట్రాల నుండి మొబైల్ ఫోన్లను రికవరీ చేశామన్నారు. బాధితులకు మొబైల్ ఫోన్లను రికవరీ చేసి ఇవ్వడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారని, మొబైల్ ఫోన్లపై ఫిర్యాదులు అందుతున్నాయన్నారు.



## బిసిలపై కాంగ్రెస్ మళ్లీ కుట్ర చేస్తోంది

### 42 శాతం రిజర్వేషన్ల అమలుపై స్పష్టత లేదు

**బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్**

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలను మళ్లీ మోసం చేయాలని కుట్ర చేస్తుందని బిజెపి శాసనసభ్యుడు పాయల్ శంకర్ అన్నారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బిసి రిజర్వేషన్ల అమలు విషయంపై నుంచి స్పష్టత లేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లపై పూర్తి స్పష్టత ఇవ్వాలన్నారు. గతంలో ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌లో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఇద్దరు బిసిలకు టికెట్లు ఇస్తామని చెప్పి, ఆ హామీని కాంగ్రెస్ తుంగలో తొక్కిందన్నారు. బిజెపి బిసి రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు ప్రకటించిందన్నారు. శాసనసభలో కూడా మద్దతుగా నిలిచిందన్నారు. సంవత్సరన్నర పాలనలో కామారెడ్డి డిక్లరేషన్ హామీల అమలు గాలికొదిలేశారని, ప్రతి ఏడాది రూ.20 వేల కోట్లు బిసి సబ్‌ప్లాన్ కింద ఇవ్వాలని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు ఆ నిధుల సంగతే లేదన్నారు. బిసిలను మోసం చేస్తే, ప్రజల ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ సమావేశం ఏర్పాటు చేసి, 42శాతం రిజర్వేషన్లపై చర్చ జరపాలని డిమాండ్ చేశారు.

## పవర్ షేరింగ్ కాదు.. పర్సంటేజీల షేరింగ్‌లో కాంగ్రెస్ మంత్రులు నిమగ్నం


**బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్**

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** మంత్రులు పవర్ షేరింగ్ కాదు.. పర్సంటేజీల షేరింగ్‌లో మాత్రమే నిమగ్నమయ్యారని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ అన్నారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై అధిష్ఠానం సంతృప్తిగా ఉందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొనడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నదన్నారు. వాస్తవానికి 19 నెలల పాలనలో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం జరగకపోయినా, అధిష్ఠానం మాత్రం సంతృప్తిగా ఉంది. కారణమేంటంటే వాళ్లకు కావాల్సిన వాటాలు, కోటాలు సకాలంలో, సరైన రీతిలో అందుతున్నాయి తప్పితే మరేం కాదన్నారు. దీన్ని చూసే కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రైజింగ్ అంటున్నట్లుగా ఉందన్నారు. ఇక్కడ అసలు ప్రశ్న ప్రజలు సంతృప్తిగా ఉన్నారా? ప్రభుత్వ పనితీరు నిజంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉందా? అనేది ముఖ్యం అన్నారు. ఇక కాంగ్రెస్ మంత్రుల పనితీరును పరిశీలిస్తే, ఇటీవలే ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ తెలంగాణకు వచ్చారని, మంత్రుల పనితీరు, అభివృద్ధి రిపోర్టులను పరిశీలించగా చాలా మంది మంత్రులు "బిలో పాస్" మార్కులతో ఉన్నారని అర్థమైందని తెలుస్తుందన్నారు. అంటే రాష్ట్ర మంత్రుల పనితీరు పూర్తిగా అసంతృప్తికరంగా ఉన్నట్టు వారికి బాగా అర్థమైంది.అందుకే ఢిల్లీ అధిష్ఠానం కాంగ్రెస్ మంత్రులను ఒక్కొక్కరిని పిలిపించి మాట్లాడుతుందన్నారు. ఈ సిరీస్‌లో భట్టి విక్రమార్క సైతం వెళ్లారన్నారు. తాను చేసిన పనితీరు, తన పదవి [illegible] ఉంచుకునే ప్రయత్నం కిందే జరుగుతున్నదని స్పష్టంగా అర్థమవుతుందన్నారు.

## బిజెపి నేతలపై డిప్యూటీ సిఎం భట్టి ఆరోపణలు చేయడం దౌర్భాగ్యం

**బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్**

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** డిప్యూటీ సిఎం పదవిలో ఉండి ప్రభుత్వాన్ని నడపలేక, ప్రజలకు హామీలు నెరవేర్చలేకపోతున్న భట్టి విక్రమార్క బిజెపి నాయకులపై ఆరోపణలు చేయడం దౌర్భాగ్యం అని బిజెపి తెలంగాణ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. వేముల రోహిత్ మరణాన్ని రాజకీయ లబ్ధికోసం వాడుకోవడమే కాకుండా, ఆ అంశాన్ని అడ్డుపెట్టుకుని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుపై తప్పుడు ఆరోపణలు చేయడం దుర్మార్గ చర్య అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ దిగజారిన రాజకీయాలకు సంకేతమని, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తన స్థాయిని మరిచి మాట్లాడటం బాధాకరంగా ఉందన్నారు. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వ్యక్తిని పిసిసి అధ్యక్షుడిగా చేసి, ఇప్పుడు సిఎం పీఠానికి చేర్చిన కాంగ్రెస్ పార్టీకి నైతికత గురించి మాట్లాడే అర్హతే లేదన్నారు. ఇతర పార్టీ నాయకులపై నిందలు మోపే ముందు కాంగ్రెస్ పార్టీలో ఉన్న అవినీతి నాయకుల గురించి ఆలోచించుకోవాలన్నారు. రాంచందర్ రావు నక్సలైట్ బెదిరింపులు, దాడులు ఎదుర్కొని తీవ్ర గాయాలపాలైన వ్యక్తి అని, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వ్యక్తి అని అన్నారు. అలాంటి నాయకుడిని విమర్శించడం తగదని కాంగ్రెస్ నాయకులను హెచ్చరిస్తున్నామన్నారు. భట్టి విక్రమార్క ఇతర పార్టీల నాయకులపై నిందలు మోపేముందు నేషనల్ హెరాల్డ్ కేసులో బెయిల్ మీద ఉన్న సోనియాగాంధీ, రాహుల్ గాంధీని తొలగించాలని డిమాండ్ చేయాలన్నారు. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడైన రేవంత్ రెడ్డి సిఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేయాలని, కాంగ్రెస్ పాలనలో రైతులు, మహిళలు, యువత అందరూ మోసపోయారన్నారు. ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్కటి సరిగ్గా అమలు కాలేదన్నారు. ప్రజల మద్దతుతో బిజెపి ఎదుగుతుందని, కాంగ్రెస్ నేతలు మాట్లాడే ప్రతి అసత్యానికి ప్రజలే సమాధానం చెబుతారన్నారు. ఆర్థిక మంత్రిగా భట్టి విక్రమార్క రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని అన్నారు. వడ్డీ చెల్లింపులకే అప్పులు తెచ్చే స్థితికి తీసుకువచ్చారు. రాష్ట్రం ఆర్థికంగా విఫలమవుతోందని సత్యాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిన తీరును, కాంగ్రెస్ నాయకుల మాయ మాటల వెనుక కుట్రలను బహిర్గతం చేయడంలో బిజెపి ఎస్సీ మోర్చా సిద్ధంగా ఉందన్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి గత, ప్రస్తుత చరిత్రను, ప్రభుత్వ విధాన వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టేలా ఎస్సీ మోర్చా ఎల్లప్పుడూ ముందుండే దిశగా పనిచేస్తుందన్నారు.



ధర్నాలో ప్రసంగిస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘం వేయాలి

**మహాధర్నాలో ఎంపి ఈటల రాజేందర్ డిమాండ్**

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూలై 12, ప్రభాతవార్త:** ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికై మంత్రివర్గ ఉపసంఘం వేయాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాకు మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేం దర్, ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, పైడి రాకేష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 30 సంవత్సరాలుగా ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం అమలవుతుందనే ఆశతో ఎదురుచూస్తున్నారని అన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల మీద మంత్రివర్గ ఉపసంఘం వేయాలని డిమాండ్ చేశారు. రాజ్యసభసభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ విధానం అన్యాయమని, దీన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల్లో మార్పు రావాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను శాసనసభలో లేవనెత్తుతానని అన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

# దేశ ప్రగతికి యువతే పునాది

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**




కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, అధికారులు

**హైదరాబాద్ (సికిందరాబాద్), జూలై 12, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్వప్నమైన వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను చేరుకోవడంలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమైందని, ఉద్యోగులు శక్తివంచన లేకుండా కృషి చేయాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. సికిందరాబాద్ రైల్ కళారాంగ్‌లో జరిగిన 16వ రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇప్పటివరకు జరిగిన 15 విడతల రోజ్‌గార్ మేళాలో దేశవ్యాప్తంగా 10 లక్షల 50 వేల మందికి నియామక పత్రాలు అందజేశామని, ఈ విడతలో మరో 51వేల మందికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా (సగటున 30 ఏళ్లు) ఉండటం మన దేశానికి ముఖ్యబలమన్నారు. ఇది దేశం పట్ల మన బాధ్యతను మరింతగా పెంచడంతోపాటుగా విస్తృతమైన అవకాశాలకు బాటలు వేసిందన్నారు.

ఈ యువశక్తి సామర్థ్యం కారణంగానే ఇవాళ మనం ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగామన్నారు. మోడీ నేతృత్వంలో కేవలం ఉద్యోగాల కల్పనతోపాటుగా యువతే కొత్త అవకాశాలను సృష్టించేలా సంపూర్ణమైన సహకారాన్ని అందిస్తున్నామన్నారు.

యువత ఉద్యోగాల కోసం వేచి చూసే పాత పద్ధతికి స్వస్తి పలికి వారికి స్టార్టప్స్, స్కిల్లింగ్ వంటి వాటి ద్వారా సాధికారత కల్పిస్తూ ఓ బలమైన వ్యవస్థను నిర్మించే దిశగా ప్రధాని పనిచేస్తున్నారన్నారు. దీని ఫలితంగా 2017 నుంచి 8.5 కోట్ల మందికి కొత్త ఉద్యోగాలొచ్చాయని ఈపీఎఫ్ఓ లెక్కలు తెలియజేస్తున్నాయన్నారు. 2025లోనే 1.13 కోట్ల మంది ఇపిఎఫ్ఒలో చేరారన్నారు. స్టార్టప్ ఇండియా ద్వారా యువతను ఉద్యగ కల్పనకోసం ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా 1.6 కోట్ల మంది యువత నైపుణ్యాభివృద్ధి జరిగిందని వివరించారు.

అంతకుముందు దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్రవాల్ స్వాగత ప్రసంగం చేశారు. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల లోని దక్షిణ మధ్య రైల్వే అధికార పరిధిలో, రైల్వేలతో సహా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు మొదలైన వాటిలో 200 మంది నియామకపత్రాలను అందు కుంటున్నారని ఆయన పేర్కొన్నారు.

## రోహిత్ వేముల దళితుడు కాదని సర్కారే చెప్పింది కదా?

### కుల వివక్షకు గురైనట్లు ఆధారాల్లేవని కోర్టు కేసును ముగించింది

**బిజెపి ఎంపి జి.నగేశ్**

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** హెచ్‌సియు విద్యార్థి రోహిత్ వేముల దళితుడే కాదని ఈ కేసుపై విచారణ చేపట్టిన సైబరాబాద్ పోలీసులే తేల్చారని బిజెపి ఎంపి జి.నగేశ్ అన్నారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కుల వివక్షకు గురైనట్లు ఆధారాల్లేవని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే కోర్టుకు నివేదించారన్నారు. అలాంటప్పుడు ఆత్మహత్యకు బిజెపి అధ్యక్షుడు రాంచందర్ రావుకి ఏం సంబంధం? అంటూ ప్రశ్నించారు. రోహిత్ వేముల కేసులో నమోదైన ఎఫ్ఐఆర్‌లో రాంచందర్ రావు పేరు లేదని, ఆయనపై ఎలాంటి చట్టపరమైన కేసు లేదనే విషయాన్ని పోలీసులే స్పష్టం చేశారన్నారన్నారు.

సుదీర్ఘ విచారణ చేసిన హైకోర్టు ఈ కేసును ముగించిందన్నారు. అయినప్పటికీ రామచందర్‌రావుపై డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆరోపణలు చేయడం దుస్సాహసం అన్నారు. పోలీస్ వ్యవస్థను, కోర్టులను చులకన చేయడమే అన్నారు. రాజ్యాం గానికి కట్టుబడి ఉంటామని ప్రమా ణం చేసి డిప్యూటి సిఎం పదవిలో కొనసాగుతున్న భట్టి విక్రమార్క రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్నారన్నారు. కోర్టు తీర్పులను అంగీకరించలేని నేతలు అధికారంలో ఉండడం ప్రమాదకరమని, గతంలో బిఆర్‌ఎస్ చేసిన ఆరోపణలనే నిన్న భట్టి విక్రమార్క వల్లె వేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కెసిఆర్ కుటుంబంపై ఎన్ని అవినీతి స్కాంలు వచ్చినా తూతూ మంత్రంగా విచారణలు జరుపుతూ అరెస్ట్ చేయకుండా కాంగ్రెస్ నేతలు కాపాడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ పాలనా వైఫల్యాలను ప్రజల నుండి దాచేందుకే కాంగ్రెస్ నేతలు ఇట్లాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ పబ్బం గడుపుతున్నారంటూ మండిపడ్డారు. ఇది కచ్చితంగా ప్రజాస్వామ్యానికి వ్యతిరేక చర్య అని, ఇటువంటి విచ్ఛిన్నకర రాజకీయాలకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెప్పడం తథ్యం అన్నారు.

## తెలంగాణ అస్తిత్వంపై పెరుగుతున్న దాడులు

### నీళ్లు, నియామకాలు, నిధులు అంశాన్ని గాలికి వదిలేశారు

### పాలకుల నిర్లక్ష్యం వల్ల దేశం పటం నుంచి తెలంగాణ మాయమైపోయే ప్రమాదం



శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన తెలంగాణ వికాస సమితి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, డాక్టర్ మాడభూషి శ్రీధర్, గోరటి వెంకన్న తదితరులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూలై 12, ప్రభాతవార్త:** తెలంగాణ అస్తిత్వంపై ఆధిపత్యం కొనసాగుతూనే ఉందని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను పునరుద్ధరించేందుకు తెలంగాణ అస్తిత్వంపై దాడులు జరుగుతున్నాయని సదస్సులో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 'తెలంగాణ అస్తిత్వం-సవాళ్లు, కర్తవ్యాలు'పై రౌండ్‌టేబుల్ సమావేశం ప్రముఖ పాత్రికేయుడు పి. వేణుగోపాలస్వామి అధ్యక్షతన జరిగింది. శాసన మండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రా పెట్టుబడిదారుల ప్రభావం ఇంకా జరుగుతూనే ఉందన్నారు. రాజకీయ శక్తులను ఎదగనీయకుండా అడ్డుకోవడం వంటి సవాళ్లు ఎదుర్కొంటూనే ఉన్నామన్నారు. ఉద్యమ నిర్మాణంలో సాహిత్య, కళాకారులు, భావజాల పరివ్యాప్తం అయిందన్నారు. నేటికి కూడా అన్నిరంగాల్లో తెలంగాణ వ్యతిరేకుల ఆధిపత్య సీమాంధ్ర పెట్టుబడిదారుల ఆధిపత్యం నడుస్తోందన్నారు. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ కోసం ఇటువంటి సంస్థల ద్వారా ప్రజలను మరోసారి చైతన్యవంతులను చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ లేని కుల వ్యవస్థ తెలంగాణలో ఉందని, ఈ ప్రాంతం సస్యశ్యామలం ఉన్న ప్రదేశం, పోరాట చైతన్యాన్ని నిలిపిన ప్రాంతం అని అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమి పూర్వ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఇగోపై దెబ్బ కొట్టేందుకు సీమాంధ్ర పాలకులు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. రాష్ట్రం ఇప్పుడిప్పుడే వచ్చింది అనుకుంటున్న తరుణంలో తెలంగాణ లోగో నుంచి కాకతీయ తోరణం మాయమైపోయిందని, చూస్తుంటాం, పోయినీయ్యిలే అనుకుంటున్న తరుణంలో తెలంగాణ తల్లి చేతుల్లో నుంచి బతుకమ్మ మాయమైపోయిందని, అలాగే చూస్తూ ఊరుకుంటే భారతదేశ పటం నుంచి తెలంగాణ మాయమైపోయే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

కేంద్ర సమాచార పూర్వ కమిషనర్ డాక్టర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఎవరివైపు పోరాడుతుందో తెలియని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా ఎన్నికల సంఘం చట్టాలను పూర్తిగా మార్చివేశారన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమి పూర్వ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, వికాస సమితి ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి స్థాయిలో ప్రాయోజిత పథకాల అమలు

### కేంద్రం నుండి వీలైనన్ని గ్రాంట్లు రాబట్టే యోచన


**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** కేంద్రం అమలు చేస్తున్న ప్రాయోజిత పథకాలను రాష్ట్రంలో పూర్తి స్థాయిలో అమలు చేయాలని తెలంగాణ సర్కార్ యోచిస్తోంది. తద్వారా సాధ్యమైనన్ని ఎక్కువ నిధులను రాబట్టాలనే ప్లాన్‌లో రాష్ట్ర సర్కార్ ప్రయత్నాలు చేస్తోంది. ఇందుకు అనుగుణంగా కేంద్రం నుండి వీలైనన్ని గ్రాంట్లు రాష్ట్రానికి అందేలా ఆర్థిక శాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇప్పటి వరకూ కేంద్ర ప్రాయోజిత పథకాను రాష్ట్రంలో సక్రమంగా అమలు చేయకపోవడంతో పాటు, వాటికి రాష్ట్ర వాటాగా కేటాయించాల్సిన నిధులు జత చేయకపోవడంతో పలు సందర్భాలో కేంద్ర నిధులు మంజూరు కావడం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇక నుండి అటువంటి నిర్లక్ష్యం జరగకుండా సకాలంలో కేంద్ర నిధులకు రాష్ట్ర మ్యాచింగ్ గ్రాంట్లు కలిపి ప్రాయోజిత పథకాల నిధులు సకాలంలో విడుదలయ్యేలా చర్యలు తీసుకోనుంది. ఇందుకు కేంద్రం సింగిల్ నోడల ఏజెన్సీ ద్వారా సిస్టమ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్విక్ ట్రాన్స్‌ఫర్ విధానాన్ని తీసుకొచ్చింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ఆర్థిక శాఖలు, రిజర్వ్ బ్యాంక్‌కు చెందిన ఈ కుబేర్ వ్యవస్థలు కలిసి పనిచేయనున్నాయి. ఆయా ప్రాయోజిత పథకలను అమలు చేసే కేంద్ర శాఖలతో పాటు, రాష్ట్ర శాఖలు ప్రత్యేక ఖతాలను తెరచి వాటి ద్వారా లావాదేవీలు నిర్వహిస్తాయి. ఈ విధానం అమలు కోసం రాష్ట్రంలో ఖజానా శాఖలో ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు చేశారు.

## ఉద్యోగుల శ్రమదోపిడీ కోసం పని పది గంటలా?

### ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు

**ఎఐబిఇఎ ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటాచలం**

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** సామాన్య ప్రజలకు సేవలందించేందుకు జాతీయకరణ చేసిన బ్యాంకులను పాలకులు క్రమంగా ప్రజలకు దూరం చేసేందుకు, తద్వారా ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్ (ఎఐబిఇఎ) ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటాచలం విమర్శించారు. నేటి పాలకులు యాజమాన్యాలకు మద్దతునిస్తూ వారి పక్షం వహిస్తున్న నేపథ్యంలో యూనియన్లు, ఉద్యోగులు, కార్మికుల ఐక్యత మరింత అవసరమని, సమస్యల పరిష్కారానికి పోరాటం ఒక్కటే మార్గమన్నారు. శనివారం కాచిగూడలో కొటక్ మహీంద్రా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ (కెఎంబిఇయు) 31వ జాతీయ మహాసభకు కెఎంబిఇయు అధ్యక్షుడు వి.నాగ రాజ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిహెచ్. వెంకటాచలం మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులు ఉద్యోగుల శ్రమను మరింతగా దోపిడీ చేయడానికి పది గంటల పని విధానాన్ని తెచ్చేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 8 గంటల పని విధానం స్థానంలో పది గంటల విధానాన్ని తీసుకువచ్చేందుకు పాల కులు, కార్పొరేట్ శక్తులు వ్యూహాలు రచిస్తున్నారని, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దేశంలో అసంఘటిత రంగంలో ఉన్న దాదాపు 40 కోట్ల మంది కార్మికులకు సంఘాలే లేవని, సర్వీస్ కండిషన్లు లేవని, వారు పనిచేస్తున్న గంటలకు లెక్కనే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ బ్యాంకుల జాతీయకరణను వ్యతిరేకించిన వారే ప్రస్తుతం దేశాన్ని పరి పాలిస్తుండడం దుర దృష్టకరమన్నారు. బ్యాంకులు సృష్టిస్తున్న సంపద సంపన్నుల జేబుల్లోకి వెళుతున్నదన్నారు. సామాన్య ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింతగా అందు బాటు లోకి తీసుకురావడానికి ప్రైవేటు బ్యాంకులను జాతీయ కరణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొటక్ మహీంద్రా బ్యాంక్ సిహెచ్ఆర్ఓ అనుపమ్ కౌర మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో పోటీకి తట్టుకుని నిలబడాలన్నారు. కొటక్ బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు, డిమాండ్ త్వరలోనే బ్యాంక్ సానుకూల నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.



కెఎంబిఇయు 31వ జాతీయ మహాసభలో మాట్లాడుతున్న ఎఐబిఇఎ ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటాచలం




## యేడాది పాలనపై చర్చకు సిద్ధం

**ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి**

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పదేళ్ల బిఆర్‌ఎస్ పాలన యేడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం అని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. యేడాది పాలనపై 100 శాతం రండి చర్చించుకుందాం అంటూ సవాల్ విసిరారు. ఇరిగేషన్ మాత్రమే కాదు నీళ్లు, నిధులు, నియామకాలపై చర్చకు సిద్ధం అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల అభీష్టం వ్యతిరేకంగా పదేళ్ల బిఆర్‌ఎస్ పాలన సాగిందన్నారు. నీళ్ల ,నిధులు, నియామకాలపై తుంగలో తొక్కారు.. పదేళ్ల పాలనలో బిఆర్‌ఎస్ నేతలు చిత్త శుద్ధితో పనిచేస్తే తెలంగాణ అప్పుల కుప్పగా మారేదీ కాదని అన్నారు. పదేళ్ల పసిపాప ఎందుకు చిక్కిపోయింది.ఎందుకు ఐసియూకి పోవాల్సి వచ్చిందో ప్రజలకు తెలియాలని అన్నారు. గోదావరి, బనక చర్ల టాపిక్ తెచ్చి ఆంధ్ర సెంటిమెంట్ రెచ్చగొట్టాలని పిచ్చి ఆలోచనతో బిఆర్‌ఎస్ నేతలు ముందుకు వెళ్తున్నారని అన్నారు. బిఆర్‌ఎస్ నేతలను 70 ఎంఎంలో చూపిస్తాం, లోటు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రం ఎందుకు అప్పుల పాలయిందో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. సిఎం, మంత్రులను దుషించి వాస్తవాలకు దూరంగా బుర్ర, హరికథలు చెప్పుకుంటూ స్పీకర్‌ని సైతం దుషిస్తే మైకులు ఎంధుకు కట్ చేయరు?.. పదేళ్ల పాలన గురించి మీరు, యేడాదిన్నర పాలన గురించి మేము క్లారిటీగా మాట్లాడితే ప్రజలకి నిజాలు తెలిసిపోతాయని అన్నారు. నీళ్ల కోసం పోరాటం చేసినప్పుడు కృష్ణ పరివాహక ప్రాంతం 68 శాతం తెలంగాణలో ఉన్నప్పుడు అప్పుడు గాడిద పళ్లు తోమారా? అంటూ ప్రశ్నించారు. 811 టిఎంసిల ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కేటాయించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కంప్లీట్ చేయకముందే 22 కోట్ల రూపాయల యాడ్స్‌తో బిఆర్‌ఎస్ ప్రచారం చేసుకుందని, 299 టిఎంసిల నీళ్లను కాపాడుకుంటామని ప్రజలకు చెబుదాం రండి హరీష్ రావు, తెలంగాణను సస్య శ్యామలం చేద్దాం అన్న ధ్యాస బిఆర్‌ఎస్ నేతలకి లేదన్నారు. నీళ్ల విషయంలో ఆంధ్ర ప్రాంతం వాళ్ల అన్యాయం చేస్తే, బిఆర్‌ఎస్ ద్రోహం చేసిందన్నారు.

తెలంగాణకు 968, ఆంధ్రకు 511 వాట కేటాయించారు. పదేళ్లలో 968 టిఎంసిలను వాడుకునే ప్రయత్నం బిఆర్‌ఎస్ హయంలో జరగలేదని, తెలంగాణలో ఉన్న ఆర్థిక వనరులను తీసుకెళ్ళి కాళేశ్వరంపై పెడితే అది కాళేశ్వరం అయ్యిందన్నారు. పదేళ్ల దౌర్భాగ్య పాలన చేసి ప్రజెంటేషన్లు అంటూ కాంగ్రెస్ పార్టీపై బుదర జల్లే ప్రయత్నం చేస్తున్నారు అన్నారు. బనకచర్ల పేరుతో రేవంత్ రెడ్డి చంద్రబాబు శిష్యుడు అంటూ కెసిఆర్ ఫాం హౌజ్‌లో బిగ్ బాస్ తరహా షో పెట్టాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయలేని కెసిఆర్‌కి ప్రతి పక్ష హోదా ఎందుకు అన్నారు. కెసిఆర్‌కి బదులు మీరన్న ప్రతిపక్ష హోదా తీసుకొని చర్చకు రండి అన్నారు.

## ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు తొలిఅడుగు: కొమెర దుర్గారావు

**మాచర్ల, జులై 12 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు తొలి అడుగు పేరుతో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు స్పష్టం చేశారు. పట్టణంలోని 22వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టి ఇంటింటి ప్రచారం చేశారు. గడచిన ఏడాది కూటమి పాలనపై ప్రజల నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. వారికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, లేదా ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. కూటమి పార్టీలు ఇచ్చిన హామీ పేరకు పెన్షన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచి అందజేసినట్లు పేర్కొన్నారు. ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకం అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. ప్రచారంలో పట్టణ కార్యదర్శి బండ్ల శ్రీనివాసరావు, తమ్మిశెట్టి ఏడుకొండలు, డేరంగుల చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



## అడిగొప్పలలో సుపరిపాలనలో తొలి అడుగు

**మాచర్ల, జులై 12 ప్రభాతవార్త:** సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని దుర్గి మండలం అడిగొప్పలలో టీడీపీ నాయకులు, మాచర్ల మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అడిగొప్పల గ్రామంలోని ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ పాలనలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు, ఇళ్ల పట్టాలు వంటి సమస్యలను యాగంటి దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిగొప్పల 152వ బూత్ పరిధిలోని ఎస్సీ కాలనీ, మండల నాయకులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల దాసు, మండల పార్టీ అధ్యక్షులు జానకి రామయ్య, యాగంటి నరేష్, మాగులూరి నారయ్య, సూరే వెంకటేశ్వర్లు, ఆకుల చెన్నయ్య, మేకల రామారావు, పల్లె బుజ్జి, కొమ్ము ఆంధ్రయ్య, తిక్కా కొండలు, బొట్టు కోటేశ్వరరావు, దుర్భాకుల ప్రసాదరావు, గాజుల ఆంజనేయులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## మాచర్ల పట్టణంలో సుపరిపాలనలో తొలి అడుగు

**మాచర్ల, జులై 12 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలోని 8వ వార్డు రోప్‌లైన్ కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానిన్ని టీడీపీ నాయకులు మద్దిగపు శ్రీనివాసరెడ్డి (బుల్లిరెడ్డి), వి.రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని అన్నారు. ప్రభుత్వం ఏడాదిగా చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. స్థానికులతో మాట్లాడి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్నారన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు ప్రజలకు వివరించేలా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సీఎం రూపొందించారన్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సహకారంతో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముందుచూపుతో మాచర్ల నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతుందని వెల్లడించారు. రాజకీయం అంటే అధికారం చెలాయించడం



కాదు, ప్రజలిచ్చిన అధికారాన్ని దేశ, రాష్ట్ర ప్రజల అభివృద్ధికి వినియోగించడం అని తెలిసిన వ్యక్తి సీఎం చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మద్దిగపు శ్రీనివాసరెడ్డి (బుల్లిరెడ్డి), 62వ బూత్ ఇన్‌ఛార్జి వంకాయలపాటి రాజీవ్‌కుమార్, 86వ బూత్ ఇన్‌ఛార్జి గెల్లెపోగు మరియదాసు, కంచర్ల నాగార్జున, తుళ్లూరి శ్రీకాంత్, బిట్టు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళల ప్రపంచకప్‌లో..

# వంతిక సంచలనం

## వరల్డ్ మాజీ ఛాంపియన్ ఉషెనినా ఓటమి

**న్యూఢిల్లీ:** ఫిడే మహిళల చెస్ ప్రపంచ కప్-2025లో భారత క్రీడాకారిణి వంతికా అగర్వాల్ ట్రైబ్రేకర్లలో మాజీ ప్రపంచ ఛాంపియన్ అన్నా ఉషెనినాను ఓడించి సంచలన విజయంతో మూడో రౌండ్‌కు చేరుకుంది. ఉషెనినాతో జరిగిన రెండో క్లాసికల్ గేమ్‌లో బ్లాక్ పావులతో ఓడిపోయిన తర్వాత ట్రైబ్రేక్‌లోకి వెళ్లాల్సి వచ్చిన అగర్వాల్, బ్లిట్జ్ ట్రైబ్రేక్‌లలో నిర్ణయాత్మక దెబ్బ కొట్టింది. 15 నిమిషాల మరియు 10 నిమిషాల రాపిడ్ టైమ్ కంట్రోల్ ట్రైబ్రేక్ గేమ్‌లలో అగర్వాల్ మరియు ఉషెనినా డ్రాగా ముగిసిన తర్వాత ఇది జరిగింది. ట్రైబ్రేకర్లలో అగర్వాల్ తొలి బ్లిట్జ్ గేమ్‌ను తెల్ల పావులతో గెలిచి, తన ప్రతిభను చాటుకుంది. ముందుకు సాగడానికి ఒక డ్రా మాత్రమే అవసరం కావడంతో, నల్ల పావులతో పటిష్టమైన రక్షణాత్మక ఆటతో భారత క్రీడాకారిణి తన స్థానాన్ని నిలుపుకుంది. ఉషెనినాతో జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో అగర్వాల్ 4-5, 3-5 తేడాతో విజయం సాధించి మూడవ రౌండ్‌లోకి ప్రవేశించింది. అయితే పద్మిని రౌత్, ప్రియాంక కె ఈ టోర్నీ నుండి నిష్క్రమించారు. మరో చోట, ఇద్దరు భారతీయులు పద్మిని రౌత్ మరియు ప్రియాంక ట్రైబ్రేకర్లలో తమ తమ మ్యాచ్‌లను ఓడిపోయి పోటీకి వీడ్కోలు పలికారు. అలెగ్జాండ్రా కోస్టెనిక్‌తో తలపడిన రౌట్, ట్రైబ్రేక్‌లలో ఎక్కువ భాగం తన ఆధిక్యాన్ని నిలుపుకుంది కానీ చివరికి బ్లిట్జ్ సమయ నియంత్రణలో విఫలమైంది. ఇద్దరి మధ్య జరిగిన రెండు క్లాసికల్ గేమ్‌ల మాదిరిగానే, 15 నిమిషాల రాపిడ్ గేమ్‌లు డ్రాగా ముగిశాయి.



ఆట

# ఎటిపి ఛాలెంజర్‌లో సెమీస్‌కు సుమిత్

## మార్జిమ్‌పై మూడు సెట్ల ఘన విజయం

**న్యూఢిల్లీ:** ఎటిపి ఛాలెంజర్‌లో భారత ఆటగాడు సుమిత్ నాగల్ మార్జిమ్ మ్రావ్వాపై మూడు సెట్ల విజయంతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. ఈ టోర్నీలో సుమిత్ తన రెడ్‌హాట్ ఫామ్‌ను కొనసాగించాడు, చెక్ రిపబ్లిక్‌కు చెందిన రైజింగ్ స్టార్ మార్జిమ్ మ్రావ్వాను 6-1, 3-6, 6-1 తేడాతో ఓడించి సెమీఫైనల్లో స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. తొలి సెట్‌లో రెండుసార్లు మ్రావ్వాను బ్రేక్ చేసిన అద్భుతమైన ఆరంభం తర్వాత, చెక్ ఆటగాడు ఘనమైన రిటర్న్‌లు మరియు మెరుగైన కోర్టు కవరేజ్‌తో స్పందించడంతో నాగల్ రెండవ సెట్‌లో నెట్టబడ్డాడు. అయితే నాగల్ త్వరగా తిరిగి కోలుకుని క్లిష్టమైన క్షణాల్లో సమతుల్యత మరియు పరిపక్వతను ప్రదర్శించి, నిర్ణయాత్మక జట్టుపై ఆధిపత్యం చెలాయించాడు. నాగల్ అత్యుత్తమ స్థిరత్వాన్ని ప్రదర్శించడంతో మొత్తం 74 పాయింట్లను గెలుచుకున్నాయి, మ్రావ్వా 55 పాయింట్లు సాధించాడు, మ్రావ్వా 4/5తో పోలిస్తే 7/8 బ్రేక్ పాయింట్లను మార్చాడు, మొదటి సర్వ్‌లో 67 శాతం విజయం మరియు రెండవ సర్వ్‌లో 56 శాతం విజయం సాధించాడు. అతను 32 రిసీవింగ్ పాయింట్లను కూడా గెలుచుకున్నాడు. నాగల్ కేవలం 1 ఏస్ మాత్రమే కొట్టి 2 డబుల్ ఫాల్ట్‌లు చేసినప్పటికీ, అతను సుదీర్ఘ ర్యాలీలలో స్థిరంగా నిలిచి బేస్‌లైన్ ఎక్స్ఛేంజ్‌లలో మ్రావ్వాను అధిగమించాడు. వరుసగా అతనికి గరిష్టంగా 11 పాయింట్లు లభించాయి. ఈ విజయంతో, నాగల్ ఇప్పుడు ట్రీస్టేలో వరుసగా ఐదు మ్యాచ్‌లను గెలుచుకున్నాడు.

# డైమండ్ లీగ్‌లో అవినాష్ ఔట్

**న్యూఢిల్లీ:** మొనాకోలో జరిగిన 2025 డైమండ్ లీగ్ మీట్‌లో పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో భారత అథ్లెట్ అవినాష్ సాబుల్ పరుగు పందెంలో పడిపోవడంతో మధ్యలోనే నిష్క్రమించాడు. 30 ఏళ్ల సాబుల్ తన పరుగుకు ఒక నిమిషం కంటే ఎక్కువ సమయం ఉండగా, తన ముందు నడుస్తున్న పోటీదారుని ఎదుర్కొనే ప్రయత్నంలో బ్యాలెన్స్ కోల్పోయి వాటర్ రన్ సమయంలో జారిపడ్డాడు. ఈ పతనం వల్ల ఆసియా ఛాంపియన్ రేసు నుండి వైదొలగాల్సి వచ్చింది, అతని పేరుకు ఎదురుగా దీవీసీ రికార్డ్ అయింది. స్టేడ్ లూయిస్ ॥ స్టేడియంలో ఉన్న వాలంటీర్ల సహాయంతో సేబుల్‌ను ట్రాక్ నుండి కుంటుతూ కనిపించాడు. రెండుసార్లు ఒలింపిక్ ఛాంపియన్ అయిన మొరాకోకు చెందిన సౌఫియానే ఎల్ బక్కాలి 8:03.18 సెకన్లలో గమ్యాన్ని చేరుకుని రేసును గెలుచుకున్నాడు. ఈ సంవత్సరం మే ప్రారంభంలో జరిగిన 2025 ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో సేబుల్ బంగారు పతకాన్ని గెలుచుకున్నప్పటికీ, ఇప్పటివరకు అతను ఈ సీజన్‌లో తన అత్యుత్తమ ప్రదర్శనను కనబరచలేదు. ఈ సంవత్సరం అతను ఇంకా 8:20 సెకన్ల కంటే తక్కువ సమయం తగ్గలేదు మరియు దక్షి ణ కొరియాలోని గుమిలో జరిగిన ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో నమోదు చేసిన 8:20.92 సెకన్ల సీజన్ బెస్ట్‌ను కలిగి ఉన్నాడు. టోక్యోలో 2025 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లు వేగంగా సమీపిస్తున్న తరుణంలో, మొనాకోలో పతనం సేబుల్‌కు మరియు ప్రపంచ వేదికపై భారతదేశం మంచి ప్రదర్శన ఇవ్వాలనే ఆశలకు మరింత ఆటంకం కలిగిస్తుంది.







# ఆసియా కప్ 2025 రద్దు

## కీలక నిర్ణయం దిశగా భారత్, శ్రీలంక

**న్యూఢిల్లీ:** మరో రెండు నెలల్లో జరగాల్సిన ఆసియా కప్-2025 మరింత ఇబ్బందుల్లో పడింది. ఇప్పుడు టోర్నమెంట్ రద్దు అయ్యే అవకాశం ఉంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి, శ్రీలంక క్రికెట్ కీలక అడుగు వేసి జులై 24న ఢాకాలో జరగనున్న ఆసియా క్రికెట్ కౌన్సిల్ సమావేశానికి హాజరు కాకూడదని నిర్ణయించుకున్నాయి. ఆరు దేశాల ఆసియా కప్ టోర్నీ ప్రారంభానికి రెండు నెలల కన్నా తక్కువ సమయం మిగిలి ఉన్న నేపథ్యంలో రెండు బోర్డులు ఈ నిర్ణయం తీసుకున్నాయి. సమావేశం ప్రణాళిక ప్రకారం జరుగుతుందని ఏసీసీ ధృవీకరించినప్పటికీ, భారత్, శ్రీలంక లేకపోవడం ఈ టోర్నమెంట్ భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తోంది. ఈసారి ఆసియా కప్ టీ20 ఫార్మాట్‌లో జరగనుంది. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 5 నుంచి ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి. కానీ అంతకు ముందు, ఈ నెల 24న ఢాకాలో జరగనున్న ఏసీసీ సమావేశంలో బీసీసీ, శ్రీలంక క్రికెట్ పాల్గొనకపోవడం వల్ల టోర్నమెంట్ జరగడంపై ప్రశ్నలు తలెత్తాయి. ఏసీసీ సమావేశం ఢాకాలో జరగడంపై బీసీసీఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ ప్రస్తుతం ఏసీసీ అధ్యక్షుడిగా ఉన్నారు. భారత జట్టు బంగ్లాదేశ్ పర్యటనను నిరవధికంగా వాయిదా వేయాలని బీసీసీఐ ఇటీవల బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)ని ఒప్పించింది. ఈ పర్యటన ఆగస్టులో జరగాల్సి ఉంది. కానీ ఏసీసీ ఢాకాలో తన సమావేశాన్ని నిర్వహించింది, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) హైబ్రిడ్ మోడల్‌పై అంగీకరించిందని, దీని కింద పాకిస్తాన్ వేరే దేశంలో ఏదైనా అంతర్జాతీయ టోర్నమెంట్‌లో భారత్‌తోమ్యాచ్‌లు ఆడుతుందని స్పష్టమవుతోంది. యాదృచ్ఛికంగా బీసీసీఐ, శ్రీలంక క్రికెట్ ఆగస్టులో పరిమిత ఓవర్ల సిరీస్‌ను నిర్వహించాలని యోచిస్తున్నాయి. ఏసీసీ తన అధికారులను ఢాకాకు పంపడానికి బోర్డు నిరాకరించింది. ఆసియా కప్ వాయిదావేస్తే, బీసీసీసీ మరోసిరీస్ నిర్వహించాలని పరిశీలిస్తోంది. ఆసియా కప్ సెప్టెంబర్ 5 నుంచి జరిగే అవకాశం ఉంది. ఆ సమయంలో భారతదేశంతో క్రికెట్ ఆడటానికి శ్రీలంక, ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ఆసక్తి చూపుతోంది. ఈ సంవత్సరం పాకిస్తాన్ హాకీ జట్లకు ఆతిథ్యం ఇవ్వడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా క్రికెట్ విషయంలో స్పష్టత రాలేదు. ఏసీసీ శ్రద్ధ చూపకపోతే, బీసీసీఐ కూడా ఆసియా కప్ నుంచి వైదొలగవచ్చు.

ఆర్చరీ ప్రపంచ కప్‌లో..

# సెమీస్‌కు సురేఖ, ఫర్నీత్

## రెండో రౌండ్‌లోనే నిష్క్రమించిన రిషబ్, అమన్



**న్యూఢిల్లీ:** ఈ సీజన్‌లో జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్ నాల్గవ దశలో భారత క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ, పర్నీత్ కౌర్ కాంపౌండ్ మహిళల సెమీఫైనల్‌కు చేరారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో అగ్రస్థానంలో నిలిచిన జ్యోతి, క్వార్టర్ ఫైనల్‌లో టర్కిష్ ఆర్చర్ హజల్ బురున్‌ను 147-144 తేడాతో ఓడించి, కొరియాకు చెందిన హాన్ సెంగ్యోన్‌తో ఫైనల్‌ఫోర్ మీట్‌కు సిద్ధమైంది. ఇక పర్నీత్ టర్కీకి చెందిన ఓజ్నూర్ క్యూర్ గిర్డిని 142-141 తేడాతో ఓడించి తన తొలి ప్రపంచ కప్ సెమీఫైనల్‌కు చేరుకుంది. అర్హత రౌండ్‌లో ఆమె 702 పాయింట్లతో తన వ్యక్తిగత అత్యుత్తమ స్కోరు 704 కంటే కేవలం రెండు పాయింట్లు దూరంలో ఉంది. ఇప్పుడు ఆమె మొదటి ప్రపంచ కప్ పోడియంకు రెండు మ్యాచ్‌ల దూరంలో ఉంది. సెమీఫైనల్‌లో కౌర్ ప్రస్తుత యూరోపియన్ ఛాంపియన్ గిబ్సన్‌తో తలపడుతుంది, ఆసియా క్రీడల ఛాంపియన్ మరియు సహచరురాలు జ్యోతి లేదా అంటాల్య రన్నరప్ హాన్‌గ్యోన్‌తో ఫైనల్ (లేదా కాంస్య ఫైనల్)లో తలపడుతుంది. పురుషుల వ్యక్తిగత ఈవెంట్‌లో టాప్ సీడ్ రిషబ్ యాదవ్, అమన్ సైని, ప్రియాంష్ అందరూ రెండో రౌండ్‌లోనే నిష్క్రమించగా, ప్రథమేష్ బాలచంద్ర ఫుగే తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. రికర్వ్ ఆర్చరీలో, పురుషులు మరియు మహిళల జట్లు తమ తొలి రౌండ్‌లోనే నిరాశపరిచాయి. నాల్గవ సీడింగ్ కారణంగా రెండవ రౌండ్ నుండి తమ ప్రచారాన్ని ప్రారంభించిన అంకితా భకత్, దీపికా కుమారి మరియు 15 ఏళ్ల అరంగేట్రం క్రీడాకారిణి గతా ఖడకేలతో కూడిన మహిళల త్రయం ఫ్రాన్స్ చేతిలో 35 తేడాతో ఓడిపోయింది. పురుషుల త్రయం ధీరజ్ బొమ్మదేవర, రాహుల్ సింగ్ మరియు నీరజ్ చౌహాన్ బ్రెజిల్ చేతిలో 26 తేడాతో ఓడిపోయారు.



# వాణిజ్యం

# ఐఫోన్17 తయారీ భారత్‌లోనే!

## ఇప్పటికే చైనా నుంచి విడిభాగాల దిగుమతి

**ముంబయి, జూలై 12:** ఆపిల్ ఐఫోన్17 తయారీ భారత్‌లో రెడీ అవుతోంది. ఇందుకు సంబంధించిన విడిభాగాలను ఐఫోన్‌లు తయారు చేసే ఫాక్స్‌కాన్ కంపెనీ ఇప్పటికే దిగుమతి చేసుకుంది. చైనా నుంచి ఫాక్స్‌కాన్ దిగుమతి చేసుకున్న విడిభాగాలను చూస్తే కస్టమ్స్ రికార్డుల్లో పదిశాతం ఐఫోన్ 17 విడిభాగాలే ఉన్నాయి. ఐఫోన్14, ఐఫోన్16 మోడళ్లకు సంబంధించిన విడిభాగాలతో పాటు ఐఫోన్ 17 భాగాలు కూడా ఉన్నట్లు తేలింది. అలాగే ఉత్పత్తిని పెంచడంతోపాటు ఐఫోన్ 17 తయారీ ఈనెలలోనే ప్రారంభం అవుతుంది. భారీస్థాయిలో ఉత్పత్తిని మాత్రం ఆగస్టు మొదటి వారం నుంచే ప్రారంభిస్తుంది. మొత్తంగాచూస్తే అధికారికంగా సెప్టెంబరులోనే ఐఫోన్17 లాంచ్ చేయాలన్న లక్ష్యంతో ఉన్నట్లు అంచనా. అటు చైనా, ఇటు భారత్ రెండు దేశాల్లోను ఐఫోన్17ను ఉత్పత్తి చేయాలని ఆపిల్ సంస్థ భావిస్తోంది. వాస్తవానికి ఆపిల్ కంపెనీ చైనా తయారీ ఐఫోన్ల కంటే భారత్‌లో తయారయ్యే ఐఫోన్లనే అమెరికా మార్కెట్‌కు తరలించాలని యోచిస్తోంది. 2026 నాటికల్లా అమెరికా మార్కెట్‌లో భారత్ తయారీ ఐఫోన్లు ఉంటాయని అంచనా. గడచిన కొన్నేళ్లుగా ఆపిల్ కంపెనీ చైనా, భారత్ యూనిట్లలోనే ఉత్పత్తి అవుతున్నాయి. ఐఫోన్ 14 భారత్‌లో అయితే చైనాలో తయారయిన ఆరువారాల తర్వాత ప్రారంభం అవుతుంది. అయితేఐఫోన్15 మాత్రం ఏకకాలంలో రెండుదేశాల్లోను తయారయ్యాయి. తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ ఆపిల్ కంపెనీ అతిపెద్ద తయారీదారుగా నిలిచింది. భారత్‌ల బెంగళూరులో అతిపెద్ద అసెంబ్లింగ్ యూనిట్‌ను ఏర్పాటుచేసింది. చైనాలో తన ఉత్పత్తిని మరింత పటిష్టం చేయడంతో బెంగళూరు యూనిట్‌లో సిబ్బందిని కుదిస్తోంది. చైనా కస్టమ్స్‌పరంగా కొన్ని ఆంక్షలవల్ల కీలక విడిభాగాలు దిగుమతులకు ఆటంకం కలగుతున్నది. దీనివల్ల భారత్ తయారీలో ఐఫోన్17కు జాప్యం జరిగే అవకాశంలేకుండా ఈ సారి ముందస్తు వ్యూహంతోనే విడిభాగాలను దిగుమతి చేసుకుంది. దీనితో ఈనెల చివరినుంచే ఐఫోన్17 తయారీ సెప్టెంబర్‌లో లాంచింగ్ జరిపే విధంగా ఆపిల్ సన్నాహాలు చేస్తోంది.





# మెర్సిడెస్ బెంజ్ అమ్మకాల జోరు

**ముంబై, జులై 12:** మెర్సిడెస్ బెంజ్ ఇండియా 2025 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 4,238 యూనిట్లకు విక్రయించినట్లు కంపెనీ తెలిపింది. ఇది గత సంవత్సరం కంటే 10శాతం వృద్ధి చెందింది. కోర్, టాప్-ఎండ్ లగ్జరీ వాహనాలకు బలమైన డిమాండ్‌తో మొదటి త్రైమాసికం 2026లో అత్యుత్తమ అమ్మకాల పనితీరు సాధించబడింది. ఈ అమ్మకాల ఊపు టాప్-ఎండ్ లగ్జరీ బిఇవి పోర్ట్‌ఫోలియోలో బలమైన త్వరణం ద్వారా కూడా నడపబడింది. ఇది మొత్తం అమ్మకాల పరిమాణంలో దాని వ్యాప్తిని పెంచింది అని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. విక్రయ ప్రవేశ విభాగంలో ధరల సవాళ్లతో సహా విదేశీ ఫోరెన్సి హెచ్చుతగ్గులు, ధరల పెరుగుదల, మార్కెట్ డైనమిక్స్ వంటి సూక్ష్మ-ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ రికార్డు అమ్మకాల పనితీరు సాధించబడిందని వెల్లడించింది. టాప్-ఎండ్ లగ్జరీని బలోపేత చేయడంపై మా పదునైన దృష్టి కస్టమర్ ప్రాధాన్యతలను ప్రభా వితం చేయడంలో, మెర్సిడెస్ బెంజ్‌ను భారత దేశంలో అత్యంత లగ్జరీ బ్రాండ్‌గా విభిన్నంగా మార్చడంలో విజయవంతమైంది అని మెర్సిడెస్-బెంజ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్అండ్ సిఇఒ సంతోష్ అయ్యర్ అన్నారు. కంపెనీ తన బెస్ట్ సెల్లింగ్ లగ్జరీ ఎస్‌యువిలలో ఒకదానికి స్పోర్టీ డైనమిక్ క్యారెక్టర్‌ను అందిస్తూ జిఎల్ఎస్ ఎఎంజి లైన్ లగ్జరీ ఎస్‌యువిని ప్రారంభించినట్లు కూడా ప్రకటించింది.




# వచ్చే వారం 127 కంపెనీల త్రైమాసిక ఫలితాలు..

**ముంబై, జులై 12:** వచ్చే వారం దాదాపు 127 కంపెనీలు తమ మొదటి త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించనున్నాయి. ఈ కంపెనీలు 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఆదాయాలను సమీక్షించి ఆమోదించడానికి తమ బోర్డు సమావేశాలను నిర్వహిస్తాయి. ఈ కంపెనీలు ఫైనాన్స్, మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీతో సహా వివిధ రంగాలకు చెందినవి. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీసంస్థ ఓలా ఎలక్ట్రిక్, అగ్రశ్రేణి రుణదాతలు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకుల ఫలితాలను కూడా నిశితంగా పరిశీలిస్తారు. టాటా గ్రూప్ సంస్థలు టాటా టెక్నాలజీస్, టాటా కమ్యూనికేషన్స్ కూడా ఈ వారం ఆదాయాలను ప్రకటించనున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి కంపెనీ ఆర్థిక ఫలితాలను జులై 18న ప్రకటించనుంది. జులై 14న ఆటమ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, బెనారస్ హోటల్స్ లిమిటెడ్, సెటాడెల్ రియాల్టీ అండ్ డెవలపర్స్ లిమిటెడ్, భవానీ కేబుల్ టెల్ అండ్ డేటాకామ్ లిమిటెడ్, ఇన్ఫోమీడియా ప్రెస్ లిమిటెడ్, ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్, రాయల్ ఇండియా కార్పొరేషన్ లిమిటెడ్, సంభవ్ స్టీల్ ట్యూబ్స్ లిమిటెడ్, టాటా టెక్నాలజీస్ లిమిటెడ్, తేజస్ నెట్‌వర్క్స్ లిమిటెడ్, షార్ప్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్, స్పేస్ ఇంక్యుబాట్రిక్స్ టెక్నాలజీస్ లిమిటెడ్, శ్రీ స్టీల్ వైర్ రోప్స్ లిమిటెడ్, ఆర్‌జిఎఫ్ కేపిటల్. జులై 15న జియోజిత్ ఫైనాన్షియల్ హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ ఇన్సూరెన్స్, ఐసిఐసిఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్. జులై 16న ఏంజెల్ వన్ లిమిటెడ్, డి.బి.కార్ప్ లిమిటెడ్, ఐటిసి హోటల్స్ లిమిటెడ్. జులై 17న హెచ్‌డిఎఫ్‌సి అసెట్ మేనేజ్‌మెంట్, హెరిటేజ్ ఫుడ్స్, ఇండియన్ హోటల్స్, జియోఫైనాన్షియల్, పాలీక్యాబ్ ఇండియా, షాపర్స్ స్టాప్ లిమిటెడ్, సౌత్ ఇండియన్ బ్యాంకు. జులై 18న ఎఎస్ఐ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఎల్‌అండ్‌టిఫైనాన్స్, మహీంద్రా ఇపిసి ఇరిగేషన్, మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్. జులై 19న ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు లిమిటెడ్, ఇండియా సిమెంట్స్ లిమిటెడ్, జెకె సిమెంట్ లిమిటెడ్, శేషసాయి పేపర్ అండ్ బోర్డ్స్ లిమిటెడ్ వంటి తదితర సంస్థలు ఫలితాలను వెల్లడించనున్నాయి.




# 'ఎక్స్' ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌పై భారీ తగ్గింపు

**వాషింగ్టన్, జులై 12:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన సామాజిక మాధ్యమం ఎక్స్ భారత్‌లోని యూజర్లకు గుడ్‌న్యూస్ చెప్పింది. దేశంలో ఎక్కువ మంది యూజర్లకు చేరువయ్యేందుకు ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌ను భారీగా 48శాతం తగ్గిస్తున్నట్లు తన నిర్ణయాన్ని ప్రకటించింది. భారత్‌లోని యూజర్లకు ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ కోసం ఇప్పటివరకు నెలకు రూ.900 వసూలు చేయగా.. దానిని రూ.470కి తగ్గించింది. ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌ను తీసుకున్న వినియోగదారులు బ్లూటిక్ పొందడం సహా సుదీర్ఘ పోస్టులు చేసుకోవడానికి సంస్థ వీలు కల్పిస్తోంది. వెబ్ మోడ్‌లో ఎక్స్‌ను వినియోగించే వారికి ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ కూడా ఇప్పుడు రూ.650 నుంచి నెలకు రూ.427కి తగ్గించింది. నెలవారీ బేసిక్ సబ్‌స్క్రిప్షన్ ఛార్జీలను రూ.243.75 నుంచి రూ.170కి దాదాపు 30 శాతం తగ్గించింది. బేసిక్ వినియోగదారుల వార్షిక సబ్‌స్క్రిప్షన్‌లను కూడా రూ.2,590.48 నుంచి రూ.1,700 తగ్గించినట్లు ఎక్స్ వెల్లడించింది. తన ప్లాట్‌ఫామ్ ఆదాయాన్ని పెంచుకోనేందుకు ఎక్స్ 2023 అక్టోబర్‌లో తొలి సారి ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ తీసుకొచ్చింది. యాడ్ ఫ్రీ ఎక్స్‌పీరియన్స్, సుదీర్ఘ ఆర్టికల్స్ రాసే సౌలభ్యం, సూపర్‌గ్రోక్, గ్రోక్ 4 వంటి ఎఐ ఫీచర్ వంటి ప్రత్యేక యాక్సెస్‌ను ఇది వినియోగదారులకు అందిస్తోంది. ఈ ప్లాన్‌ను కూడా తాజాగా రూ.3,470 నుంచి రూ.2,570కి తగ్గించినట్లు ఎక్స్ వెల్లడించింది. మొబైల్‌లో ప్రీమియం ప్లస్ ప్లాన్‌ను వినియోగించే వారికి గతంలో నెలకు రూ.5,100 ఖర్చు అవుతుండగా, ప్రస్తుత తగ్గింపుతో కేవలం రూ.3,000లకే అందుబాటులోకి వస్తోంది.



# ఐపిఒకు ఇన్‌ఫ్రా సామగ్రి లీజింగ్ కంపెనీ

**ముంబై, జులై 12:** ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పరికరాలను అద్దెకిచ్చే అగ్‌కాన్ ఎక్విప్‌మెంట్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు అనుగుణంగా కేపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలుచేసింది. ఐపిఒలో భాగంగా రూ.332కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా కంపెనీ ప్రమోటర్లు 94 లక్షల షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ.168 కోట్లు రుణ చెల్లింపులకు, రూ.84 కోట్లు పరికరాల కొనుగోళ్లకు, మరికొన్ని నిధులు సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. 2003లోఏర్పాటైన హర్యానా కంపెనీ ప్రధానంగా మౌలిక రంగ కంపెనీలకు పరిశ్రమ సంబంధిత పరికరాలను అద్దె ప్రాతిపదికన సమకూర్చుతుంది. గతేడాది ఆదాయం 20శాతం పెరిగి రూ.164 కోట్లకు చేరగా, నికర లాభం 36శాతం పెరిగి రూ.31 కోట్లకు చేరింది.




# సావరిన్ ఫండ్స్ పెట్టుబడుల తేదీ పొడిగింపు

**న్యూఢిల్లీ, జులై 12:** ఆర్థిక చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత బడ్జెట్ ప్రకటనను అమలు చేయడానికి, పన్ను మినహాయింపులను పొందడానికి 40 సావరిన్ వెల్త్ ఫండ్స్ (ఎస్‌డబ్ల్యూఎఫ్‌లు), పెన్షన్ ఫండ్స్ (పిఎఫ్‌లు) పెట్టుబడి పెట్టే తేదీని మరో ఐదు సంవత్సరాలు పొడిగిస్తున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫై చేసింది. ఇంతకు ముందు ఈ మినహాయింపు మార్చి 31, 2025న ముగిసింది. కానీ ఇప్పుడు మార్చి 31, 2030 వరకు చేసిన పెట్టుబడిపై వచ్చే ఆదాయానికి ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది. ప్రయోజనం పొందే నిధులలో ఎంఐసి రెడ్‌వుడ్ 1 ఆర్ఎస్‌సి లిమిటెడ్ అబుదాబి, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన ఎస్‌డబ్ల్యూఎఫ్, డాగెన్‌హామ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, సింగపూర్‌కు చెందిన ఎస్‌డబ్ల్యూఎఫ్, ఎఐఎంసిఒ ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్, క్రైస్సే డి డిపోట్ ఎట్ ప్లేస్‌మెంట్ డు క్యూబెక్, బ్రిక్లేయర్స్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, డాగెన్‌హామ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ నార్ఫండ్, నార్వే ప్రభుత్వంతో పాటు ఇతరులు ఉన్నారు. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 10లోని క్లాజ్ (23ఎఫ్ఇ) డివిడెండ్, వడ్డీ, దీర్ఘకాలిక మూలధన లాభాలు, భారతదేశంలో చేసిన పెట్టుబడి నుంచి ఉత్పన్నమయ్యే కొన్ని ఇతర ఆదాయంలో పేర్కొన్న వ్యక్తులకు ఆదాయం నుంచి మినహాయింపును అందిస్తుంది. నిర్దిష్ట వ్యక్తులలో ఎస్‌డబ్ల్యూఎఫ్, పిఎఫ్ ఉన్నాయి. ఇవి కొన్ని షరతులను నెరవేరుస్తాయి. కేంద్ర ప్రభుత్వం ద్వారా తెలియచేయబడతాయి. అటువంటి షరతు ప్రకారం, పేర్కొన్న పెట్టుబడి చేసిన తేదీ నుంచి ప్రారంభమై గడువు తేదీలోపు అటువంటి పెట్టుబడిని రద్దు చేసిన తేదీ వరకు గడువులోని అన్ని సంబంధిత మునుపటి సంవత్సరాలకు అసెస్సీ ఆదాయ రిటర్న్ దాఖలు చేయాలి. మరొక షరతు ప్రకారం అంచనాదారుడు భారతదేశం లోపల లేదా వెలుపల ఇలాంటి స్వభావం గల పెట్టుబడి తప్ప మరే ఇతర వాణిజ్య కార్యకలాపాలను చేపట్టకూడదు.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14